# అధ్యాయం II

## పనితీరు పై తనిఖీ

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం(2.1), మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకం (2.2), విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా) (2.3), రాజీవ్ యువశక్తి (2.4) - ఈ అంశాల మీద పనితీరు తనిఖీ సమీక్షలు ఈ అధ్యాయంలో ఉన్నాయి.

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, వికలాంగుల సంక్షేమ శాఖ

### 2.1 సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం

కార్య సంగ్రహం

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసిడిఎస్) అనే కేంద్ర ప్రాయోజిత పథకాన్ని రాష్ట్రమంతటా 1975 అక్టోబరులో ప్రారంభించారు. ఆరేళ్లలోపు పిల్లలు, కిశోర ప్రాయంలోని బాలికలు (11-18 సంవత్సరాల వయసు), గర్భిణీలు, బాలింతల పరిపూర్ణ అభ్యున్నతికి ఈ పథకం రూపొందించారు. అదనపు పోషకాహారం, వ్యాధి నిరోధక మందులు, ఆరోగ్య పరీక్షలు, పోషకాలు - ఆరోగ్యంపై అవగాహన , 3-6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య వంటి సౌకర్యాల ద్వారా ఈ పథకం లక్ష్యాలను సాధించవలసి ఉంది.

ఐ.సి.డి.ఎస్. పథకం అమలు చేయటానికి భారత ప్రభుత్వం విడుదల చేసిన రూ1,966 కోట్లతో కలుపుకొని 2005-10 ఐదు సంవత్సరాల కాలానికి రూ3,633 కోట్లు బడ్జెటులో కేటాయించారు. ఇందులో రూ2,783 కోట్లు ఖర్చు చేశారు.

ఈ కార్యక్రమం అమలు తీరును గతంలో సమీక్షించి, వెల్లడైన విషయాలను 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిటు నివేదికలో పొందుపరచటం జరిగింది. 1998-99 ఆడిట్ నివేదికలోని అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తదుపరి చర్యగా ఆడిట్ పరిశీలించింది. భారత కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ చేసిన సిఫార్సులపై డిపార్టుమెంటు తీసుకున్న చర్యలను శాసనసభకు తెలియచేయటమే ఈ పరిశీలన ఉద్దేశ్యం.

ఇప్పుడు 2005-06 నుంచి 2009-10 సంవత్సరాలలో పనితీరును సమీక్షించటం జరిగింది. ఇందుకోసం రాష్ట్ర సచివాలయం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేటు, 23 కు గాను 7[1] జిల్లాలలోని శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారుల (సి.డి.పి.ఓ.) కార్యాలయాలు, అంగన్ వాడీ కేంద్రాల రికార్డులను మచ్చుకు పరిశీలించటం జరిగింది.

ఆడిట్ సిఫార్సులను డిపార్టుమెంటు వారు అమలు చేయలేదు. అప్పటి లోటుపాట్లు 2005-10 మధ్య ఐదు సంవత్సరాల కాలంలోనూ కొనసాగుతూనే ఉన్నాయి.

---

[1] అనంతపురం (8 ప్రాజెక్టులు), చిత్తూరు (11 ప్రాజెక్టులు), తూర్పుగోదావరి (14 ప్రాజెక్టులు), గుంటూరు (8 ప్రాజెక్టులు), కర్నూలు(6 ప్రాజెక్టులు), నల్గొండ (14 ప్రాజెక్టులు), విశాఖపట్టణం(8 ప్రాజెక్టులు)

**ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలు/ ప్రధానాంశాలు**

- 2005-06 నుంచి 2009-10 మధ్యకాలంలో ఐ.సి.డి.ఎస్. క్రింద కేటాయించిన నిధులు, అదనపు పోషకాహార పథకం (ఎస్.ఎన్.పి.) నిధులు 8 నుంచి 40 శాతం వరకూ ఖర్చు కాకుండా మిగిలిపోయాయి. అంగన్ వాడీ కేంద్రాల ఏర్పాటులో కొరత, పోషణలో అంతరాయాలు వంటి లోటుపాట్లను ఆడిట్ గమనించింది.
- అంగన్ వాడీ కేంద్రాలలో కొరత పట్టణ/గ్రామీణ ప్రాంతాలలో 26,362 (28 శాతం), గిరిజన ప్రాంతాలలో 1,237 కేంద్రాల (20 శాతం) మేర ఉంది. రెండు లక్షల పైబడిన జనాభా గల ప్రాజెక్టులను బలోపేతం చేయాలని భారత ప్రభుత్వం 2008 నవంబరులోనే సూచించినా అది సాధించలేదు. రంగారెడ్డి జిల్లాలో రెండు అర్బన్ ప్రాజెక్టులు, అమలులో వున్న ప్రాజెక్టులలో 9,743 అదనపు అంగన్ వాడీ కేంద్రాలను భారత ప్రభుత్వం 2008 డిశంబరులో మంజూరు చేసినా వాటిని ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు.
- నాబార్డు/ ప్రపంచ బ్యాంకు సాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోలేక అంగన్‌వాడీ నిర్మాణాలు కుంటు పడ్డాయి. మచ్చుకు తనిఖీ చేసిన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో 72 శాతం పైగా అంగన్ వాడీ కేంద్రాలలో రక్షిత మంచినీరు, మరుగు దొడ్ల వంటి కనీస మౌలిక వసతులు లేవు. వంటకీ, వడ్డనకీ అవసరమైన పాత్రలను 33 శాతం పైగా అంగన్ వాడీ కేంద్రాలకు సమకూర్చలేదు. కనీస మౌలిక వసతుల లేమి ప్రభావం లబ్దిదారులకందించే సేవల మీద పడింది.
- అర్హత గల లబ్ధిదారులందరినీ అనుబంధ పోషకాహారం క్రింద నమోదు చేయనూ లేదు (లోటు 6 నుంచీ 23 శాతం), నమోదైన లబ్ధిదారులందరికీ అనుబంధ పోషకాహారం అందించనూ లేదు. ఆశించిన విధంగా ఈ పథకాన్ని సార్వజనీకరణం చేసే లక్ష్యం నెరవేరలేదు.
- కిశోరప్రాయంలోని బాలికలకు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని భారత ప్రభుత్వం 2004లోనే సూచించింది కాని లబ్దిదారులను గుర్తించకపోవటంతో పథకం ప్రయోజనాలు ప్రజలకు అందలేదు. కేంద్రం ఇచ్చే సాయంకూడా రాష్ట్రం కోల్పోయింది.
- నాణ్యత లేని/ కాలపరిమితి మీరిన ఆహారం అందించటం వంటివి గమనించడమైంది. రికమెండెడ్ డైటరీ అలవెన్సు ప్రమాణాల మేరకు ఆహారంలో సూక్ష్మ పోషకాలు ఉండేలా చూడటంలో లక్ష్యం నెరవేరలేదు.
- 2005-10 సంవత్సరాలలో 0.73 లక్షల నుంచి 1.31 లక్షల మంది దాకా పిల్లలు పాఠశాల పూర్వ విద్యకు దూరంగా వున్నారు.
- 1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సర ఆడిట్ నివేదిక (పేరా 3.4.5(iii)) లో ఆక్షేపించిన రిఫరెల్ సర్వీసులలో ఇప్పుడు పనితీరు మెరుగయ్యింది. అయితే, మచ్చుకు తనిఖీ చేసిన సగంపైగా ప్రాజెక్టులలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మందులు పంపిణీ చేయటాన్ని పర్యవేక్షించే తగు యంత్రాంగం లేదు.
- పిల్లలు బరువు తక్కువగా వుండటం, పోషక లోపాన్ని సూచిస్తుంది. పోషకాహార కార్యక్రమ ప్రభావం గురించిన అవగాహనకు గాను పిల్లల బరువు చూడటం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇంత ముఖ్యమైన అంశాన్ని విస్మరించారు
- ఐ.సి.డి.ఎస్. క్రింద పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో కల్పించలేదు. పోషణ - ఆరోగ్య అవగాహన అంశంలో కార్యసాధన లక్ష్యాలకు చాలా దిగువున ఉంది.

- కీలక పదవులైన సి.డి.పి.ఓ.లలో 55 శాతం, సూపర్‌వైజర్ పదవులలో 20 శాతం వరకూ 2005-10 కాలంలో ఖాళీలేర్పడ్డాయి. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించటంలో 2007-10 కాలంలో 47 శాతం వరకూ లోటు ఉంది. అంగన్ వాడీ కేంద్రాల పనితీరును స్వయంగా పర్యవేక్షించే లక్ష్యం ఆ విధంగా నెరవేరలేదు.

**సిఫార్సులు**

- అంగన్ వాడీ కేంద్రాలను నెలకొల్పి, వాటికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు పూనుకోవాలి.
- పథకం సమర్థవంతంగా అమలు చేయటానికి గాను, పథకంలోని అన్ని అంశాలకూ లబ్ధిదారుల డేటా బేస్ రూపొందించాలి.
- అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆర్.టి.ఇ./హాట్‌ఫుడ్ మిక్స్‌లు ఐ.సి.డి.ఎస్. ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి.
- కిశోరప్రాయంలోని బాలికలను గుర్తించడం, పోషకాహార ప్రభావం నిగ్గు తేల్చేలా లబ్ధిదారుల బరువు గమనించటం ద్వారా పోషకాహార పథకాన్ని బలోపేతం చేయాలి.
- ఐ.సి.డి.ఎస్. కార్యక్రమాన్ని మరింత ప్రతిభావంతం చేసేందుకుగాను పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలి.

### 2.1.1 ఉపోద్ఘాతం

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకంగా రాష్ట్రమంతటా 1975 అక్టోబరులో ప్రారంభించారు. ఆరేళ్లలోపు పిల్లలు, కిశోర ప్రాయంలోని బాలికలు (11-18 సంవత్సరాల వయసు), గర్భిణులు, బాలింతల పరిపూర్ణ అభ్యున్నతికి ఈ పథకం రూపొందించారు. (i) ఆరేళ్లలోపు పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య స్థాయి మెరుగు పరచటం, (ii) పిల్లల మానసిక, శారీరక, సామాజిక వికాసానికి పునాది వేయటం, (iii) శిశు మరణాలు, అనారోగ్యం, పోషకాహార లోపం, బడి మానటం వంటివి తగ్గించటం (iv) పోషకాలు, ఆరోగ్యం పట్ల అవగాహనతో తల్లి తన పిల్లల ఆహార, ఆరోగ్య అవసరాలను చూసుకునేలా తల్లుల సామర్థ్యం ఇనుమడింపచేయటం, (v) బాలల అభ్యున్నతికి వివిధ శాఖల మధ్య విధానాల, ఆచరణల సమన్వయం సాధించటం ఈ పథకం లక్ష్యాలు. అదనపు పోషకాహారం, వ్యాధి నిరోధక మందులు, ఆరోగ్య పరీక్షలు, పోషకాలు, ఆరోగ్యంపై అవగాహన, 3-6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య వంటి సౌకర్యాల ద్వారా ఈ పథకం లక్ష్యాలను సాధించవలసి ఉంది.

### 2.1.2 సంస్థాగత నిర్మాణం

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాష్ట్ర స్థాయి లో కార్యక్రమం అమలుకు పరిపాలనాపరమైన అధికారి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు (డైరక్టరు) కార్యక్రమాన్ని సమన్వయంతో అమలు చేసే అధికారి. సంచాలకులకు సహాయకులుగా ఇద్దరు సహ సంచాలకులు, ముగ్గురు ఉప సంచాలకులు, ఐదుగురు సహాయ సంచాలకులు, ఇద్దరు గణాంక

అధికారులు ఉంటారు. రాష్ట్రంలోని ఆరు జోన్లలో[2] ఆరుగురు ప్రాంతీయ ఉప సంచాలకులు పనిచేస్తారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని ప్రాజెక్టు డైరెక్టరు అమలు చేస్తారు. ప్రాజెక్టు స్థాయిలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు (సి.డి.పి.ఓ.), అంగన్‌వాడీ కేంద్రాలలో సూపర్‌వైజర్‌లు వారికి సహాయ పడతారు. శిక్షణ పొందిన మహిళా కార్యకర్తలు (అంగన్‌వాడీ కార్యకర్తలు), అంగన్‌వాడీ సహాయకులను గౌరవ వేతనంపై[3] నియోగించి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా (ప్రత్యేకించి మురికివాడలలో) ఈ పథకం క్రింద సేవలందిస్తారు. 2010 జూన్ నాటికి రాష్ట్రంలో మంజూరైన 387 ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులకు గాను 385 ప్రాజెక్టులు పని చేస్తున్నాయి. సగటున ఒక్కొక్క ప్రాజెక్టు కింద 190 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

### 2.1.3 ఆడిట్ లక్ష్యాలు

ఈ దిగువ అంశాలను మదింపు చేయటం, అంచనా వేయటం పనితీరు తనిఖీ లక్ష్యం.

- కేటాయించిన నిధులను పథకం లక్ష్యాల సాధన కోసం పొదుపుగా, ప్రభావవంతంగా, సమర్థవంతంగా వినియోగించారా?
- నాణ్యమైన సేవలను సమర్థవంతంగా, సాఫీగా అందించేందుకు భవనాలు, మంచినీటి వసతి, సహాయక మానవ వనరుల వంటి ఆవశ్యక మౌలిక వసతులను ప్రాజెక్టుకు అవసరమైన మేరకు కల్పించారా?
- అదనపు పోషకాహారం, పూర్వ పాఠశాల విద్య, వైద్య పరీక్షలు, నిర్దేశిత సేవలు, వ్యాధి నిరోధక మందులు, పోషక ఆరోగ్య అవగాహన వంటి వివిధ ప్యాకేజీ ల క్రింద సేవలను ప్రభావవంతంగా అందించారా?

### 2.1.4 ఆడిటు పరిధి, పద్ధతి

ఈ కార్యక్రమం అమలును గతంలో సమీక్షించగా , వెల్లడైన విషయాలను 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో పొందు పరచటం జరిగింది. ప్రస్తుత సమీక్షలో 2005-06 నుంచి 2009-10 సంవత్సరాలలో కార్యక్రమం అమలును పరిశీలించడం జరిగింది. ఇందుకోసం రాష్ట్ర సచివాలయం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయం, 23కు గాను 7 జిల్లాలలో[4] 385కు గాను 69 శిశు సంక్షేమ ప్రాజెక్టు ఆఫీసర్లు (సి.డి.పి.ఓ.), అంగన్ వాడీ కేంద్రాల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయటం జరిగింది. 1998-99 ఆడిట్ నివేదికలోని అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆడిట్ పరిశీలించింది.

ప్రత్యామ్నాయ విధానం కాకుండా యాధృచ్ఛిక నమూనా ప్రాతిపదికన జిల్లాలు, ప్రాజెక్టుల ఎంపిక జరిగింది. పనితీరు సమీక్షకు అనుసరించనున్న విధానాలను 2010 ఫిబ్రవరిలో నిర్వహించిన ప్రారంభ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వివరించటం జరిగింది. ఆడిటు నిశ్చితాభిప్రాయాలకు వచ్చేముందు సూపర్‌వైజర్లు/సి.డి.పి.ఓ.లు, ఇంకా సంచాలకుల అభిప్రాయాలను కూడ పరిగణనలోకి తీసుకోవడమైంది. 2010 ఆగస్టులో జరిగిన ముగింపు సమావేశంలో ఆడిట్ పరిశీలనల పై సంచాలకులతో చర్చించటం జరిగింది.

---

[2] ఏలూరు, హైదరాబాదు, కర్నూలు, ఒంగోలు, విశాఖపట్నం, వరంగల్

[3] అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ2,200 (2008 ఆగస్టు వరకు రూ1,400); అంగన్‌వాడీ సహాయకులకు రూ1,200 (2008 ఆగస్టు 31 వరకు రూ700)

[4] అనంతపురం(8 ప్రాజెక్టులు), చిత్తూరు (11 ప్రాజెక్టులు), తూర్పుగోదావరి (14 ప్రాజెక్టులు), గుంటూరు (8 ప్రాజెక్టులు), కర్నూలు (6 ప్రాజెక్టులు), నల్గొండ (14 ప్రాజెక్టులు), విశాఖపట్నం (8 ప్రాజెక్టులు)

**ఇదివరకటి ఆడిట్ అభ్యంతరాల మీద ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఆడిట్ విశ్లేషణ**

1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో ఈ దిగువ పేర్కొన్న ప్రధాన లోటుపాట్లను ప్రస్తావించారుః

(i) కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించకపోవటం;

(ii) మంజూరైన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులను ఏర్పరచకపోవటం;

(iii) అదనపు పోషకాహారం, ఇతర అంశాలకు గుర్తించిన లబ్ధిదారులందరికీ ప్రయోజనం కల్పించకపోవడం;

(iv) అదనపు పోషకాహారం కు సంబంధించి పోషణ రోజులలో కోత;

(v) రోగ నిరోధక మందులు/ విటమిన్-ఎ ద్రావణం లబ్ధిదారులందరికీ అందించకపోవటం;

(vi) పూర్వ పాఠశాల విద్యలో పిల్లల హాజరు తక్కువగా ఉండటం;

(vii) పథకం అమలు కోసం సిబ్బంది నియామకంలో కొరత;

(viii) పథకం అమలులోని కీలకాంశాలలో వ్యక్తులకు శిక్షణ లేమి;

(ix) సి.డి.పి.ఓ./ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించటంలో కొరత;

(x) ప్రాజెక్టు స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించక పోవటం;

ఆడిట్ అభ్యంతరాలపై తగు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం 2000 అక్టోబరులో ప్రజాపద్దుల సంఘానికి సమర్పించిన వివరణాత్మక నివేదికలో పేర్కొంది.

1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరపు ఆడిట్ నివేదికలోని అభ్యంతరాలపై ప్రభుత్వం ఎంత వరకూ చర్యలు తీసుకున్నదీ విశ్లేషించగా, ఆడిట్ అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించలేదనీ, పలు లోపాలు ఇంకా కొనసాగుతున్నాయనీ తేలింది. ఆ వివరాలను తదుపరి పేరాలలో చర్చించటం జరిగింది.

**ఆడిట్ కనుగొన్న విషయాలు**

## 2.1.5 నిధుల వినియోగం

### 2.1.5.1 ఆర్థిక పరివ్యయం, ఖర్చు

**2005-10 ఐదు సంవత్సరాల కాలంలో కేటాయించిన నిధులలో నలభై శాతం వరకూ వినియోగం కాకుండా మిగిలి ఉన్నాయి**

కార్యక్రమానికి అవసరమయ్యే మొత్తం నిధులను (ఎస్.ఎన్.పి. తప్ప) 2008-09 వరకూ కేంద్ర ప్రభుత్వమే ఇచ్చింది. తదుపరి 2009-10 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90:10 నిష్పత్తిలో నిధులను సమకూరుస్తున్నాయి. అదనపు పోషకాహార పథకం (ఎస్.ఎన్.పి.) ఖర్చును 2006-07[5] నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరిస్తున్నాయి.

పెద్ద మొత్తంలో పథకం నిధులను వాడుకొనకపోవటాన్ని గతంలో 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో పేర్కొనటం జరిగింది (పేరా 3.4.4). ప్రస్తుత సమీక్షా కాలం 2005-10 లో సైతం ఆడిట్ అలాంటి లోపాలను గుర్తించింది. కేంద్రం ఇచ్చిన రూ1,966 కోట్లను కలుపుకొని 2005-10 మధ్య ఐదు సంవత్సరాలలో ఐ.సి.డి.ఎస్. పథకం అమలు చేయటానికి రూ3,633 కోట్ల బడ్జెటు కేటాయింపులు చేశారు. ఇందులో రూ2,783 కోట్లు ఖర్చు చేశారు. సంవత్సరాల వారీగా వివరాలు **పట్టిక-1** లో వున్నాయి.

[5] ఎస్.ఎన్.పి. ఖర్చును 2005-06 వరకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించింది

**పట్టిక-1** (రూపాయలు కోట్లలో)

| సంవత్సరం | కేంద్ర నిధులు* | బడ్జెటు కేటాయింపు** (కేంద్రం, రాష్ట్ర వాటా)$ | వ్యయం** | ఖర్చుకాకుండా మిగిలిన నిధులు (శాతం) |
|---|---|---|---|---|
| 2005-06 | 148.91 | 295.86 | 242.65 | 53.21 (18) |
| 2006-07 | 327.47 | 504.15 | 452.83 | 51.32 (10) |
| 2007-08 | 384.21 | 790.38 | 598.31 | 192.07 (24) |
| 2008-09 | 427.60 | 811.65 | 750.43 | 61.22 ( 8) |
| 2009-10 | 677.50 | 1231.03 | 738.94 | 492.09 (40) |
| **మొత్తం** | **1965.69** | **3633.07** | **2783.16** | **849.91 (23)** |

* డిపార్టుమెంటు అందచేసిన వివరాలు

** ప్రిన్సిపల్ అకౌంటెంటు జనరల్ (ఎ&ఇ) కార్యాలయం నమోదు చేసిన వివరాలు

$ అంగన్‌వాడీ కార్యకర్తలకు, సహాయలకు గౌరవవేతనం చెల్లించేందుకు

**గమనిక:** వీటికితోడు అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2005-10 లో రూ80.50 కోట్ల బడ్జెటు కేటాయింపులు చేసింది. (ప్రపంచ బ్యాంకు సహాయం : రూ49 కోట్లు, నాబార్డు (ఆర్.ఐ.డి.ఎఫ్-XIV) ఋణం : రూ22.50 కోట్లు; పథకం నిధులు: రూ9 కోట్లు). ఇందులో కేవలం రూ14.24 కోట్లు మాత్రమే ఖర్చు అయింది.

2005-10 మధ్య ఐదేళ్ల కాలంలో కేటాయించిన నిధులు 8 నుంచి 40 శాతం వరకు మిగిలిపోవటం **పట్టిక-1** చూస్తే తెలుస్తుంది. డైరెక్టరు ఆడిట్ అభ్యంతరాలను అంగీకరిస్తూ, పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను బట్టి కాకుండా మంజూరైన కేంద్రాల ప్రాతిపదికన బడ్జెటు అంచనాలను సమర్పించటం, అలాగే ప్రభుత్వం నిధులను ఆర్థిక సంవత్సరం చివరన విడుదల చేయటం, ఆహార సామగ్రి కొనుగోలుకు టెండర్లు ఖరారు కాకపోవటం వలన నిధులను వినియోగించలేకపోయినట్లు చెప్పారు (2010 ఆగస్టు). ఆ విధంగా బడ్జెటు కసరత్తులోనూ, నిధుల సకాల వినియోగంలోనూ ఉన్న లోటుపాట్లు ఆర్థికపరమైన నియంత్రణ క్షీణించడాన్ని సూచిస్తున్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటులో కొరత, పోషణలో అంతరాయాల వంటి లోటుపాట్లును ఆడిట్ గమనించింది. ఆ విషయాలు తదుపరి పేరాలలో చర్చించటం జరిగింది. అంశాల వారీగా చేసిన బడ్జెటు కేటాయింపులు, భారత ప్రభుత్వం ఇచ్చినవి, వీటినుంచి ఐ.సి.డి.ఎస్., ఎస్.ఎన్.పి. లపై 2005-10 మధ్య కాలంలో చేసిన ఖర్చు విడిగా ***అనుబంధం-2.1*** లో ఇవ్వటం జరిగింది.

### 2.1.5.2 అంశాల వారీగా వ్యయం

పథకం అమలు కోసం అంశాల వారీగా చేసిన వ్యయం వివరాలు **పట్టిక - 2** లో ఉన్నాయి.

**పట్టిక - 2** (రూపాయలు కోట్లలో)

| అంశం | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| అదనపు పోషకాహారం కింద ఆహారం సరఫరా | 78.20 | 204.28 | 307.00 | 337.77 | 270.15 | 1197.40 |
| సాధన సామగ్రి* | 1.09 | 8.13 | 10.49 | 10.37 | 17.91 | 47.99 |
| ఐ.ఇ.సి. ** | 0.43 | 0.82 | 0.94 | 0.73 | 5.17 | 8.09 |
| **మొత్తం** | **79.72** | **213.23** | **318.43** | **348.87** | **293.23** | **1253.48** |
| జీతాలు | 37.38 | 49.12 | 57.13 | 71.35 | 85.49 | 300.47 |
| అంగన్‌వాడీ కార్యకర్తలకు/సహాయకులకు గౌరవ వేతనం | 90.17 | 143.98 | 157.47 | 263.05 | 292.38 | 947.05 |
| ఆఫీసు ఖర్చులు | 35.38 | 46.50 | 65.28 | 67.16 | 67.84 | 282.16 |
| **మొత్తం** | **162.93** | **239.60** | **279.88** | **401.56** | **445.71** | **1529.68** |
| **పూర్తి మొత్తం** | **242.65** | **452.83** | **598.31** | **750.43** | **738.94** | **2783.16** |

* 'పాఠశాలల పూర్వ విద్య' కింద పరికరాలు, 'వైద్య పరీక్షల' కోసం పరికరాలు

** 'పోషకాలు, ఆరోగ్య అవగాహన', కింద సమాచారం, అవగాహన మొదలైన ప్రసార కార్యకలాపాలు

**మూలంః** ప్రిన్సిపల్ అకౌంటెంటు జనరల్ (ఎ&ఇ) కార్యాలయం నమోదు చేసిన వివరాలు

పథకం ప్రధాన ఆశయం పిల్లల పోషకాహార స్థాయిని మెరుగుపరచటం, ఐతే పై పట్టికని బట్టి ఆహార సామగ్రి కొనుగోలుకు 45 శాతం మాత్రమే ఖర్చు చేశారు. సామగ్రిని లబ్ధిదారులకు చేర్చటానికి 55 శాతం ఖర్చు చేశారని తెలుస్తోంది. జీతాల మొత్తంలో వైద్య పరీక్షలు నిర్వహించే ఆరోగ్య అధికారుల[6] జీతాలు చేర్చలేదని కూడా గమనించవచ్చు.

## 2.1.6 మౌలిక వసతులు, సామర్థ్య వికాసం

గ్రామాలలోనూ, పట్టణ వార్డులలోనూ ఐ.సి.డి.ఎస్. సేవలు అందించటానికి అంగన్‌వాడీ కేంద్రాలే కేంద్ర బిందువులు. అంగన్‌వాడీ కేంద్రాలు తమ విధులు సక్రమంగా నెరవేర్చాలంటే వాటికి సామాను గది, వంట గది, మరుగు దొడ్లు, మంచినీటి వసతి, వంట సామగ్రి, ఫర్నిచరు వంటి మౌలిక సదుపాయాలతో కూడిన విశాలమైన భవనాలు ఉండాలి.

మంజూరైన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులను నిర్వహించకపోవటం గురించి 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో ప్రస్తావించటం జరిగింది. సార్వజనీకరణంలో భాగంగా దశలవారీగా ఐ.సి.డి.ఎస్. కార్యక్రమాన్ని ఒకప్పటి బ్లాకులన్నింటికీ విస్తరింపచేస్తామని ప్రభుత్వం ప్రజాపద్దుల సంఘానికి 2000 అక్టోబరు లో సమర్పించిన వివరణాత్మక నివేదికలో పేర్కొంది. అంగన్‌వాడీ కేంద్రాలను తగు సంఖ్యలో నెలకొల్పకపోవటం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంలో జాప్యం, మౌలిక వసతులు తగినంత లేకపోవటం ఆడిట్ గమనించింది. ఆ వివరాలు ఈ దిగువన చర్చించటం జరిగింది.

[6] పట్టణ ప్రాజెక్టులలో పనిచేసే ఆరోగ్య అధికారులు తప్ప

### అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ/ పునర్వ్యవస్థీకరణ

**అంగన్ వాడీ కేంద్రాల ఏర్పాటులో పట్టణ/గ్రామీణ ప్రాంతాలలో 26,362 కేంద్రాలు (28 శాతం), గిరిజన ప్రాంతాలలో 1,237 (20 శాతం) లోటు ఉంది**

- నిర్దేశించిన ప్రమాణాల[7] ప్రకారం, ఈ సమీక్ష నిర్వహించిన 2005-10 కాలానికి రాష్ట్రంలోని పట్టణ/ గ్రామీణ ప్రాంతాలలో 95,263[8] అంగన్‌వాడీ కేంద్రాల అవసరముంది. ఇందుకుగానూ 68,901 కేంద్రాలు మంజూరయ్యాయి. గిరిజన ప్రాజెక్టులలో 6,280 కేంద్రాల అవసరం ఉండగా, 5,043 మాత్రమే మంజూరయ్యాయి. ఆ విధంగా, పట్టణ/గ్రామీణ ప్రాంతాలలో 26,362 కేంద్రాలు (28 శాతం), గిరిజన ప్రాంతాలలో 1,237 కేంద్రాలు (20 శాతం) లోటు ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటులో వైఫల్యం పై దృష్టి పెట్టాల్సి ఉంది.

**2008 డిశంబరులో మంజూరైన రెండు పట్టణ ప్రాజెక్టులు (రంగారెడ్డి జిల్లాలో), రాష్ట్రంలో 9,743 అదనపు అంగన్ వాడీ కేంద్రాలు ఏర్పాటుచేయలేదు**

- సవరించిన జనాభా ప్రమాణాల మేరకు, ఐ.సి.డి.ఎస్. కార్యక్రమం మూడవ దశ విస్తరణ కింద భారత ప్రభుత్వం 2008 డిశంబరులో రంగారెడ్డి జిల్లాలో రెండు పట్టణ ప్రాజెక్టులు (శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్), రాష్ట్రంలో 6,537 అదనపు అంగన్ వాడీ కేంద్రాలను, 3,206 చిన్న కేంద్రాలనూ సిబ్బందితో సహా మంజూరు చేసింది. ఐతే 2010 సెప్టెంబరు వరకూ అదనపు ప్రాజెక్టులు కానీ, అంగన్ వాడీ కేంద్రాలు గానీ ఏర్పాటు చేయలేదు

**రెండులక్షల పైబడిన జనాభా గల ప్రాజెక్టులను బలోపేతం చేయాలనే లక్ష్యం నెరవేరలేదు**

- సవరించిన జనాభా ప్రమాణాల మేరకు[9] ఐ.సి.డి.ఎస్. కార్యక్రమం మూడవదశ (2007 ఏప్రిల్) విస్తరణ కింద అదనపు ప్రాజెక్టుల ఆవశ్యకత తెలియచేయమని భారత ప్రభుత్వం రాష్ట్రాలను 2008 నవంబరులోనే కోరగా 80 ప్రాజెక్టులను 161 ప్రాజెక్టులుగా పునర్ వ్యవస్థీకరించే ప్రతిపాదనలు చాలా ఆలస్యంగా 2010 ఏప్రిల్ లో పంపారు. రెండు లక్షల పైబడిన జనాభాగల ప్రాజెక్టులను బలోపేతం చేయడం కుదరలేదు. ఐ.సి.డి.ఎస్. కింద లక్షిత జనాభా మొత్తానికి ప్రయోజనం కలిగించడం మీద దీని ప్రభావం పడింది.
- నాలుగవ దశ విస్తరణ (2009 జూన్) లో సైతం అదనపు అంగన్‌వాడీ కేంద్రాలు/ చిన్న అంగన్ వాడీ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపటంలో డైరెక్టరు విఫలమయ్యారు. మంజూరైన ప్రాజెక్టులను, అంగన్ వాడీ కేంద్రాలను నిర్వహించకపోవటం వలన ఏటా కేంద్ర సాయం రూ62 కోట్లు కోల్పోవటమే కాక లక్షిత జనాభాకు పథకం ఫలితాలు అందలేదు.

### అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణం

**ఎక్కువ భాగం అంగన్ వాడీ కేంద్రాలు (67 శాతం) తగు వసతులు లేని అద్దె భవనాలలో పని చేస్తున్నాయి**

- రాష్ట్రంలో నిర్వహణలో ఉన్న 73,409 అంగన్ వాడీ కేంద్రాలకు గానూ (చిన్న అంగన్ వాడీ కేంద్రాలు కాక) 48,900 అంగన్ వాడీ కేంద్రాలు (67 శాతం) 2010 మే నాటికి అద్దె నివాసాల్లో ఉన్నాయి. వీటిలో 4,045 కేంద్రాలు అంగన్ వాడీ కార్యకర్తలు/సహాయకుల ఇళ్లలో ఉన్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాలలో 8,820 కి గాను కేవలం 1,972 కేంద్రాలు (22 శాతం) ప్రభుత్వ భవనాలలో ఉండగా 6,035 కేంద్రాలు (69 శాతం) అద్దె భవనాలలో ఉన్నాయి. ఆ వివరాలు **పట్టిక-3** లో ఉన్నాయి.

---

[7] పథకం నిర్దేశించిన (2007 ఏప్రిల్) ప్రకారం గ్రామీణ/పట్టణ ప్రాజెక్టులలో 400-800 జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రం, గిరిజన ప్రాజెక్టులలో 300-800 జనాభాకు ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉండాలి

[8] 2001 జనాభా ప్రమాణాల ప్రకారం లెక్కించినది

[9] భారత ప్రభుత్వం 2008 నవంబరులో జనాభా ప్రమాణాలను సవరించింది. దీని ప్రకారం, రెండు లక్షల కన్నా ఎక్కువ జనాభాగల బ్లాకులకు ఒకటికంటె ఎక్కువ ప్రాజెక్టు ఏర్పరుచుకోవటంగానీ, ఉన్నవాటి సిబ్బందిని పెంపొందించుకోవటం గానీ చేయవచ్చును

పట్టిక - 3

| జిల్లా | ప్రాజెక్టుల సంఖ్య | అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య | నిర్వహణలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలు | | |
|---|---|---|---|---|---|
| | | | ప్రభుత్వ భవనాలలో | అద్దె భవనాలలో | కమ్యూనిటీ సెంటర్లలో |
| అనంతపురం | 8 | 1696 | 409 | 1207 | 80 |
| చిత్తూరు | 7 | 1200 | 437 | 652 | 111 |
| తూర్పుగోదావరి | 9 | 1810 | 372 | 1365 | 73 |
| గుంటూరు | 2 | 364 | 21 | 184 | 159 |
| కర్నూలు | 6 | 1191 | 222 | 946 | 23 |
| నల్గొండ | 10 | 1733 | 316 | 1219 | 198 |
| విశాఖపట్నం | 6 | 826 | 195 | 462 | 169 |
| **మొత్తం** | **48*** | **8820** | **1972** | **6035** | **813** |
| **శాతం** | **-** | **-** | **22** | **69** | **9** |

* మొత్తం 3,252 అంగన్ వాడీ కేంద్రాలతో కూడిన 17 ప్రాజెక్టుల సమాచారం లేదు

**మూలంః** సి.డి.పి.ఓ.లు ఇచ్చిన వివరాలు



**నల్గొండ జిల్లా ఉడతలపల్లిలో కొద్దిపాటి చూరు కింద, అలాగే గుంటూరు జిల్లా బొమ్మరాజుపల్లిలో శిధిలావస్థలో ఉన్న కచ్చా ఇంట్లో కొనసాగుతున్న (2010 మార్చి 13, 20 తేదీలు) అంగన్ వాడీ కేంద్రాలు**

ప్రపంచ బ్యాంకు/ నాబార్డు సాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోలేక అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణాలు కుంటు పడ్డాయి

- యూనిట్ ఖర్చు రూ2.85 లక్షలతో మొత్తం 1,976 అంగన్ వాడీ కేంద్రాలను నిర్మించేందుకు నాబార్డు 2008 మే లో రూ47.82 కోట్ల ఋణం (రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ8.50 కోట్లకు ఇది అదనం) ఇచ్చింది. నిర్మాణం చేపట్టిన 1,976 కేంద్రాల కు గాను 152 కేంద్రాలు (8 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. 857 కేంద్రాల (43 శాతం) నిర్మాణం వివిధ స్థాయిలలో ఉంది. మరో 967 కేంద్రాల (49 శాతం) నిర్మాణం 2010 మే వరకూ మొదలు పెట్టనే లేదు. అన్ని అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణం 2011 మార్చి 31 నాటికి పూర్తి కావాల్సి ఉండగా ఇంతవరకు పురోగతి సంతృప్తికరంగా లేదు. యూనిట్ ఖర్చు తక్కువగా ఉండటం (రూ2.85 లక్షలు), స్థలాల వివాదాలు, టెండరు ఖరారు చేయటంలో జాప్యం, ఎన్నికల నియమావళి వంటివి మిగతా కేంద్రాల నిర్మాణం చేపట్టకపోవటానికీ జాప్యానికీ కారణాలుగా డైరెక్టరు చెప్పారు.
- ప్రపంచ బ్యాంకు 1998-2006 కాలానికి నిర్దేశించిన ఆర్థిక సాయం (దీని ప్రాజెక్టు కాలపరిమితి 2000లో ముగిసినా, 2005 సెప్టెంబరు 30 వరకూ పొడిగించారు) లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 21 జిల్లాలలో సునామీ ఉపశమనం కింద 400 అదనపు అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణానికి 2005-06 లో రూ5 కోట్లు

విడుదల చేసింది. ప్రాజెక్టు కాలపరిమితి ముగిసే సరికి ఈ 400 కేంద్రాల నిర్మాణమూ అసంపూర్తిగానే మిగిలింది. ఫలితంగా రూ5 కోట్లు ప్రపంచ బ్యాంకు సాయం దక్కలేదు. దీంతో 2005 సెప్టెంబరు 30 నాటికే పూర్తి కావలసిన 166 అంగన్ వాడీ కేంద్రాల[10] (మొత్తం మంజూరైనవి 400) నిర్మాణం 2010 మే నాటికి కూడ అసంపూర్తిగా ఉంది.

**అంగన్ వాడీ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు**

**మచ్చుకు తనిఖీ చేసిన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో 72 నుంచి 82 శాతం కేంద్రాలలో కనీస మౌలిక వసతులు లేవు**

- ఎంచుకున్న ఏడు జిల్లాలలో మచ్చుకు తనిఖీ చేసిన 65 ప్రాజెక్టులలో 12,072 అంగన్ వాడీ కేంద్రాలుండగా 72 నుంచి 82 శాతం కేంద్రాలలో రక్షిత మంచినీరు, ప్రత్యేక వంటగది, మరుగుదొడ్ల వంటి కనీస వసతులు లేవు (వివరాలు **పట్టిక-4** లో). కనీస మౌలిక వసతుల లేమి ప్రభావం లబ్ధిదారులకందించే సేవల మీద ఉంటుందని సి.డి.పి.ఓ. అంగీకరించారు.

**పట్టిక - 4**

| జిల్లా | ప్రాజెక్టుల సంఖ్య | అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య | కనీస మౌలిక వసతుల లేమి | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | రక్షిత మంచినీరు | ప్రత్యేక వంటగది, సామాను గది | గ్యాస్ పొయ్యి | ఫర్నిచరు | మరుగు దొడ్లు | ఆట స్థలం |
| అనంతపురం | 8 | 1667 | 1487 | 1163 | 1667 | 1458 | 1438 | 1525 |
| చిత్తూరు | 11 | 2079 | 1604 | 1633 | 1923 | 1552 | 1542 | 1801 |
| తూర్పుగోదావరి | 10 | 1936 | 1164 | 1296 | 1033 | 1244 | 1354 | 1452 |
| గుంటూరు | 8 | 1284 | 767 | 1130 | 380 | 965 | 907 | 949 |
| కర్నూలు | 6 | 1191 | 1092 | 1036 | 1191 | 1191 | 1096 | 1167 |
| నల్గొండ | 14 | 2659 | 2054 | 1722 | 2063 | 1627 | 2225 | 2058 |
| విశాఖపట్నం | 8 | 1256 | 533 | 775 | 753 | 600 | 996 | 959 |
| మొత్తం | 65 | 12072 | 8701 | 8755 | 9010 | 8637 | 9558 | 9911 |
| శాతం | - | - | 72 | 73 | 75 | 72 | 79 | 82 |

**గమనిక:** తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు ప్రాజెక్టు వివరాలు తెలియలేదు.

**మూలం:** సి.డి.పి.ఓ.లు ఇచ్చిన వివరాలు



**గుంటూరు జిల్లా ఈపూరు, నల్గొండ జిల్లా ఉడతలపల్లి గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేకుండా కొనసాగుతున్న (2010 మార్చి 20, 13 తేదీలు) అంగన్ వాడీ కేంద్రాలు**

[10] ఆదిలాబాద్(14), చిత్తూరు(4), తూర్పుగోదావరి(20), గుంటూరు(16), కరీంనగర్(6), ఖమ్మం(15), కృష్ణ(2), మహబూబ్‌నగర్(15), మెదక్(14), నల్గొండ(10), నిజామాబాద్(4), ప్రకాశం(5), రంగారెడ్డి(7), శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు(16), శ్రీకాకుళం(4), విజయనగరం(3), వరంగల్(8), వైఎస్ఆర్(3)

వంటకీ, వడ్డనకీ అవసరమైన పాత్రలను 33 శాతంకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సమకూర్చలేదు

- హాట్‌ఫుడ్ మిక్స్‌లను వండేందుకు, వడ్డించేందుకు కొన్ని పాత్రలను అంగన్ వాడీ కేంద్రాలకు సమకూర్చవలసి ఉండగా 2010 జూన్ నాటికి రాష్ట్రంలోని 33 శాతం పైగా అంగన్ వాడీ కేంద్రాలలో వంటకీ, వడ్డనకీ అవసరమైన పాత్రలు[11] లేవు. డైరక్టరు, ఆడిట్ పరిశీలనలను ధృవీకరిస్తూ పాత్రల కొనుగోలు మొదలయినట్లు చెప్పారు.

### 2.1.7 అనుబంధ పోషకాహారం

అర్హత గల లబ్ధిదారులను (25 శాతం వరకూ) నమోదు చేయక పోవటం, నమోదైన వారికి కూడ ఎస్.ఎన్.పి. కింద ప్రయోజనాలు కల్పించకపోవటం, పోషణ దినాలలో కొరత గురించి 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలోని పేరా 3.4.5(i),(iv)(సి)లో ప్రస్తావించటం జరిగింది. ప్రజాపద్దుల సంఘానికి ప్రభుత్వం 2000 అక్టోబరులో సమర్పించిన వివరణాత్మక నివేదికలో ఎస్.ఎన్.పి.ని నూరు శాతం లబ్ధిదారులకు అందేలా చూస్తామని పేర్కొంది. ఐతే, ఈ హామీలు అమలు కాలేదు. లోటుపాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

ఆరు నుంచి ఇరవైమూడు శాతం మంది అర్హత గల లబ్ధిదారులను ఎస్.ఎన్.పి. కింద నమోదు చేయలేదు. నమోదైన లబ్ధిదారులందరికీ పోషణ లభించలేదు

(i) ఆహారపదార్థాల కొనుగోలు/పంపిణీ, వాటికవసరమయ్యే నిధుల విషయంలో తన వ్యూహం రూపొందించుకునేందుకు లబ్ధిదారులకు సంబంధించి డేటాబేస్ ఉపకరిస్తుంది. రాష్ట్రస్థాయిలో సంచాలకులు ఇలాంటి డేటాబేస్ నిర్వహించటం లేదని ఆడిట్ గమనించింది. ఇలాంటి డేటాబేస్ నిర్వహించాలని పథకం మార్గదర్శకాలలో కూడా నిర్దేశించలేదు.

(ii) 2005-10 మధ్య కాలంలో అర్హత గల లబ్ధిదారులు ఎస్.ఎన్.పి. పథకం కింద తమకు తాము నమోదు కావటంలో 23 శాతం లోటు ఉంది. నమోదైన లబ్ధిదారులలో కూడా 2005-10 లో 1.84 లక్షల నుంచి 4.34 లక్షల దాకా ఎస్.ఎన్.పి. ప్రయోజనాలు పొందలేదు. ఆ వివరాలు **పట్టిక-5** లో వున్నాయి.

**పట్టిక - 5** (జనాభా లక్షలలో)

| సంవత్సరం | అర్హతగల మొత్తం లబ్ధిదారుల సంఖ్య | నమోదైన లబ్ధిదారుల సంఖ్య | ఎస్.ఎన్.పి. కింద ప్రయోజనం పొందిన లబ్ధిదారుల సంఖ్య | అర్హతగల లబ్ధిదారుల నమోదులో కొరత (శాతం) | నమోదైన లబ్ధిదారులకు ఎస్.ఎన్.పి. ప్రయోజనం కల్పించడంలో కొరత (శాతం) |
|---|---|---|---|---|---|
| 2005-06 | 42.82 | 33.15 | 31.31 | 9.67 (23) | 1.84 (6) |
| 2006-07 | 51.10 | 43.14 | 41.04 | 7.96 (16) | 2.10 (5) |
| 2007-08 | 57.96 | 53.21 | 50.78 | 4.75 (8) | 2.43 (5) |
| 2008-09 | 60.26 | 56.40 | 53.95 | 3.86 (6) | 2.45 (4) |
| 2009-10 | 59.16 | 55.04 | 50.70 | 4.12 (7) | 4.34 (8) |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు

[11] అల్యూమినియం బగోనాలు, స్టీలు పళ్లాలు, గ్లాసులు, బేసిన్లు, హస్తాలు, మొదలైనవి

ఎస్.ఎన్.పి. కింద 2005-10 లో ప్రయోజనం పొందిన వివిధ వర్గాల లబ్ధిదారుల వివరాలు ***అనుబంధం - 2.2*** లో ఉన్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాలలో 2005-10 సంవత్సరాలలో అర్హత గల లబ్ధిదారులను నమోదు చేయటంలో 34 శాతం వరకూ లోటు ఉంది. ఆ వివరాలు ***అనుబంధం - 2.3*** లో ఉన్నాయి. ఆ విధంగా అర్హత గల లబ్ధిదారులందరూ నమోదు కానూ లేదు; నమోదైన లబ్ధిదారులందరికీ అనుబంధ పోషకాహారం లభించనూ లేదు. ఆశించిన విధంగా ఈ పథకాన్ని సార్వజనీకరణం చేసే లక్ష్యం నెరవేరలేదు.

సంచాలకులు ఆడిట్ గమనించిన విషయాలను అంగీకరిస్తూ, ఎస్.ఎన్.పి. కింద తక్కువ మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందటానికి కారణాలుగా ప్రజలు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపటం, అంగన్ వాడీ కేంద్రాలలో ఆకర్షణీయమైన మౌలిక వసతులు లేకపోవటాన్ని పేర్కొన్నారు (2010 ఆగస్టు).

**నెలకు కనీసం 25 రోజులు అనుబంధ పోషకాహారం అందించాల్సి ఉండగా 2005-10 మధ్య కాలంలో ఏడు నుంచి పది శాతం అంగన్‌వాడీ కేంద్రాలలో 21 కన్నా తక్కువ రోజులు అందించారు**

(iii) రాష్ట్రంలో 2005-10 సంవత్సరాలలో ఏడు నుంచి పది శాతం దాకా అంగన్ వాడీ కేంద్రాలలో అనుబంధ పోషకాహారం నెలలో 21 రోజులకన్నా తక్కువగా అందించారు. ఆ వివరాలు **పట్టిక-6** లో ఉన్నాయి.

**పట్టిక - 6**

| సంవత్సరం | నిర్వహించిన అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య (సగటున) | అనుబంధ పోషకాహారం నెలలో 21 కన్నా తక్కువ రోజులు అందించిన అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య (సగటున) |
|---|---|---|
| 2005-06 | 55204 | 4413 (8%) |
| 2006-07 | 58891 | 4146 (7%) |
| 2007-08 | 66040 | 4848 (7%) |
| 2008-09 | 71552 | 7198 (10%) |
| 2009-10 | 73155 | 6214 (8%) |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు

(iv) మచ్చుకు తనిఖీ చేసిన 69 ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులకు గాను 28 ప్రాజెక్టులలో[12] లక్షిత లబ్ధిదారులకు నిర్దేశిత 300 రోజులు అనుబంధ పోషకాహారం ఇవ్వలేదు. వివరాలు **పట్టిక-7** లో ఉన్నాయి.

**పట్టిక -7**

| సంవత్సరం | అంగన్ వాడీ కేంద్రాల సంఖ్య | ఆహారం ఇచ్చిన కేంద్రాల సంఖ్య | | |
|---|---|---|---|---|
| | | 150-200 రోజులకు | 201-250 రోజులకు | 251-299 రోజులకు |
| 2005-06 | 925 | 594 | 103 | 228 |
| 2006-07 | 1509 | 246 | 362 | 901 |
| 2007-08 | 3368 | 182 | 306 | 2880 |
| 2008-09 | 4452 | 301 | 1979 | 2172 |
| 2009-10 | 2876 | 717 | 855 | 1304 |

**మూలం:** సి.డి.పి.ఓ.లు ఇచ్చిన వివరాలు

ఎంపిక చేసుకున్న 7 జిల్లాలలో పైన పేర్కొన్న 28 ప్రాజెక్టులలో, ఆ విధంగా లబ్ధిదారులకు అందించాల్సిన కనీస స్థాయి ఆహారం సి.డి.పి.ఓ.లు ఇవ్వలేదు.

[12] అనంతపురం(2 ప్రాజెక్టులు), చిత్తూరు (4 ప్రాజెక్టులు), తూర్పుగోదావరి (5 ప్రాజెక్టులు), గుంటూరు (2 ప్రాజెక్టులు), కర్నూలు (3 ప్రాజెక్టులు), నల్గొండ (7 ప్రాజెక్టులు), విశాఖపట్నం (5 ప్రాజెక్టులు)

ఆర్.డి.ఎ. ప్రమాణాల మేరకు ఆహారంలో సూక్ష్మ పోషకాలు ఇచ్చే లక్ష్యం నెరవేరలేదు

(v) భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వివిధ లక్షిత వర్గాలకు 80 గ్రాముల అనుబంధ ఆహారం[13] ద్వారా 50 శాతం సూక్ష్మ పోషకాల రికమెండెడ్ డైటరీ అలవెన్సును రాష్ట్రంలో ఎక్కడా అమలు చేయటం లేదు. భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి (2006 జనవరి) నాలుగు సంవత్సరాలు గడిచింది. ఆహార పదార్థాల కొనుగోలుకు గాను జిల్లా కొనుగోళ్ల కమిటీ టెండర్లు ఖరారు చేయనందున భారత ప్రభుత్వ ఆదేశాలను 2010-11 నుంచి అమలు చేస్తామని మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాలలోని సి.డి.పి.ఓ.లు చెప్పారు.

భారత ప్రభుత్వం 2004 లో నిర్దేశించిన అనుబంధ పోషకాహార పథకానికి గాను కిశోరప్రాయంలో ఉన్న బాలిక లను రాష్ట్రంలో గుర్తించలేదు

(vi) కిశోర ప్రాయంలోని బాలికలకు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని భారత ప్రభుత్వం 2004 అక్టోబరులోనే సూచించింది. కానీ 2010 జూన్ వరకూ లబ్ధిదారులను గుర్తించలేదు. పథకం ప్రయోజనాలు ప్రజలకందలేదు. కేంద్రం ఇచ్చే సాయం కూడా రాష్ట్రం కోల్పోయింది. ఆడిట్ పరిశీలనను సంచాలకులు ధృవీకరించారు (2010 ఆగస్టు).

ఆర్.టి.ఇ. ఆహారం/హాట్ ఫుడ్ మిక్స్‌ల సరఫరాలో అస్థిరత, నాణ్యతా లోపం వంటి లోటుపాట్లు ఉన్నాయి

(vii) ఏ.పి.ఫుడ్స్ సరఫరా చేసిన ఆర్.టి.ఇ., హాట్ ఫుడ్ మిక్స్ లను వాటి ఉత్పాదక తేదీ నుంచి 45 రోజులు, 30 రోజులలోగా వినియోగించాలి. కాని ఏ.పి.ఫుడ్స్ ఆర్.టి.ఇ., హాట్ ఫుడ్ మిక్స్ లను ఆయా ప్రాజెక్టుల అవసరాల మేరకు కాకుండా అస్థిరంగా సరఫరా చేస్తున్నట్లు ఆడిట్ గమనించింది. ప్రాజెక్టుల నెలవారీ వినియోగం గణించకుండా ఒక్కొక్కసారి పెద్దమొత్తంలో (రెండు నెలలకు మించి సరిపోయేలా) ఆహారం సరఫరా చేస్తున్నారు. మచ్చుకు తనిఖీ చేసిన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో నెలవారీ సగటు వినియోగం 4,000 నుంచి 7,000 కి.గ్రా. ఉండగా, ఏ.పి.ఫుడ్స్ 2008-10 సంవత్సరాలలో 6,000 కి.గ్రా. నుంచి 34,000 కి.గ్రా. వరకూ సరఫరా చేయటంతో మిగులు ఆహారం (రూ62 లక్షలు ఖరీదు చేసే 1.96 లక్షల కి.గ్రా.[14]) కాలం చెల్లిపోయింది. మరోవైపు 222 ప్రాజెక్టులకు 2007-08 లోనూ 2008-09 లోనూ 76,800 టన్నులు, 2009-10 లో 91,800 టన్నులు ఆర్.టి.ఇ. ఆహారం/హాట్‌ఫుడ్ మిక్స్ అవసరం ఉండగా, 2007-08 లో 16,000 టన్నులు, 2008-09 లో 15,000 టన్నులు, 2009-10 లో19,000 టన్నులు తక్కువగా సరఫరా చేశారు.

(viii)అనుబంధ ఆహారంలో భాగాలైన ఉప్మా, కిచిడీ, హల్వా మిశ్రమం నోటికి రుచికరంగా లేదని లబ్ధిదార్లు తెలిపారనీ, ఇవి తిన్న కొందరు అస్వస్థతకు గురయ్యారనీ 'సోషల్ ఆడిట్'[15] నివేదిక పేర్కొంది. లబ్ధిదారులకు అందచేస్తున్న కిచిడీ మిశ్రమం, మాడిఫైడ్ థెరపిక్ ఫుడ్ (ఎమ్.టి.ఎఫ్.) కూడ ఐ.సి.డి.ఎస్. పోషక ప్రమాణాల కనుగుణంగా లేవని ఆహార, పోషకాల మండలి[16], మహిళా-శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చిన నివేదికలను విశ్లేషిస్తే తెలుస్తుంది. అయినా, ఆహారం నాణ్యత మెరుగవలేదు (2010 ఆగస్టు వరకు). ఏ.పి.ఫుడ్స్ అదే ఆహారాన్ని సరఫరా చేస్తోంది. పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఈ ఆహారం ఇష్టపడటం లేదని సి.డి.పి.ఓ.లు, లబ్ధిదారులు ఆడిట్ కు తెలిపారు.

---

[13] విటమిన్లు - ఖనిజాల మిశ్రమం సాయంతోనూ, అనుబంధ పోషణలో ఆకు కూరలు, తాజా పండ్లు, పాలు, గుడ్లు చేర్చటం ద్వారానూ

[14] (i) ఆరు ప్రాజెక్టుల సి.డి.పి.ఓ.లు (ఈపూరు, సింగనమల, విశాఖపట్నం అర్బన్-II, చెన్నకొత్తపల్లి, కోరుకొండ, పెద్దాపురం) 2008-10లో కాలవ్యవధి మీరిన 79,940 కి.గ్రా. ఆహారాన్ని (విలువ : రూ27.98 లక్షలు) అంగన్ వాడీ కేంద్రాలకు పంపిణీ చేశారు

(ii) ఆరు ప్రాజెక్టుల అంగన్ వాడీ కార్యకర్తలు (పుత్తూరు, చెన్నకొత్తపల్లి, కార్వేటినగరం, సింగనమల, కుదేరు, నర్సీపట్నం) 2008-10లో కాలవ్యవధి మీరిన 1,15,698 కి.గ్రా (విలువ రూ33.84 లక్షలు) లబ్ధిదారులకు పంపిణీ చేశారు

[15] అనంతపురం జిల్లాలోని 154 అంగన్ వాడీ కేంద్రాలలో సమాజాభివృద్ధి మండలి, కొత్తఢిల్లీ 2008 సెప్టెంబరు-నవంబరు మధ్యకాలంలో నిర్వహించింది

[16] విశాఖపట్నం అర్బన్-II, పొన్నూరు (గుంటూరు జిల్లా), విజయవాడల లోని అంగన్ వాడీ కేంద్రాలను 2009 ఏప్రిల్, మే నెలల్లో తనిఖీ చేసి, ఆహారం నమూనాలను సేకరించి, చెన్నైలోని క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీలలో విశ్లేషణ చేయించింది

ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించటానికి ఒక సెల్ ను ఏర్పరచి చర్యలు ప్రారంభించినట్లు సంచాలకులు సమాధానమిచ్చారు (2010 ఆగస్టు).

(ix) ఆర్.టి.ఇ. ఆహారం, హాట్‌ఫుడ్ మిక్స్ సరఫరా చేసినందుకు ఏ.పి.ఫుడ్స్‌కి విలువ ఆధారిత పన్ను (వ్యాట్) 4 శాతం బదులు 12.5 శాతం చెల్లిస్తున్నారు. ఏ.పి.ఫుడ్స్ కూడ అమ్మకం పన్నుల శాఖ కు పన్ను 12.5 శాతం చొప్పున చెల్లిస్తున్నా గానీ, ఆహారంపై పన్ను అదనంగా చెల్లించటం వలన (2007-10లో రూ43.65 కోట్లు[17]) ఐ.సి.డి.ఎస్. ఆ మేర నిధులు నష్టపోయింది. లేకుంటే మరికొంతమంది లబ్ధిదారులకు పోషకాహార ప్రయోజనం కలిగేది. ఈ విషయం ఏ.పి.ఫుడ్స్‌తో సంప్రదిస్తామని సంచాలకులు సమాధానమిచ్చారు (2010 జూన్).

### 2.1.8 పాఠశాల పూర్వ విద్య

పాఠశాల పూర్వ విద్యలో పిల్లల హాజరు తక్కువగా ఉండటాన్ని గతంలో 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో ప్రస్తావించటం జరిగింది (పేరా 3.4.5(v)). ఈ దిగువన పేర్కొన్న విధంగా ఆ లోటు కొనసాగుతోంది.

**2005-06 నుంచి 2009-10 సంవత్సరాలలో 0.73 లక్షలనుంచి 1.31 లక్షల మంది దాకా పిల్లలు పాఠశాల పూర్వ విద్యకు దూరంగా ఉన్నారు**

- డిపార్టుమెంటు ఇచ్చిన వివరాల ప్రకారం 2005-10 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 96 లక్షల మంది అంగన్ వాడీ కేంద్రాలలో పాఠశాల పూర్వ విద్య కోసం నమోదయ్యారు. వీరిలో 91 లక్షల మంది మాత్రమే పాఠశాల పూర్వ విద్యకు హాజరయ్యారు. ఆ వివరాలు **పట్టిక-8** లో ఉన్నాయి.

**పట్టిక - 8** (అంకెలు లక్షలలో)

| సంవత్సరం | పిల్లల సంఖ్య | | |
|---|---|---|---|
| | నమోదైనది | హాజరైనది | లోటు |
| 2005-06 | 16.10 | 15.28 | 0.82 |
| 2006-07 | 19.03 | 18.30 | 0.73 |
| 2007-08 | 20.97 | 20.18 | 0.79 |
| 2008-09 | 20.98 | 19.70 | 1.28 |
| 2009-10 | 19.04 | 17.73 | 1.31 |
| **మొత్తం** | **96.12** | **91.19** | **4.93** |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు

ఈ లోటు తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలలో గణనీయంగా ఉంది (వివరాలు ***అనుబంధం - 2.4*** లో). మచ్చుకు తనిఖీచేసిన ప్రాజెక్టులలో సి.డి.పి.ఓ.లు వివరణ ఇస్తూ, అంగన్ వాడీ కేంద్రాలలో మౌలిక వసతులు లేకపోవటం, తల్లిదండ్రులు తమ పిల్లలను కాన్వెంట్లకే పంపటం ఇందుకు కారణాలుగా పేర్కొన్నారు.

**పాఠశాల పూర్వ విద్యకు 2005-10 మధ్య ఐదు సంవత్సరాలలో రూ1.09 కోట్లు విలువైన 21,000 పరికరాలు అదనంగా కొన్నారు**

- పాఠశాల పూర్వ విద్యకు పరికరాలు కొనే విషయంలో వాస్తవంగా పనిచేస్తున్న వాటికి బదులు మొత్తం మంజూరైన అంగన్ వాడీ కేంద్రాలను లెక్కలోకి తీసుకున్నారు. అంతేకాక సంవత్సరారంభంలో మిగిలి ఉన్న పరికరాలను పరిగణనలోకి తీసుకోవటంలేదు. ఆయా సంవత్సరాలలో మిగిలిన పరికరాలను సిలబస్ మారిపోవటంతో మరి ఉపయోగించటం లేదు. ఫలితంగా రూ1.09 కోట్లు విలువచేసే 21,171 పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి (2010 మే). ఆ వివరాలు **పట్టిక -9** లో చూడవచ్చు.

[17] 2007-08 : రూ11.33 కోట్లు; 2008-09 : రూ14.24 కోట్లు; 2009-10 : రూ18.08 కోట్లు

పట్టిక - 9

| సంవత్సరం (సరఫరా అయిన సంవత్సరం, నెల) | 2005-06 ( జూలై2006) | 2006-07 (జూన్ 2007) | 2007-08 (జూన్ 2008) | 2008-09 (అక్టోబరు 2009) | 2009-10 (మార్చి 2010) |
|---|---|---|---|---|---|
| వాస్తవంగా అవసరమైన పరికరాలు | 56278 | 60761 | 77013 | 79501 | 79888 |
| కొనుగోలు చేసిన పరికరాలు | 66101 | 66101 | 81564 | 80423 | 80423 |
| అదనంగా కొన్న పరికరాలు | 9823 | 5340 | 4551 | 922 | 535 |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు

మంజూరైన అన్ని అంగన్ వాడీ కేంద్రాలూ సంవత్సరంలో ఏదో ఒక రోజు ప్రారంభమవుతాయనే ఆలోచనతో అన్నింటికి సరిపడా పరికరాలు తెప్పించామని సంచాలకులు సమాధానమిచ్చారు (2010 ఫిబ్రవరి). ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పాఠ్యప్రణాళికననుసరించి పరికరాలలో కొత్త అంశాలను వాడుతున్న నేపథ్యంలో ఇదివరకు మిగిలిపోయిన పాత పరికరాలను ఎలా వినియోగించేదీ తమ సమాధానంలో పేర్కొనలేదు.

ఈ తరహా లోపాలు/ తప్పులు ఇక ముందు జరగకుండా చూస్తామని సంచాలకులు హామీ ఇచ్చారు (ఆగస్టు 2010).

### 2.1.9 ఆరోగ్య పరీక్షలు

ఆరోగ్య పరీక్షలలో గర్భిణీ సంరక్షణ, ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశువుల సంరక్షణ, ఆరేళ్ల లోపు పిల్లల సంరక్షణ ఉంటాయి. 1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరపు ఆడిట్ నివేదికలో ఆక్షేపించిన రిఫరెల్ సర్వీసులలో ఇప్పుడు పనితీరు మెరుగయింది. ఐతే ఐ.సి.డి.ఎస్. లబ్ధిదారుల ఆరోగ్య పరీక్షలు ఈ దిగువ పేర్కొన్న విధంగా అరకొరగా ఉన్నాయి

**69 ప్రాజెక్టులకు గాను మచ్చుకు తనిఖీ చేసిన 19 ప్రాజెక్టులలో వైద్యాధికారులు అంగన్ వాడీ కేంద్రాల సందర్శనలో నూరు శాతం లోటు ఉంది; 17 ప్రాజెక్టులలో 2007-10 మధ్య సంయుక్త సందర్శనలు జరగలేదు**

- లబ్ధిదారులకు సంబంధించి రాష్ట్రస్థాయిలో సమాచార సంచయనం లేదు.
- మార్గదర్శకాల ప్రకారం, ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ప్రతి సబ్ యూనిట్నీ, సబ్‌సెంటర్లు, గ్రామీణ ప్రాంతాలలోని అంగన్ వాడీ కేంద్రాలను వారానికో మారు సందర్శించాలి. ఐతే మొత్తం 69 కు గాను మచ్చుకు తనిఖీ చేసిన 19[18] ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో 2007-10 మధ్యకాలంలో అంగన్ వాడీ కేంద్రాలను ఏ వైద్యాధికారీ సందర్శించలేదు. అలాగే, 17 ప్రాజెక్టులలో[19] 2007-10[20] మధ్యన సి.డి.పి.ఓ.లు, వైద్యాధికారులు సంయుక్తంగా సందర్శించలేదు. ప్రాజెక్టుల వారీగా, సంవత్సరాల వారీగా వివరాలు ***అనుబంధం - 2.5*** లో ఉన్నాయి.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతో సంప్రదించి వైద్యాధికారులు అంగన్ వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించేలా శ్రద్ధ తీసుకుంటామని సంచాలకులు హామీ ఇచ్చారు (2010 ఆగస్టు).

[18] అనంతపురం(1), చిత్తూరు (4), తూర్పుగోదావరి (3), కర్నూలు (1), నల్గొండ (9), విశాఖపట్నం (1)

[19] అనంతపురం(1), చిత్తూరు (1), తూర్పుగోదావరి (3), గుంటూరు (3), నల్గొండ (8), విశాఖపట్నం (1)

[20] 2005-07 కి సంబంధించిన వివరాలను సి.డి.పి.ఓ. లు ఇవ్వలేదు

**అంగన్ వాడీ కేంద్రాలకు వైద్య పరికరాలు సక్రమంగా, సకాలంలో అందటం లేదు. ఇవి అవసరానికి మించి సరఫరా చేయటంతో చాలా మందులు కాల పరిమితి మీరిపోతున్నాయి**

- పథకం మార్గనిర్దేశాల ప్రకారం అంగన్ వాడీ కేంద్రాలకు వైద్య పరికరాలు[21] సక్రమంగానూ, సకాలంలోనూ సమకూర్చాలి. ప్రత్యేకించి గిరిజన, కొండ ప్రాంతాలలో పిల్లలకు సాధారణంగా వచ్చే వ్యాధులను నివారించేందుకు గాను వర్షాకాలం మొదలయ్యే ముందే ఈ ఏర్పాట్లు చేసుకోవాలి. డిపార్టుమెంటు వైద్య పరికరాల కోసం ఆర్డర్లు పెట్టినా గానీ మందులు అంగన్ వాడీ కేంద్రాలకు తదుపరి సంవత్సరాలలో అందాయి. ఆ వివరాలు **పట్టిక-10** లో ఉన్నాయి.

**పట్టిక - 10**

| సంవత్సరం | సప్లై ఆర్డరు ఇచ్చిన తేదీ | నిధులు కేటాయించిన నెల/సంవత్సరం | సంస్థ సరఫరా చేసిన తేదీ |
|---|---|---|---|
| 2005-06 | 2006 జనవరి 30 | 2006 మార్చి | 2006 మే |
| 2006-07 | 2006 డిశెంబరు 27 | 2007 మార్చి | 2007 మే |
| 2007-08 | 2008 మార్చి 5 | 2008 మార్చి | 2008 నవంబరు |
| 2008-09 | 2009 మార్చి 14 | 2009 మార్చి | 2010 జనవరి |
| 2009-10 | 2010 మార్చి 11 | 2010 మార్చి | ప్రక్రియ కొనసాగుతోంది |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు

ప్రభుత్వం బడ్జెటును ఆలస్యంగా విడుదల చేయటం, వైద్య పరికరాలను సరఫరా చేయటంలో సరఫరాదార్లు జాప్యం చేయటం ఈ ఆలస్యానికి కారణాలుగా సంచాలకులు పేర్కొన్నారు (2010 జూన్).

- పాఠశాల పూర్వ విద్య పరికరాల మాదిరిగానే వైద్య పరికరాలు కొనే విషయంలో కూడా వాస్తవంగా పనిచేస్తున్న వాటికి బదులు, మొత్తం మంజూరైన అంగన్ వాడీ కేంద్రాలను లెక్కలోకి తీసుకున్నారు. 2006-10 లో రూ53.02 లక్షల విలువైన 12,489 వైద్య పరికరాలు (2,282 చిన్న పరికరాలు కలుపుకొని) అదనంగా కొన్నారు. తొమ్మిది ప్రాజెక్టులలో[22] సి.డి.పి.ఓ.లకు అందచేసిన వాటిలో రూ0.43 లక్షల విలువైన 96 పరికరాలు అవసరాలకు మించి ఉండగా అవి ప్రాజెక్టు గోదాములో నిరుపయోగంగా పడి ఉన్నాయి. మందులు నిల్వ చేయతగిన వ్యవధి రెండు సంవత్సరాలవటంతో వీటిలో కొన్ని మందులు కాలం చెల్లిపోయి ఉండవచ్చును.

**మచ్చుకు తనిఖీ చేసిన వాటిలో సగం పైగా ప్రాజెక్టులలో మందులను లబ్ధిదారులకు పంపిణీ చేయటాన్ని పర్యవేక్షించే యంత్రాంగం లేదు**

- మచ్చుకు తనిఖీ చేసిన 69 ప్రాజెక్టులకు గాను 30 ప్రాజెక్టులో మందుల సక్రమ పంపిణీకి తగిన యంత్రాంగం లేదు. మందులు పంపిణీ చేశారనటానికి తగిన రికార్డులూ లేవు

**మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో తూనిక యంత్రాలు పనిచేయక ఎదుగుదల పర్యవేక్షణకు ఆటంకమవుతోంది**

- పిల్లలు బరువు తక్కువగా ఉండటం పోషకాహార లోపాన్ని సూచిస్తుంది. పోషకాహార కార్యక్రమం ప్రభావం గురించిన అవగాహనకు గాను, పిల్లల బరువు చూడటం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. పిల్లల ఎదుగుదల గమనించటానికీ, పోషక స్థాయిని అంచనా వేయటానికీ (నెలవారీ రిపోర్టులు సి.డి.పి.ఓ.లకు పంపాలి) ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ప్రతినెలా బరువు చూడాలని పథకం మార్గదర్శకాలు

[21] వైద్య పరీక్షలు నిర్వహించటానికి ఆధారమైన ఉత్పాదకంగా ప్రతి అంగన్ వాడీ కేంద్రానికీ సంవత్సరానికోసారి రూ600 విలువైన వైద్య పరికరం ఇవ్వాలి. దగ్గు, జలుబు, చర్మ సంబంధ అంటువ్యాధి వంటి సాధారణ రుగ్మతలకు సులువుగా వాడే మందులు ఆందులో ఉంటాయి

[22] అనంతపురం (సి.కె.పల్లి, సింగనమల, కుదేరు), చిత్తూరు (గంగాధర నెల్లూరు), నల్గొండ(సూర్యాపేట, హుజూర్‌నగర్, మునుగోడు, పెద్దపూర), విశాఖపట్నం(కోటవురట్ల)

నిర్దేశిస్తున్నాయి. ఏడు జిల్లాలలో మచ్చుకు తనిఖీ చేసిన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో అంగన్ వాడీ కేంద్రాలకు ఇచ్చిన పిల్లల, పెద్దల తూనిక యంత్రాలు పనిచేయటం లేదు. దీంతో పిల్లలు, తల్లులు, గర్భిణుల పెరుగుదల గమనించేందుకు ఆటంకం ఏర్పడుతోంది.

### 2.1.10 వ్యాధి నివారణ

లబ్ధిదారులకు వ్యాధి నిరోధక రక్షణ కల్పించకపోవటంపై 1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరపు ఆడిట్ నివేదికలో ఆక్షేపించటం జరిగింది. (పేరా 3.4.5(ii)). ప్రభుత్వం ప్రజా పద్దుల సంఘానికి 2000 అక్టోబరులో వివరణాత్మక నివేదిక సమర్పిస్తూ, వ్యాధి నివారణ నూరు శాతం అమలు చేసేందుకూ, అంగన్ వాడీ కేంద్రాలలో విటమిన్-ఎ ద్రావణం అందుబాటులో ఉంచేందుకూ వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశిస్తామని హామీ ఇచ్చింది. ఈ సమస్య ఇంతవరకూ పరిష్కారం కాలేదు. లోపం అలాగే కొనసాగుతోంది. పిల్లలకు రోగ నిరోధక మందులు ఇవ్వటంలో ఈ దిగువ లోపాలను ఆడిట్ గమనించింది.

- వ్యాధినిరోధక టీకాలివ్వాల్సిన పిల్లల సమాచార సంచయనం రూపొందలేదు.

**2005-10 లో 45 లక్షల మంది పిల్లలకు (70 శాతం) బి.సి.జి.,51 లక్షల మందికి (80 శాతం) మశూచి నిరోధక టీకాలిచ్చారు**

- రాష్ట్రంలో నమోదైన ఏడాదిలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వటంలో ఆచరణ బాగుంది. మొత్తం 64 లక్షల పిల్లలు 2005-10లో నమోదు కాగా, 45 లక్షలమందికి (70 శాతం) బి.సి.జి., 51 లక్షల మందికి (80 శాతం) మశూచి నిరోధక మందులూ ఇచ్చారు.

  అనంతపురం, చిత్తూరు, గుంటూరు జిల్లాలలో మశూచి నిరోధక టీకాల విషయంలో లోటు నూరు శాతం ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో ఇది 2005-06 లో 80 శాతం ఉంది. నల్గొండ జిల్లాలో ఈ లోటు 2006-07 లో 68 శాతం ఉంది. బి.సి.జి.కి సంబంధించి 2005-10లో లోటు గుంటూరు జిల్లాలో 25 నుంచి 55 శాతం మధ్యన, నల్గొండ జిల్లాలో 32 నుంచి 49 శాతం మధ్యన, చిత్తూరు జిల్లాలో 32 నుంచి 48 శాతం మధ్యన ఉన్నాయి.

- వ్యాధి నిరోధక కార్యక్రమం ప్రకారం 18 నుంచి 24 నెలల పిల్లలకు మొదటి విడత టైఫాయిడ్ మొనా వలెంట్ గానీ బైవలెంట్ వ్యాక్సిన్ (ఇంజక్షన్) గానీ ఇవ్వాలి. ఒకటి రెండు నెలల విరామం తర్వాత రెండవ మోతాదు ఇవ్వాలి. ఐతే మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో 2005-10 సంవత్సరాలలో టైఫాయిడ్ నిరోధక టీకాలు వేయలేదు.

- ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులకు విటమిన్-ఎ ద్రావణం ఆరోగ్యశాఖ సరఫరా చేస్తున్నందున ఐ.సి.డి.ఎస్. ఉప సంచాలకులకు ఈ సమాచారం తెలియదు. ఆరోగ్యశాఖ సరఫరా చేస్తున్న మందుల వివరాలు సంచాలకుల కార్యాలయానికి కూడా తెలియదు. ఏడు జిల్లాలలో మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో శిశువులకు విటమిన్-ఎ ద్రావణం ఇవ్వటం లేదు.

### 2.1.11 పోషణ - ఆరోగ్య అవగాహన

**పోషణ, ఆరోగ్య అవగాహన అంశంలో కార్యసాధన లక్ష్యాలకు చాలా దిగువున ఉంది**

పథకం మార్గదర్శకాలననుసరించి 15-45 సంవత్సరాల మహిళలకు, ప్రత్యేకించి గర్భిణులు, బాలింతలకు పోషణ, ఆరోగ్యం గురించిన అవగాహన కల్పించాలి. డిపార్టుమెంటు సమాచారం, అవగాహన, సందేశాల కోసం 2005-10లో రూ8.09 కోట్లు ఖర్చు చేసింది. వివిధ ఆరోగ్య సూచీల కింద లక్ష్యాలు, లక్ష్యసాధన 2007-08, 2008-09, 2009-10 సంవత్సరాలకు సంబంధించినవి **పట్టిక-11** లో ఉన్నాయి.

పట్టిక - 11

| ఆరోగ్య సూచీ | లక్ష్యం | సాధన |
|---|---|---|
| | 2007-08, 2008-09, 2009-10 సంవత్సరాలలో | |
| శిశు మరణాల రేటు | 1,000 సజీవ జననాలకు 40 లోపు | 1,000 సజీవ జననాలకు 53 |
| బాల్య మరణాల రేటు | 1,000 సజీవ జననాలకు 75 లోపు | 1,000 సజీవ జననాలకు 98 |
| మాతృ మరణాల రేటు | 1,00,000 సజీవ జననాలకు 145 లోపు | 1,00,000 సజీవ జననాలకు 175 |
| అయొడైజ్డ్ ఉప్పు వాడకం | 35/35/40 శాతం | 20/20/20 శాతం |
| **ఎస్.సి/ఎస్.టి జనాభాకు** | | |
| ప్రసవమైన గంటలో ప్రథమ స్తన్యం | 20/30/80 శాతం | 15/10/10 శాతం |
| మొదటి ఆరు నెలలలో కేవలం తల్లిపాలు తాగిన పిల్లలు | 80/40/80 శాతం | 30/63/63 శాతం |
| ఆరు నెలలనుంచి తల్లిపాలు, ఘన ఆహారం ఇచ్చిన పిల్లలు | 75 శాతం | 64 శాతం |
| మొదటి విడత విటమిన్-ఎ ఇచ్చిన పిల్లలు | 40 శాతం | 21 శాతం |

**మూలం:** డిపార్టుమెంటు ఇచ్చిన వివరాలు (2005-06, 2006-07 లకు లక్ష్యాలు నిర్దేశించలేదు).

కార్యసాధన లక్ష్యాలకు చాలా దిగువున ఉన్నట్లు ఆడిట్ గమనించింది.

### 2.1.12 సిబ్బంది

అంగన్ వాడీ కేంద్రాలలో లబ్ధిదారులకు తగిన సేవలందించటం ఈ కార్యక్రమ లక్ష్యం. సిబ్బందిని నియోగించటంలోని లోటు, కార్యక్రమంలోని కీలకాంశాలలో వ్యక్తులకు శిక్షణ నివ్వటంలోని లోటు గురించి 1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరపు ఆడిట్ నివేదికలో వ్యాఖ్యానించటం జరిగింది. (పేరా 3.4.8, 3.4.6). ప్రభుత్వం ప్రజా పద్దుల సంఘానికి 2000 అక్టోబరులో విశ్లేషణాత్మక వివరణ సమర్పిస్తూ ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మాట ఇచ్చింది. లోపం ఈ క్రిందివిధంగా ఇంకా కొనసాగుతూనే ఉందని ఆడిట్ గమనించింది.

**2005-10 సంవత్సరాల్లో సి.డి.పి.ఓ. నియామకంలో 55 శాతం, సూపర్‌వైజర్లలో 20 శాతం లోటు ఉంది**

- మంజూరైన 661 సి.డి.పి.ఓ.లు/ఎ.సి.డి.పి.ఓ.లు, 2,708 సూపర్‌వైజర్లు (అంగన్ వాడీ కేంద్రాలలో) పోస్టులకుగాను 413 సి.డి.పి.ఓ.లు/ఎ.సి.డి.పి.ఓ.లు, 2,452 మంది సూపర్‌వైజర్లు మాత్రమే ఉండగా, 2010 మే నాటికి 248 సి.డి.పి.ఓ.లు/ఎ.సి.డి.పి.ఓ.లు (38 శాతం), 256 మంది సూపర్‌వైజర్లు (9 శాతం) కొరత ఉంది. సంవత్సరాల వారీగా కొరత 38 నుంచి 55 శాతం సి.డి.పి.ఓ.లు/ఎ.సి.డి.పి.ఓ.లు, 9 నుంచి 20 శాతం (సూపర్‌వైజర్లు) *అనుబంధం - 2.6* లో వివరించిన విధంగా ఉంది. సిబ్బంది నియామకంలో కొరత, (ప్రత్యేకించి సి.డి.పి.ఓ. సూపర్‌వైజరు పోస్టులలో) లక్షిత ప్రజలకు నమ్మకమైన, నాణ్యమైన సేవలందించటంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**సి.డి.పి.ఓ.లు/సూపర్‌వైజర్లు/ అంగన్ వాడీ కార్యకర్తలు మొదలైన వారికి శిక్షణ ఇవ్వటంలో 27 శాతం కొరత ఉంది**

- ఆరోగ్యం, పోషణ, పాఠశాల పూర్వవిద్య వంటి రంగాల్లో చర్యలను కేంద్రీకరించే లాగున కార్యక్రమంలోని వివిధ అంశాలను విజయవంతంగా అమలు చేయటానికిగాను ఐ.సి.డి.ఎస్. నిర్వాహకులకు శిక్షణ నివ్వాలని పథకం నిర్దేశించింది. వివిధ కేడర్లలో 4.66 లక్షల మందికి శిక్షణ నివ్వటం లక్ష్యం కాగా 3.43 లక్షల మందికి (73 శాతం) మాత్రమే 2005-10 లో శిక్షణనిచ్చారు. ఇంకా 1.24 లక్షల మంది (27 శాతం) కి శిక్షణ నివ్వలేదు. ఆ వివరాలు *అనుబంధం - 2.7* లో ఇవ్వటం జరిగింది.

## 2.1.13 పర్యవేక్షణ

పథకం సమర్థవంతంగా అమలు జరగటానికీ, దాన్ని స్వయంగా పర్యవేక్షించటానికీ ప్రతి సి.డి.పి.ఓ. నెలలో కనీసం 18 రోజులు క్షేత్రస్థాయి సందర్శన చేయాల్సిఉంది. అదే విధంగా సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలన్నింటినీ ప్రతినెలా సందర్శించాలి.

అంగన్ వాడీ కేంద్రాల సందర్శనలో కొరత, ప్రాజెక్టు స్థాయి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించకపోవటం గురించి గతంలోనే 1999 మార్చి 31 తో అంతమయ్యే సంవత్సరపు ఆడిట్ నివేదికలో వ్యాఖ్యానించటం జరిగింది (పేరాలు 3.4.7, 3.4.11). ఈ లోపాలు ఇంకా సవరించలేదని, ఇంకా ఈ దిగువ చర్చించిన విధంగా కొనసాగుతున్నాయనీ ఆడిటు గమనించింది.

**2007-10 లో సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడంలో భారీ లోటు (47 శాతం వరకూ) ఉంది**

- సూపర్‌వైజర్లు అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించటంలో 2007-10 సంవత్సరాలలో భారీ లోటు (47 శాతం వరకు) ఉన్నట్లు ఆడిటు గమనించింది. ఆ వివరాలు **పట్టిక-12** లో ఇవ్వడమైనది.

**పట్టిక - 12**

| జిల్లా | ప్రాజెక్టుల సంఖ్య | చేయాల్సిన సందర్శనల సంఖ్య | వాస్తవంగా చేసిన సందర్శనలు (శాతం) | లోటు శాతం |
|---|---|---|---|---|
| అనంతపురం | 8 | 52734 | 32016 (61) | 20718 (39) |
| చిత్తూరు | 8 | 42839 | 23153 (54) | 19686 (46) |
| తూర్పుగోదావరి | 10 | 66045 | 48283 (73) | 17762 (27) |
| గుంటూరు | 3 | 17276 | 10930 (63) | 6346 (37) |
| కర్నూలు | 6 | 41833 | 30121 (72) | 11712 (28) |
| నల్గొండ | 14 | 86668 | 52025 (60) | 34643 (40) |
| విశాఖపట్నం | 8 | 44080 | 23421 (53) | 20659 (47) |

**మూలంః** సి.డి.పి.ఓ. లు ఇచ్చిన వివరాలు

**గమనికః** 2005-06, 2006-07 సంవత్సరాల సమాచారం తెలియలేదు.

సూపర్‌వైజర్ల చే క్షేత్రస్థాయి సందర్శనలలో లోటుకు కారణం సిబ్బంది కొరత అని సి.డి.పి.ఓ.లు తెలిపారు. ఆ విధంగా అంగన్ వాడీ కేంద్రాల కార్యకలాపాలను స్వయంగా పర్యవేక్షించాల్సిన లక్ష్యం అన్ని ప్రాజెక్టులలోనూ పూర్తిగా నెరవేరలేదు.

- ఐ.సి.డి.ఎస్. ఒక బహుళరంగ కార్యక్రమం. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, సాంఘిక సంక్షేమం వంటి పలు శాఖలతో ఇది ముడిపడి ఉంది. అందుచేత ఈ కార్యక్రమానికి ప్రణాళిక, పర్యవేక్షణ, అంచనా సమకూర్చేందుకు గ్రామస్థాయి, ప్రాజెక్టు స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల్లో వివిధ శాఖల సేవలను సమన్వయం చేయాల్సి ఉంది. ఈ పథకం కింద సమన్వయ కమిటీలు ప్రాజెక్టు, జిల్లా స్థాయిల్లో నెలకొకసారి, రాష్ట్ర స్థాయిలో మూడు నెలలకొకసారి సమావేశం కావలసి ఉంది. ఐతే మచ్చుకు తనిఖీ చేసిన 69 ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులకు గాను 29 ప్రాజెక్టులలో అసలు సమన్వయ కమిటీలు ఏర్పడలేదు. మరో 18 ప్రాజెక్టులలో సమన్వయ కమిటీలు ఏర్పడినా గానీ, (***అనుబంధం - 2.8*** లో వివరించిన విధంగా) సమావేశాలు సక్రమంగా జరగలేదు.

### 2.1.14 సమస్యలు, సాఫల్యత

డిపార్టుమెంటు వివరించిన మేరకు సమస్యలు, సాఫల్యత ఈ క్రింది విధంగా ఉన్నాయి.

సార్వజనీకరణ ఫలితంగా గత ఐదు సంవత్సరాలలో ఐ.సి.డి.ఎస్. విస్తరణ పెరిగినా, వివిధ స్థాయిల్లో ఖాళీలను భర్తీ చేయలేదు. మరి 1994-95 నుండి సూపర్‌వైజర్లను నేరుగా నియమించటం లేదు. అంగన్ వాడీ కార్యకర్తలను/సహాయకులను నియోగించటంలో సైతం జాప్యం జరుగుతోంది. మరోపక్క, అంగన్ వాడీ కార్యకర్తలకు 'బోగస్ కార్డుల ఏరివేత వంటి ఇతర శాఖల పనులు కూడ అప్పగిస్తున్నారు. పిల్లలను నమోదు చేసుకోవటాన్ని ప్రోత్సహించే విధంగా మౌలిక సదుపాయాల దన్ను సమకూర్చటం లేదు. ఇన్ని అవరోధాల మధ్య ఈ దిగువ పేర్కొన్న సాఫల్యతలు సాధించినట్లు డిపార్టుమెంటు పేర్కొంది.

- 2009-10 సంవత్సరంలో 51 లక్షలమంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సేవలందించారు.
- ఇరవై లక్షల మంది పిల్లలకు పాఠశాల పూర్వ విద్య లభించింది. పాఠశాల పూర్వ విద్య స్థిరత్వానికి గాను అన్ని అంగన్ వాడీ కేంద్రాలలో 2009 జూలై నుంచి పిల్లలను ఆకట్టుకునే పాఠ్యప్రణాళికలు ప్రవేశ పెట్టారు. పిల్లలకు పాఠశాల పూర్వ యోగ్యతా పత్రాలు ఇచ్చే విధానం 2009లో ప్రవేశపెట్టారు.
- పాఠశాల సంసిద్ధత కార్యక్రమం కింద అంగన్ వాడీ కార్యకర్తలు 5 లక్షల మంది పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు.
- ఈ పథకం కింద ప్రయోజనాలను మెరుగు పరచేందుకు గాను అయిదు చక్కని ప్రయోగాలు 2009 లో ప్రవేశపెట్టారు. అవి (i)బలవర్థక ఆహారం, ఆరోగ్య దినం (ii) అంగన్ వాడీ కార్యకర్తలచే ప్రాధాన్యత సందర్శన (iii) సూపర్‌వైజర్లచే అంగన్ వాడీ కేంద్రాల ప్రాధాన్య సందర్శన (iv) సూపర్‌వైజర్లుచే స్ట్రక్చర్డ్ సెక్టార్ సమావేశాల నిర్వహణ (v) నిరంతరాయమైన పోషణ కోసం ఆహారపదార్థాల సరఫరా శ్రేణి నిర్వహణ

### 2.1.15 సారాంశం

కేంద్ర సాయం అందుబాటులో ఉన్నా మొత్తం లక్షిత జనాభాకు ప్రయోజనం కల్పించటంలో రాష్ట్రం విఫలమవటంతో సమగ్ర శిశు సేవా పథకం (ఐ.సి.డి.ఎస్.) అమలు కుంటుపడింది. 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో పేర్కొన్న లోపాలను డిపార్టుమెంటు సరిదిద్దుకోలేదు. ఈ లోటుపాట్లు 2005-10 మధ్య ఐదు సంవత్సరాలలో కూడా కొనసాగుతున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలను పెంపొందించటానికి తగిన ప్రాధాన్యత నివ్వలేదు. ఎక్కువ భాగం అంగన్ వాడీ కేంద్రాలు (67 శాతం) అద్దె ఇళ్లలో నడుస్తున్నాయి. వీటిలో రక్షిత మంచినీరు, మరుగు దొడ్ల వంటి కనీస వసతులు లేవు. వంటపాత్రలు కూడ సమకూర్చలేదు. కిశోరప్రాయంలోని బాలికలకు అనుబంధ పోషకాహారం సమకూర్చాలని భారత ప్రభుత్వం 2004 లోనే సూచించినా, ఇంతవరకూ రాష్ట్రంలో లబ్ధిదారులను గుర్తించనేలేదు. నేరుగా తినేందుకు అనువైన ఆహారం (ఆర్.టి.ఇ.)/హాట్‌ఫుడ్ మిక్స్ (ఏ.పి.ఫుడ్స్ సరఫరా చేసేది) సరఫరాల్లో అస్థిరత, నాణ్యత లేని/గడువు మీరిన ఆహారం పిల్లలకు పెట్టటం, అంగన్ వాడీ కేంద్రాలను వైద్యాధికారులు సందర్శించటంలో భారీ లోటు వంటి పలు లోపాలను ఆడిటు గుర్తించింది. రికమెండెడ్ డైటరీ అలవెన్సు ప్రమాణాల మేరకు ఆహారంలో సూక్ష్మపోషకాలు ఉండేలా చూడటంలో కూడా లక్ష్యం నెరవేరలేదు. పిల్లలు బరువు తక్కువగా ఉండటం పోషక లోపాన్ని సూచిస్తుంది. పోషకాహార కార్యక్రమం ప్రభావాన్ని తెలుసు కోవడంలో పిల్లల బరువు చూడటం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఇంత ముఖ్యమైన అంశాన్ని విస్మరించారు. లబ్ధిదారులకు మందుల పంపిణీని పర్యవేక్షించే యంత్రాంగం లేదు. సి.డి.పి.ఓ.లను, సూపర్‌వైజర్లను నియోగించటంలో కూడాభారీ లోటు ఉంది. అంగన్ వాడీ కేంద్రాల పనితీరుపై సి.డి.పి.ఓ.లు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ తగినంతగా లేదు.

### 2.1.16 సిఫార్సులు

- అంగన్ వాడీ కేంద్రాలను నెలకొల్పి వాటికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు పూనుకోవాలి
- పథకం సమర్థవంతంగా అమలు చేయటానికిగాను, పథకంలోని అన్ని అంశాలకూ లబ్ధిదారుల సమాచార సంచయనం రూపొందించాలి.
- అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆర్.టి.ఇ./ హాట్ ఫుడ్ మిక్స్‌లు ఐ.సి.డి.ఎస్. ప్రమాణాల కనుగుణంగా ఉండాలి.
- కిశోరప్రాయంలోని బాలికలను గుర్తించటం, పోషకాహార ప్రభావం నిగ్గు తేల్చేలా లబ్ధిదారుల బరువు గమనించటం ద్వారా పోషకాహార పథకాన్ని బలోపేతం చేయాలి.
- ఐ.సి.డి.ఎస్. కార్యక్రమాన్ని మరింత ప్రతిభావంతం చేసేందుకు పర్యవేక్షణ పటిష్ఠంగా ఉండాలి.

పైన పేర్కొన్న ఆడిట్ పరిశీలనలను సంచాలకులతోనూ, సంబంధిత ఇతర అధికారులతోనూ 2010 ఆగస్టు లో నిర్వహించిన ముగింపు సమావేశంలో చర్చించటం జరిగింది. ఆడిట్ పరిశీలనలపై తగు దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని సంచాలకులు హామీ ఇచ్చారు. సిఫార్సులపై కూడా చర్చించి అంగీకరించారు. ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదు (2010 నవంబరు).

## నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ (ప్రాజెక్టుల విభాగం)

### 2.2 మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకం

ముఖ్యాంశాలు

మహబూబ్‌నగర్ జిల్లాలోని 3.40 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాలనందించడంతో పాటు, కరువు పీడిత ప్రాంతాలైన 303 గ్రామాల్లోని 4.36 లక్షల జనాభాకు తాగునీటి సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. పథకం ప్రణాళికా రచన, అమలు తీరు అధ్వానంగా ఉందని ఆడిటు గమనించింది. అవసరమైన భూములను పూర్తిగా సేకరించకుండానే పనులను అప్పగించారు. దీంతో, పనులు పూర్తికావడానికి నిర్దేశించిన గడువు ముగిసిపోయినా ఇప్పటికీ భూ సేకరణ పూర్తికాలేదు. ఫలితంగా, భారీగా పెట్టుబడులు పెట్టినప్పటికీ, నిర్దేశిత గడువు ముగిసి రెండేళ్లు గడిచినా ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. పర్యవసానంగా, లక్షిత ప్రాంతాలకు/ప్రజలకు నీటిపారుదల, తాగునీటి సౌకర్యాలు అందలేదు. ప్రాజెక్టు పనుల్లో అనుసరించిన ఒప్పంద విధానంలో వ్యయనియంత్రణ కొరవడింది. ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన నిబంధనలను ఒప్పందాలలో చేర్చలేదు. ఫలితంగా, ఒప్పందం ప్రకారం చేయాల్సిన దానికన్నా తక్కువ పరిమాణాల్లో పనులు జరిగినప్పటికీ, ఖర్చులోని మిగుళ్ల ద్వారా రావాల్సిన ప్రయోజనం ప్రభుత్వానికి అందలేదు. ఆ మేరకు గుత్తేదార్లకు భారీ మొత్తంలో అనుచిత లాభాలు చేకూరాయి. ఒప్పందంలోని నిబంధనల రూపకల్పన, వాటి అమలులో లోపాలున్నాయి.

వ్యయ నియంత్రణలో భాగంగా, గుత్తేదారు కోట్ చేసిన మొత్తం, అంచనా విలువకు 105 శాతం మించకుండా ఉంటేనే పనులను అప్పగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఐతే, అంచనాలను ఎక్కువచేసి చూపడంతో ప్రభుత్వ ఆదేశాల వెనుక ఉన్న ఉద్దేశ్యం నీరుగారిపోయింది.

*(పేరాలు 2.2.6.1, 2.2.7.1)*

ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన నిబంధనలను ఒప్పందాలలో చేర్చకపోవడం వలన, చెల్లించాల్సిన మొత్తాలకంటే చెల్లించిన మొత్తాలు చాలా అధికంగా ఉండడంతో గుత్తేదార్లకు రూ402.66 కోట్ల మేర అనుచిత లాభాలు చేకూరాయి.

*(పేరా 2.2.6.4)*

గుత్తేదార్లు చేయాల్సిన పనులతో పాటు, డిపార్టుమెంటు పరంగా నిర్వహించాల్సిన బాధ్యతలకు సంబంధించి కూడా నిర్దిష్ట కాల పరిమితులను ఒప్పందాలలో చేర్చడంలో వైఫల్యం కారణంగా, లిక్విడేటెడ్ డ్యామేజీల నిబంధన ప్రభావవంతంగా అమలుకాలేదు.

*(పేరా 2.2.7.4)*

పథకంలోని వివిధ కార్యకలాపాలు/పనులను సరైన క్రమంలో చేపట్టకపోవడం వలన ఇంతవరకూ రూ1,696.76 కోట్లు ఖర్చుచేసిన ఈ ప్రాజెక్టు నిర్మాణకాలం పెరిగిపోయింది. ప్రాజెక్టు చేపట్టి ఐదేళ్లు గడిచినా, ఇంతవరకూ ఒక్క ఎకరం కూడా సాగులోకి రాలేదు.

*(పేరా 2.2.5.2)*

### 2.2.1 ఉపోద్ఘాతం

కృష్ణానదిపై ఉన్న నీలం సంజీవరెడ్డి సాగర్ (శ్రీశైలం) ప్రాజెక్టుకు ముందర మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు గ్రామం రేగుమనగడ్డ వద్ద నుండి 25.00 టి.ఎమ్.సి.ల[23] నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించి మహబూబ్ నగర్ జిల్లాలోని 3.40 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాలను, జిల్లాలో కరువు పీడిత ప్రాంతాల్లో ఉన్న 303 గ్రామాలలోని 4.36 లక్షల జనాభాకు తాగునీటి సదుపాయాన్ని అందించే లక్ష్యంతో మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ పథకం కోసం రూ2,990 కోట్లకు ప్రభుత్వం పాలనాపరమైన ఆమోదాన్నిచ్చింది (నవంబరు 2005). ఈ పథకంలో నీటిఎత్తిపోతలకు సంబంధించి మూడు లిఫ్టు ప్యాకేజీలు, ప్రధాన కాలువలు, నీటి పంపిణీ వ్యవస్థ ఏర్పాటు కోసం మరో మూడు ప్యాకేజీలు ఉన్నాయి. పథకానికి సంబంధించిన రేఖా చిత్రం ***అనుబంధం - 2.9*** లో ఇవ్వడమైంది.

### 2.2.2 సంస్థాగత నిర్మాణం

నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ (తెలంగాణ ప్రాంతం) ప్రభుత్వ కార్యదర్శి ఈ పథకానికి సంబంధించిన పరిపాలన, సమన్వయ బాధ్యతలను నిర్వహిస్తారు. పథకం ప్రణాళికా రచన, బడ్జెటు, ప్రాజెక్టు పనుల అమలు, సమన్వయం, పర్యవేక్షణ ఇంజనీర్-ఇన్-చీఫ్ (నీటిపారుదల), ముఖ్య ఇంజనీరు (ప్రాజెక్టులు)-మహబూబ్‌నగర్ (సి.ఇ.) పరిధిలోకి వస్తాయి. మహబూబ్‌నగర్ లోని ఎమ్.జి.జె.ఎల్.ఐ.పి. సర్కిల్, పర్యవేక్షక ఇంజినీరు (ఎస్.ఇ.), మరో ముగ్గురు కార్యనిర్వాహక ఇంజనీర్ల (ఇ.ఇ.లు) సహాయంతో పనుల నిర్వహణను పర్యవేక్షిస్తారు.

### 2.2.3 ఆడిట్ లక్ష్యాలు

కింది అంశాలను మదింపువేయడం ఈ పనితీరు తనిఖీ ఉద్దేశ్యం ః

- ప్రయోజనం-వ్యయాలను మదింపు చేసిన తరవాతే పథకాన్ని చేపట్టారా ?
- విలువైన ఆర్థిక వనరులను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా వినియోగించుకొనేలా, నిధుల నిర్వహణ ప్రభావ వంతంగా ఉండే విధంగా పథకంలోని వివిధ కార్యకలాపాలను/పనులను సరైన క్రమంలో సమన్వయ రీతిలో చేపట్టేలా పథక ప్రణాళికా రచన జరిగిందా ?
- పథకంపై ఖర్చు మితంగా ఉండేలా చూసేందుకు పథకం రూపకల్పన, అంచనాల తయారీ, పనుల అప్పగింత, పనుల నిర్వహణ దశల్లో వ్యయనియంత్రణ వ్యవస్థ ప్రభావవంతంగా ఉందా ?
- ఒప్పందాల నిర్వహణ/అమలు తీరు ప్రభుత్వ ప్రయోజనాలను ప్రభావవంతంగా పరిరక్షించేలా ఉందా ?

### 2.2.4 ఆడిటు పరిధి, పద్ధతి

2003-04 నుండి 2008-09[24] మధ్యకాలంలో ప్రాజెక్టు అమలును ఆడిటు సమీక్షించింది. సి.ఇ., ఎస్.ఇ., ముగ్గురు ఇ.ఇ.ల కార్యాలయాల్లోని రికార్డులను 2009 ఫిబ్రవరి నుండి 2009 మే మధ్య కాలంలో తనిఖీ చేయడమైంది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్.), అంచనాలు, ఒప్పందాలు, కాంట్రాక్టు సంస్థలకు చెల్లించిన రన్నింగ్ అకౌంటు బిల్లులు, ప్రాజెక్టుకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఆడిటు పరిశీలించింది. ఆడిటు పరిశీలనల విషయంలో నిర్దిష్టమైన అభిప్రాయాలకు వచ్చేముందు ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలను ఆడిటు

[23] శతకోటి ఘనపుటడుగులు

[24] ఆ తరువాత 2010 ఫిబ్రవరి నాటికి ఉన్న స్థితిని కూడా సమీక్షించడమైంది

పరిగణనలోకి తీసుకుంది. నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ (తెలంగాణ ప్రాంతం) కార్యదర్శి, ఇ.ఎన్.సి., సి.ఇ., ఎస్.ఇ., ఇ.ఇ., లతో సమీక్షారంభ సమావేశాన్ని నిర్వహించి (2009 జనవరి) వారికి పనితీరు తనిఖీ లక్ష్యాలను వివరించడమైంది. ఆడిటు ప్రశ్నలకు సమాధానాలు, దస్తావేజుల ప్రతులు, ఫొటోలు, మ్యాపులు వగైరాల రూపంలో రుజువులను సేకరించడమైంది. ప్రభుత్వ కార్యదర్శి, ఇతర శాఖాపరమైన అధికారులతో సమీక్షానంతర సమావేశాన్ని కూడా నిర్వహించడమైంది (2010 ఆగష్టు). పనితీరు సమీక్షా ఫలితాలు ఈ కింది పేరాల్లో ఉన్నాయి.

**ఆడిట్ కనుగొన్న విషయాలు**

## 2.2.5 పథకం ప్రణాళికా రచన

### 2.2.5.1 ప్రయోజనం-వ్యయాల నిష్పత్తి

సాధారణంగా, ఏ భారీ ప్రాజెక్టునైనా చేపట్టేముందు ఆ ప్రాజెక్టుకయ్యే ఖర్చు, దానివల్ల కలిగే ప్రయోజనాలను మదింపు వేయడం రివాజు. ప్రయోజనాలనేవి ఆర్థికపరమైనవి కావచ్చు, సాంఘికపరమైనవి కావచ్చు లేదా రెండూ కావచ్చు. విషయాలను తెలుసుకొని హేతుబద్ధత ఆధారంగా సరైన నిర్ణయాలను తీసుకోవడం సుపరిపాలన లక్షణం.

ప్రస్తుత ప్రాజెక్టులో, మొదట తయారుచేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్.) (2002 ఆగష్టు) ప్రకారం 2.50 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయాన్ని, దారిలోని గ్రామాలకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని భావించారు. ఇందుకు అయ్యే ఖర్చును రూ1,766 కోట్లుగా అంచనా వేసారు. ప్రయోజనం - ఖర్చుల (బి/సి) నిష్పత్తిని 1.29 గా లెక్కించారు. కానీ ఆ తరువాత, సవరించిన డి.పి.ఆర్. (2005 నవంబరు) లో ఆయకట్టును 3.40 లక్షల ఎకరాలకు సవరించడం ద్వారా ప్రాజెక్టు వ్యయాన్ని రూ2,990 కోట్లకు పెంచారు. ఐతే, తవ్వాల్సిన నేల/మట్టి పరిమాణాలను లెక్కించకుండానే ప్రాజెక్టు విలువలోని పెరుగుదలను గణించినట్టు ఆడిట్ గమనించింది. సవరించిన బి/సి నిష్పత్తిని ఇంకా లెక్కించాల్సి ఉంది.

ఈ ఎత్తిపోతల పథకాన్ని బాగా వెనుకబడిన, కరవు పీడిత ప్రాంతంలో చేపట్టామని కనుక బి/సి నిష్పత్తి ముఖ్యమైనదే అయినప్పటికీ అదొక్కటే ప్రధానం కాదనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఐతే, ప్రభుత్వానికి సామాజికపరమైన బాధ్యతలున్నప్పటికీ, ఇంతటి భారీ వ్యయానికి పూనుకోవడంలోని ఔచిత్యాన్ని బేరీజు వేసుకోవడానికి ప్రాజెక్టు వల్ల ఒనగూరే సాంఘిక ప్రయోజనాలను గణించాలి.

### 2.2.5.2 ప్రాజెక్టు నిర్మాణం

ఈ ప్రాజెక్టులో భాగంగా స్థూలంగా ఈ కింది కార్యకలాపాలను నిర్వహించాలి ః

(ఎ) భూసేకరణ;

(బి) సివిల్ పనులు, ఎలక్ట్రో, హైడ్రో మెకానికల్ పనుల అమలు.

ఐతే, పై కార్యకలాపాల నిర్వహణలో సరైన క్రమాన్ని పాటించలేదని, పనుల మధ్య సమన్వయం లోపించిందని ఆడిటు గమనించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి ః

ప్రాజెక్టు పనులను ఆరు ప్యాకేజీలుగా విభజించి, వాటిని వేరువేరు గుత్తేదార్లకు ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కనస్ట్రక్షన్ (ఇ.పి.సి.) కాంట్రాక్టు పద్ధతిలో అప్పగించారు (2005 మార్చి/సెప్టెంబరు). ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. 2010 ఫిబ్రవరి నాటికి పనుల స్థితి **పట్టిక-13** లో చూపిన విధంగా ఉంది.

పట్టిక-13

| ప్యాకేజీ/ అంశం | అంతర్గత అంచనా విలువ (రూ కోట్లలో) | ఒప్పందం విలువ (రూ కోట్లలో) | పూర్తిచేసేందుకు నిర్దేశించిన గడువు | ప్రారంభించిన తేదీ | పూర్తిచేసేందుకు నిర్దేశించిన తేదీ | 2010 ఫిబ్రవరి నాటికి పనుల పురోగతి | గడువును మించి గడచిన కాలం (నెలల్లో) |
|---|---|---|---|---|---|---|---|
| కాలువ పనులు | | | | | | | |
| ప్యాకేజీ -28 | 243.04 | 249.75 | 24 నెలలు | 20.03.2005 | 20.03.2007 | 82.78% | 35 |
| ప్యాకేజీ -29 | 549.34 | 546.30 | 24 నెలలు | 19.03.2005 | 19.03.2007 | 23.61% | 35 |
| ప్యాకేజీ -30 | 220.88 | 201.40 | 24 నెలలు | 20.03.2005 | 20.03.2007 | 61.53% | 35 |
| ఎత్తిపోత పనులు | | | | | | | |
| లిఫ్ట్-I ప్యాకేజీ | 517.25 | 495.21 | 36 నెలలు | 02.03.2005 | 02.03.2008 | 91.41% | 23 |
| లిఫ్ట్ -II ప్యాకేజీ | 560.29 | 578.04 | 36 నెలలు | 26.09.2005 | 26.09.2008 | 81.06% | 17 |
| లిఫ్ట్ -III ప్యాకేజీ | 639.55 | 631.99 | 36 నెలలు | 28.09.2005 | 28.09.2008 | 65.70% | 17 |

పనులు పూర్తికావడానికి నిర్దేశించిన గడువు తేదీలు ఎప్పుడో ముగిసిపోయినా వీటిలో ఏ ఒక్కటీ పూర్తికాలేదు. ఆడిట్ కనుగొన్న విషయాలు ఇలా వున్నాయి ః

**భూసేకరణ**

**పనులను అప్పగించడానికంటే ముందు పనులు సజావుగా సాగేందుకు అవసరమైన భూములను సేకరించలేదు**

భూములను సేకరించకుండా ఏపనీ మొదలుపెట్టకూడదని ఆంధ్రప్రదేశ్ ప్రజాపనుల శాఖ నియమావళి (ఎ.పి.పి.డబ్ల్యూ.డి. కోడ్) లోని పేరా 180 నిర్దేశిస్తోంది. అలాగే, మొదటి రెండేళ్ల పాటు పనులు నిరాటంకంగా సాగేందుకు అవసరమైన భూములను పనులు చేపట్టడానికి ముందే సేకరించాలని ప్రభుత్వ ఆదేశాలు[25] కూడా నిర్దేశిస్తున్నాయి.

ఇదివరకే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమి కాకుండా ఈ ప్రాజెక్టులు పనుల కోసం అదనంగా మరో 20,107.22 ఎకరాల ప్రైవేటు భూమి కూడా కావాలి. పథకంలోని వివిధ పనులను పూర్తి చేసేందుకు విధించిన గడువు మూడేళ్లు మించి లేదు. ఇంత తక్కువ వ్యవధిలో భారీ ఎత్తున భూములను సేకరించాల్సి ఉండడం, భూసేకరణ ప్రక్రియలోని సంక్లిష్టతల దృష్ట్యా, ప్రాజెక్టుకు అవసరమైన భూముల్లో అధిక భాగాన్ని పనులు అప్పగించడానికి ముందే సేకరించి ఉండాల్సింది. కానీ పనులను అప్పగించేనాటికి సేకరించాల్సిన భూములను కనీసం గుర్తించనే లేదని ఆడిటు గమనించింది. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూభాగాల్లోనూ, పనులను అప్పగించిన తరవాత ఆయా సమయాలలో సేకరించిన భూభాగాల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రాజెక్టు పనులను పూర్తిచేయడానికి నిర్దేశించిన గడువు ముగిసినప్పటికీ, పనులు మొదలుపెట్టి ఐదేళ్లు గడిచినా ఇంకా 7,200 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది.

ఇ.పి.సి.[26] విధానం కింద పనులను అప్పగించిన గుత్తేదారుకే సమగ్ర సర్వే, ఇన్వెస్టిగేషన్ విధులను కూడా అప్పగించడం జరిగిందనీ, ఇన్వెస్టిగేషను పూర్తయి, కాలువల ఎలైన్‌మెంట్లు ఖరారైన తరువాత మాత్రమే భూసేకరణ మొదలౌతుందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. భూసేకరణ జరుగకుండా పనులను ప్రారంభించడమనేది నియమ నిబంధనలు/ ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకమే కాకుండా ప్రాజెక్టు ప్రణాళికా రచన, అమలులో అనుసరిస్తున్న అనుచిత విధానాన్ని సూచిస్తుంది. ఈ విధమైన పద్ధతిని అనుసరించడం వల్ల, పనుల పురోగతికి కుంటుపడే ప్రమాదం ఉంది. ప్రస్తుత ప్రాజెక్టులో కూడా అదే జరిగింది.

[25] నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ, జి.ఒ.ఎమ్.ఎస్.నెం. 177 తేదీ 1997 సెప్టెంబరు 27

[26] ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్

భూములను సేకరించకుండా పనులను ప్రారంభించడం వలన నిర్దేశిత గడువు ముగిసి రెండేళ్లు గడిచినా ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదు. కనీసం ఒక్క ఎకరానికి కూడా సాగునీటి సదుపాయాన్ని కల్పించలేదు. ప్రజలకు తాగునీటినీ అందించలేదు. అందుబాటులో ఉన్న భూముల్లో ఇంతవరకూ జరిగిన పనులపై రూ1,696.76 కోట్లను[27] ఖర్చు చేసారు. ఈ మొత్తం, లక్షిత ప్రాంతాలకు, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చకుండా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో సుదీర్ఘకాలం పాటు చిక్కుకుని ఉండిపోయింది.

## 2.2.6 వ్యయ నియంత్రణ

ఈ ప్రాజెక్టు పనుల్లో అనుసరించిన కాంట్రాక్టు విధానంలో కొన్ని కీలకమైన నియంత్రణలను పొందుపరచలేదని ఆడిటు గమనించింది. ఫలితంగా, కింది పేరాలలో వివరించిన విధంగా, గుత్తేదార్లకు రూ402.66 కోట్ల మేర అనుచిత లబ్ధి (ఈపాటికే అందించినవి/చెల్లించేందుకు ఒప్పుకున్నవి) చేకూరింది.

### 2.2.6.1 అంచనాల తయారీ

వ్యయ నియంత్రణలో అంచనాల తయారీ ఒక ప్రధానమైన అంశం. చేయాల్సిన పనుల పరిమాణాన్ని, అందుకయ్యే ఖర్చును ఇది తెలుపుతుంది. సాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి, ప్రధాన కాలువల తవ్వకం/ నిర్మాణం, నీటి పంపిణీ వ్యవస్థ తవ్వకం, కాంక్రీటు కట్టడాల నిర్మాణం, పైపులైన్లను వేయడం వంటి ఏ పనికైనా సముచితమైన యూనిట్ ధరను ప్రతి ఏటా నీటిపారుదల శాఖ జారీ చేసే ప్రామాణిక రేట్ల పట్టిక (ఎస్.ఎస్.ఆర్.) ఆధారంగా నిర్ణయించవచ్చు. ఐతే, ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించిన పలు అంశాల విషయంలో అంచనాలను సక్రమంగా తయారు చేయలేదు.

**గుత్తేదార్ల ఆర్థిక బిడ్లను తెరిచిన తర్వాత అంచనాలను తయారుచేయడం :** గుత్తేదార్ల ధరలు అంచనా విలువకు 105 శాతం మించని పక్షంలోనే పనులను అప్పగించాలని ప్రభుత్వ ఉత్తర్వులు నిర్దేశిస్తున్నాయి. కనుక, పారదర్శకత ఉండాలంటే బిడ్లు అందడానికి ముందే అంచనాల తయారీ జరగాలి. ఐతే, లిఫ్ట్ ప్యాకేజీల (లిఫ్ట్‌లు - I, II, III) విషయంలో, పనుల అంచనాలకు సాంకేతిక మంజూరీలు పొందకుండానే టెండర్లను ఆహ్వానించారని ఆడిట్ గమనించింది. వివరాలు **పట్టిక - 14** లో చూపడమైంది.

**పట్టిక - 14**

| | టెండర్లు పిలిచిన తేదీ | బిడ్లు చేరేందుకు ఆఖరు తేదీ | అంచనాలకు సాంకేతిక మంజూరీ ఇచ్చిన తేదీ | ఆర్థిక బిడ్లను తెరిచిన తేదీ | టెండర్లను పరిశీలించిన తేదీ | ఒప్పందం కుదుర్చుకున్న తేదీ |
|---|---|---|---|---|---|---|
| లిఫ్ట్ - I | 13.07.2004 | 08.11.2004 | 31.12.2004 | 19.01.2005 | 01.02.2005 | 02.03.2005 |
| లిఫ్ట్ - II | 12.01.2005 | 10.03.2005 | 26.09.2005 | 08.04.2005 | 28.07.2005 | 26.09.2005 |
| లిఫ్ట్ - III | 12.01.2005 | 10.03.2005 | 26.09.2005 | 08.04.2005 | 28.07.2005 | 28.09.2005 |

లిఫ్ట్-II, లిఫ్ట్-III పనుల విషయంలో ధరల బిడ్లను తెరచిన (2005 ఏప్రిల్) ఐదు నెలల తర్వాత మాత్రమే సాంకేతిక మంజూరీనిచ్చారు (2005 సెప్టెంబరు). అంతేకాకుండా, ధరల బిడ్లను తెరిచిన తేదీ, ఒప్పందాలను కుదుర్చుకున్న తేదీ (2005 సెప్టెంబరు) లకు మధ్య జరిగిన ఐదు నెలల జాప్యానికి గల కారణాలు రికార్డుల్లో లేవు.

[27] 2010 ఫిబ్రవరి నాటికి అయిన ఖర్చు

అధిక రేటును తీసుకోవడంవల్ల నీటి పంపిణీ వ్యవస్థకు సంబంధించిన అంచనాలు రూ119 కోట్ల మేర పెరిగిపోయాయి

**అంచనాలను ఎక్కువ చేసి చూపడం :** నీటి పంపిణీ (డిస్ట్రిబ్యూటరీ) వ్యవస్థ విషయంలో అధికభాగం ఖర్చు డిస్ట్రిబ్యూటరీలు/పిల్ల కాలువల తవ్వకంపైనే అవుతుంది. ఎస్.ఎస్.ఆర్.లలో నేల స్వభావాన్ని బట్టి ఒక్కోరకం నేల/మట్టిలో తవ్వకానికి ఒక్కో యూనిట్ రేటు ఉంటుంది. నీటి పంపిణీ వ్యవస్థకు సంబంధించి, ఏ రకమైన నేల/మట్టిలో ఎంతెంత పరిమాణాలు తవ్వాలో మదింపు వేయకుండానే ఈ మూడు ప్యాకేజీల అంచనాలను తయారుచేసారు. దీనికి బదులు సాగునీటిని అందించాల్సిన ఆయకట్టుకు ఒక్కో ఎకరానికి రూ15,000 చొప్పున తీసుకుని అంచనాలను రూపొందించారు. ఈ పద్ధతి సరైంది కాదు. పనుల విలువ, తవ్వాల్సిన మట్టి పరిమాణాలతో నేరుగా ముడిపడి ఉంటుందనే మౌలిక సూత్రాన్ని ఇది విస్మరిస్తోంది. తవ్వకం పనులకు సంబంధించి ప్రత్యేకించి ఎకరానికి ఇంత యూనిట్ ధర అని ఉండదు. పనుల పరిమాణాలను సూచించడమనేది కీలకమైన నియంత్రణల్లో ఒకటి. పరిమాణాలను లెక్కించకపోవడం వల్ల, గుత్తేదార్లకు అనుచిత లాభాలు చేకూరే (వాస్తవంగా చేసిన పనుల తాలూకు పరిమాణాల విలువకంటే చెల్లింపులు అధికంగా ఉండడం) అవకాశాలను తోసి పుచ్చలేము.

అంచనాలను పెంచడం రూ58.47 కోట్ల అదనపు వ్యయానికి దారి తీసింది

ఈ జిల్లాలోనే అదే ఏడాది (2005) చేపట్టిన ఇదే రకమైన నేల స్వభావం ఉన్న రెండు ఇతర ప్రాజెక్టుల్లో (కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం) ఎకరానికి ధరను రూ11,500 చొప్పున తీసుకున్నారని ఆడిట్ గమనించింది. కానీ, కల్వకుర్తి ప్రాజెక్టులో మాత్రం ఎకరానికి రూ15,000 చొప్పున అధిక ధరను తీసుకున్నారు. ఫలితంగా అంచనాలు రూ119.00 కోట్ల[28] మేర పెరిగిపోయాయి. **పట్టిక-15** లో చూపిన విధంగా, గుత్తేదార్లు కోట్ చేసిన మొత్తాలు ప్రభుత్వం నిర్దేశించిన 105 శాతం పరిమితి కంటే రూ58.47 కోట్లు అధికంగా ఉన్నప్పటికీ బిడ్లను ఆమోదించడం జరిగింది. ఆ విధంగా, ఖర్చును నియంత్రించాలన్న ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని నీరుకార్చినట్లయింది.

**పట్టిక-15** **(రూపాయిలు కోట్లలో)**

| ప్యాకేజీ (అభివృద్ధి చేయాల్సిన ఆయకట్టు) | మొత్తం పనుల అంచనా విలువ | అంచనాలలో అధికంగా చేర్చిన మొత్తాలు* | సరైన మొత్తాన్ని చేర్చివుంటే అంచనా విలువ | | ఒప్పందం విలువ | ప్రభుత్వంపై అదనపు భారం |
|---|---|---|---|---|---|---|
| | | | 100 % | 100% + 5% | | |
| ప్యాకేజీ - 28 (70,000 ఎకరాలు) | 243.04 | 24.50 | 218.54 | 229.47 | 249.75 | 20.28 |
| ప్యాకేజీ - 29 (1,80,000 ఎకరాలు) | 549.34 | 63.00 | 486.34 | 510.66 | 546.30 | 35.64 |
| ప్యాకేజీ - 30 (90,000 ఎకరాలు) | 220.88 | 31.50 | 189.38 | 198.85 | 201.40 | 2.55 |
| మొత్తం | | **119.00** | | | | **58.47** |

* అభివృద్ధి చేయాల్సిన ఆయకట్టు x ఎకరానికి రూ3,500 (అంటే రేటులోని వ్యత్యాసం)

నేల స్వభావం ఒకేలా ఉన్నందున ఎలిమినేటి మాధవరెడ్డి (ఎ.ఎమ్.ఆర్.) ప్రాజెక్టులోని రూ15,000 రేటునే కల్వకుర్తి ప్రాజెక్టులో కూడా తీసుకోవడం జరిగిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఐతే, ఎ.ఎమ్.ఆర్. ప్రాజెక్టు నల్గొండ జిల్లాలో ఉండగా కోయిల్ సాగర్, జవహర్ నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నాయి. కనుక, ప్రభుత్వ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

[28] (రూ15,000 - రూ11,500) x 3,40,000 ఎకరాలు

### 2.2.6.2 గుత్తేదార్ల ఎంపిక

సంబంధిత రికార్డులను ఉప-లోకాయుక్త తీసుకువెళ్లారన్న కారణంతో నీటిపారుదల శాఖ టెండరు పత్రాలు, బిడ్లు, సంబంధిత దస్త్రాలను ఆడిటుకు సమర్పించలేదు. దీంతో, గుత్తేదార్లను ఎంపిక చేసిన తీరును ఆడిటు పరిశీలించలేకపోయింది.

### 2.2.6.3 చేసిన పనుల పరిమాణాలను కొలవడం/నమోదుచేయడం

పనుల పరిమాణాలపైనే పనుల విలువ ఆధారపడి ఉంటుంది. కనుక, చేసిన పనుల పరిమాణాలను కొలవడం అనేది వ్యయ నియంత్రణలో ఒక కీలక అంశం. పనుల పరిమాణాలను కొలిచి ఒప్పందాలలోని నిబంధన 42.1 కింద వాటిని మెజర్‌మెంట్ పుస్తకాల్లో నమోదు చేసే కీలక ప్రక్రియను శాఖాపరంగా నిర్వహించడానికి బదులు ఈ బాధ్యతను పనులు చేస్తున్న గుత్తేదార్ల చేతుల్లోనే పెట్టారని ఆడిట్ గమనించింది. ఈ బాధ్యతను శాఖాపరంగా నిర్వహిస్తే మెరుగైన జవాబుదారీతనం ఉండేది.

అంతేకాకుండా, కాలువలు, పంపిణీ వ్యవస్థ, లిఫ్ట్ ప్యాకేజీ లలో తవ్వకం పనులకు సంబంధించిన పరిమాణాలను మెజర్‌మెంట్ పుస్తకాల్లో నమోదు చేస్తున్నా, ఏరకం నేలలో ఎంత తవ్వారో అన్న వివరాలు మాత్రం నమోదు చేయడం లేదు. నేల స్వభావాన్ని బట్టి వివిధ నేలల్లో చేసిన పనుల పరిమాణాల ఆధారంగా చెల్లింపులు జరగడం లేదు.

కాంక్రీటు కట్టడాల విషయంలో కూడా, కొలతలను నమోదు చేసినప్పటికీ, ఎన్ని ఘనపు మీటర్ల కాంక్రీటును వాడారన్న దాంతో సంబంధం లేకుండా చెల్లింపులు చేసారు.

ప్రాజెక్టు ఫలితాలు మాత్రమే ప్రధానమని, చెల్లింపులు చేసేందుకు పనుల పరిమాణాలు ప్రాతిపదిక కాదనీ సమీక్షానంతర సమావేశంలో ప్రభుత్వం సమాధానమిచ్చింది. చెల్లింపులకు పరిమాణాలతో సంబంధం లేదన్న వాదన సరికాదు కాబట్టి ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. వ్యయ నియంత్రణ వ్యవస్థ లేకపోవడం ఈ కింద వివరించిన విధంగా, గుత్తేదార్లకు చెల్లించాల్సిన మొత్తాల కన్నా అధికంగా చెల్లింపులు జరిగేందుకు కారణమయింది.

### 2.2.6.4 గుత్తేదార్లకు చెల్లింపులు

1998 ఆగస్టుకు పూర్వం ఉన్న పద్ధతి ప్రకారం, ప్రజాపనులు నిర్వహించే శాఖల్లో పనులకు టెండర్లను ఆహ్వానించినప్పుడు, గుత్తేదార్లు పనుల్లోని ప్రతీ అంశానికీ విడివిడిగా తమ యూనిట్ రేట్లని తెలిపేవారు. ఐతే, ప్రభుత్వం 1998 ఆగస్టులో యూనిట్ రేట్లను ప్రమాణీకరించడం ద్వారా, గుత్తేదార్లకు చెల్లింపులు చేసే విధానాన్ని క్రమబద్ధీకరించింది. ప్రభుత్వ ఆదేశాల[29] ప్రకారం :

(i) టెండరు షెడ్యూళ్లలో ఈ కింది వాటిని సూచించాలి :

- పనుల్లోని ఒక్కో అంశం యొక్క పరిమాణం;
- ఒక్కో అంశానికి శాఖాపరంగా అంచనా వేసిన ధరలు (అంటే యూనిట్ రేట్లు);
- ఒక్కో అంశం తాలూకూ మొత్తం విలువ;
- పనుల మొత్తం అంచనా విలువ;

(ii) బిడ్డర్లు ప్రతీ అంశానికీ విడివిడిగా రేట్లను సూచించాల్సిన అవసరం లేదు. మొత్తం పనికి టెండరు శాతాన్ని మాత్రమే తెలియజేయాలి.

[29] రవాణా, రోడ్లు, భవనాల శాఖ తేదీ 1998 ఆగస్టు 11 న జారీ చేసిన జీ.ఒ.ఎమ్.ఎస్.నెం.132, లోని పేరా - జి(5)

ఈ వ్యయ నియంత్రణలకు అదనంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండరు పర్సెంటేజి అంచనా విలువకు 105 శాతాన్ని మించకుండా ఉంటేనే పనులను అప్పగించాలని నిర్ణయించింది[30].

ఈ వ్యయనియంత్రణలు ప్రవేశపెట్టిన తరువాత, సాంప్రదాయబద్ధమైన యూనిట్ ధర ఒప్పంద (ఎల్.ఎస్. కాంట్రాక్టు) విధానంలో, పనుల్లోని ప్రతీ అంశానికీ యూనిట్ ధరను ప్రామాణిక రేట్ల పట్టిక (ఎస్.ఎస్.ఆర్.)[31] ఆధారంగా లెక్కిస్తారు. గుత్తేదారు సూచించిన టెండర్ పర్సెంటేజి ప్రకారం ఆ రేటుని సర్దుబాటు చేస్తారు. వాస్తవంగా చేసిన పనుల పరిమాణాలకు ఈ ధరను వర్తింపచేసి గుత్తేదారుకు చెల్లించాల్సిన మొత్తాలను లెక్క కడతారు. అంటే, ఒక ఒప్పందంలోని పనుల్లో ఒక్కో అంశానికీ చెల్లించాల్సిన మొత్తాలను ఈ కింది విధంగా నియంత్రిస్తారు.

| |
|---|
| చెల్లించాల్సిన మొత్తం = (ఎస్.ఎస్.ఆర్. తో లెక్కించిన రేటు) X (టెండరు శాతం) X (చేసిన పనుల పరిమాణం) |

2007 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదిక (సివిల్) లోని 'గోదావరీ జలాల వినియోగ అధారిటీ' పై పనితీరు తనిఖీ (పేరా 3.2) లో, 'ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడే విధంగా తగిన నిబంధనలను ఒప్పందాలలో చేర్చకపోవటంతో పనుల్లో ఉపయోగించే నిర్మాణ సామగ్రిలో భారీ తగ్గుదల ఏర్పడి, ఈ మిగుళ్ల కారణంగా వచ్చే లబ్ధి కాంట్రాక్టర్లకు వెళ్లిపోయింద'నీ, 'ఒప్పందాలు కాంట్రాక్టర్లకు లాభం చేకూరేలా ఏకపక్షంగా ఉన్నాయ' నీ ప్రస్తావించడం జరిగింది. అంతేకాకుండా, 'ఇ.పి.సి. కాంట్రాక్టులలో ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేవిధంగా తగిన మార్పులు, నిబంధనలు చేయాల' ని ఆ నివేదిక లో సిఫార్సు చేయడం కూడా జరిగింది. 2009 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన ఆడిటు నివేదిక (సివిల్) లోని 'సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం' (పేరా 1.4) లో మళ్లీ ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తూ, "పరిమాణాల ఆధారంగా పనుల పరిధిని ఖచ్చితంగా నిర్ధారించకుడా 'స్థిరమైన ధర' ప్రాతిపదికన పనులను అప్పగించకూడదు. చేయాల్సిన సనుల పరిమాణాలను ఖచ్చితంగా నిర్ధారించలేనపుడు ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడడానికి, వాస్తవంగా చేసిన పనుల పరిమాణాల ఆధారంగానే చెల్లింపులు చేయాల" ని ఆడిటు నిర్దిష్టమైన సిఫార్సు చేసింది.

పనులు అప్పగించేముందు, బిడ్డరు కోట్ చేసిన ధర సరసమైనదా కాదా అని నిర్ధారించేందుకు, పనుల పరిమాణాల ఆధారంగా లెక్కగట్టిన అంచనా విలువతో బిడ్డు విలువను పోల్చిచూస్తారు. అంచనాలను ఎక్కువ చేసి చూపే ప్రమాదాన్ని నివారించాలన్నా, వాస్తవంగా చేసిన సనుల మేరకే చెల్లింపులను పరిమితం చేయాలన్నా, చెల్లింపులు చేసేటప్పుడు అంతిమంగా చేసిన పనుల పరిమాణాలను అంచనాలలోని పరిమాణాలు, రేట్లతో పోల్చి చూడాలి. కానీ అలా జరగడం లేదని ఆడిట్ గమనించింది. తత్పరిణామంగా, చేయాల్సిన దానికన్నా తక్కువ పనిని చేసినప్పుడు, ఖర్చు తగ్గడం ద్వారా వచ్చే మిగుళ్ల ప్రయోజనం ప్రభుత్వానికి చేకూరలేదు.

ఈ ప్రాజెక్టులోని ఇ.పి.సి. ఒప్పందాలలో చేస్తున్న చెల్లింపులను, అదే పనికి యూనిట్ ధర కాంట్రాక్టు పద్ధతిలో చెల్లించే (ఎస్.ఎస్.ఆర్. నుండి యూనిట్ ధరలను తీసుకొని, ఆ ధరలను గుత్తేదారు టెండరు పర్సెంటేజీకి సర్దుబాటు చేయడం ద్వారా లెక్కగట్టిన[32]) మొత్తాలతో ఆడిట్ పోల్చిచూసింది.

[30] నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి (పి డబ్ల్యు రిఫామ్స్) శాఖ తేది 2004 నవంబరు 20 న జారీ చేసిన జి.ఓ.ఎమ్.ఎస్.నెం.133

[31] ఎస్.ఎస్.ఆర్. ను డిపార్టుమెంటు ప్రతి సంవత్సరం తయారుచేస్తుంది

[32] చెల్లించాల్సిన మొత్తం = (డిపార్టుమెంట్ అంచనాల ప్రకారం యూనిట్ రేటు) X (టెండరు శాతం ) X (చేసిన పని పరిమాణం)

**కాలువ ప్యాకేజీలు**

కాలువ ప్యాకేజీల్లో (ప్యాకేజీలు 28, 29, 30) స్థూలంగా కింది పనులున్నాయి ః

- ప్రధాన కాలువ/నీటి పంపిణీ (డిస్ట్రిబ్యూటరీ) వ్యవస్థ నిర్మాణం
- కాంక్రీటు కట్టడాల నిర్మాణం

**ప్రధాన కాలువల నిర్మాణం**

**చేసిన పనుల పరిమాణాలతో సంబంధం లేకుండా చెల్లింపులు చేయడంతో గుత్తేదార్లకు రూ130.19కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది**

కాలువ ప్యాకేజీల్లో ప్రధాన కాలువల విషయంలో, పనుల పరిమాణాలను ఊహించి ఎస్.ఎస్.ఆర్.లలోని యూనిట్ ధరల ప్రకారం అంచనాలను తయారు చేసారు. ఐతే, ప్రధాన కాలువలకు చేస్తున్న చెల్లింపులు, ఒప్పందాలలో వ్యయనియంత్రణలు కనుక ఉండి ఉంటే చేయాల్సివచ్చే చెల్లింపులకన్నా, చాలా అధికంగా ఉన్నాయని ఆడిట్ గమనించింది. ఫలితంగా, గుత్తేదార్లకు రూ130.19 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. వివరాలు **పట్టిక -16** లో ఉన్నాయి ః

**పట్టిక - 16**

| ప్యాకేజీ సంఖ్య | అంచనాల ప్రకారం తవ్వకం పనుల పరిమాణం (ఘనపు మీటర్లలో) | అంచనా విలువ (రూ కోట్లలో) | గుత్తేదార్లు ఇచ్చిన టెండరు శాతం | టెండరు శాతంతో ఈ పని విలువ (రూ కోట్లలో) | వాస్తవంగా చేస్తున్న పనుల పరిమాణం (ఘనపు మీటర్లలో) | వాస్తవంగా చేస్తున్న పనికి చెల్లించాల్సిన మొత్తం (రూ కోట్లలో) | గుత్తేదారుకు చెల్లిస్తున్న మొత్తం (రూ కోట్లలో) | అధికంగా చెల్లిస్తున్న మొత్తం (రూ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 (8-7) |
| ప్యాకేజీ-28 | 82,33,499 | 82.99 | (+) 2.76 % | 85.28 | 63,97,525 | 66.26 | 126.19 | 59.93 |
| ప్యాకేజీ-29 | 1,54,04,760 | 145.31 | (-) 0.55 % | 144.51 | పనులు జరుగుతున్నాయి | 144.51 | 193.28 | 48.77 |
| ప్యాకేజీ-30 | 39,57,505 | 37.69 | (-) 8.82 % | 34.37 | 51,79,246 | 44.97 | 66.46 | 21.49 |
| **గుత్తేదార్లకు చేకూరిన మొత్తం అనుచిత లబ్ధి** | | | | | | | | **130.19** |

ప్యాకేజీవారీగా వివరాలు ఇలా ఉన్నాయి ః

**ప్యాకేజి-28 ః** ప్రధాన కాలువ తవ్వకానికి అయ్యే ఖర్చును రూ82.99 కోట్లుగా అంచనా వేసారు. టెండరు శాతాన్ని సర్దుబాటు చేసిన తరువాత దీని విలువ రూ85.28 కోట్లవుతుంది. ఐతే, అంచనా వేసిన పరిమాణాల కంటే వాస్తవంగా చేసిన పనుల పరిమాణాలు తక్కువని ఆడిట్ గమనించింది. పరిమాణాలలోని తగ్గుదలని లెక్కలోకి తీసుకొంటే గుత్తేదారుకు చెల్లించాల్సి వచ్చే మొత్తం రూ66.26 కోట్లే. దీనికి బదులు రూ126.19 కోట్లను చెల్లించేందుకు అంగీకరించడంతో గుత్తేదారుకు రూ59.93 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

**ప్యాకేజి-30 :** ఈ ప్యాకేజీలో కాలువల తవ్వకానికి అంచనా వేసిన ఖర్చు రూ37.69 కోట్లు. టెండరు శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే దాని విలువ రూ34.37 కోట్లవుతుంది. వాస్తవంగా చేసిన పనుల పరిమాణాల ప్రకారం గుత్తేదారుకు చెల్లించాల్సివచ్చే మొత్తం రూ44.97 కోట్లు. ఐతే, దీనికి బదులు, రూ66.46 కోట్ల మొత్తాన్ని చెల్లిస్తుండడంతో గుత్తేదారుకు రూ21.49 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

**ప్యాకేజి-29** లో కాలువల అంచనా విలువ రూ145.31 కోట్లు. టెండరు పర్సెంటేజిని పరిగణిస్తే దీని విలువ రూ144.51 కోట్లవుతుంది. ఐతే, పేమెంట్ షెడ్యూల్ ప్రకారం ఈ అంశానికి రూ193.28 కోట్ల మొత్తాన్ని చెల్లిస్తున్నారు. కాలువ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఒకవేళ అంచనాలలోని పరిమాణాల ప్రకారమే పనులు చేసినా గుత్తేదారుకు రూ48.77 కోట్ల అనుచిత లబ్ధి చేకూరుతుంది.

**కాంక్రీట్ స్ట్రక్చర్ల నిర్మాణం**

కాంక్రీటు స్ట్రక్చర్ల నిర్మాణాలకయ్యే ఖర్చు, వాటి నిర్మాణంలో ఏరకమైన కాంక్రీటు (సిమెంట్, స్టీల్ ఇతర సామగ్రుల పరిమాణాలను బట్టి) ఎంత పరిమాణంలో వాడారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక స్ట్రక్చరులో అనేక భాగాలుంటాయి. కాబట్టి, వాడిన 'కాంక్రీటు రకం', ఆ కాంక్రీటు పరిమాణం (ఘనపు మీటర్లలో) ల ఆధారంగా చెల్లింపులు చేయాలి. ఒక్కోరకమైన కాంక్రీటుకూ యూనిట్ రేటును (ఒక ఘనపు మీటరు నిర్మాణానికి ధర) ఎస్.ఎస్.ఆర్.ల సహాయంతో నిర్ణయించవచ్చు. ఈ మూడు ప్యాకేజీల అంచనాలలో కాంక్రీటు నిర్మాణాల కోసం ఈ కింది మొత్తాలను చేర్చారు :

**పట్టిక-17**

| | స్ట్రక్చర్ల సంఖ్య | మొత్తం |
|---|---|---|
| ప్యాకేజీ - 28 | 75 | రూ27.58 కోట్లు |
| ప్యాకేజీ - 29 | 317 | రూ92.87 కోట్లు |
| ప్యాకేజీ - 30 | 165 | రూ32.02 కోట్లు |

ఈ మూడు ప్యాకేజీల (28, 29, 30) లోనూ ఆడిట్ ఈ కింది విషయాలను గమనించింది :

- పనులకయ్యే ఖర్చు చేయాల్సిన పనుల పరిమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఐతే, స్ట్రక్చర్ల విషయంలో అంచనాలను పనుల పరిమాణాల ప్రాతిపదికన తయారు చేయలేదు. నిర్మాణాల డిజైన్లు, వాటిలో ఉపయోగించే సామగ్రుల పరిమాణాల ఆధారంగానే అంచనాల తయారీ జరిగిందనటానికి ఎలాంటి ఆధారాలు లేవు.
- టెండరు నోటీసులో, నిర్మాణాలకు సంబంధించిన కొలతలు, స్పెసిఫికేషన్లు, వాటికి అవసరమయ్యే సామగ్రుల వివరాలు లేవు. కాబట్టి, చేయాల్సిన పనుల వివరణ అసమగ్రంగా ఉంది.
- ప్యాకేజి-28, 29, 30 లలో కాంక్రీటు నిర్మాణాలకోసం చెల్లించేందుకు అంగీకరించిన మొత్తాలు వరుసగా రూ37.46 కోట్లు, రూ54.63 కోట్లు, రూ20.14 కోట్లు. ఐతే, నిర్మాణాల్లో ఉపయోగించిన కాంక్రీటు పరిమాణం (ఘనపు మీటర్లు) ఆధారంగా ఈ మొత్తాల చెల్లింపులు జరగడం లేదు.

**నిర్మాణాల్లో, కాంక్రీటు పరిమాణాల ఆధారంగా చెల్లింపులు జరగడంలేదు - రూ112.23 కోట్లు**

పై నియంత్రణలు లేకపోవడంతో, అంచనాలను ఎక్కువ చేసి చూపడం, పనులను అప్పగించిన తర్వాత పనుల పరిమాణాలు తగ్గితే ఆ మిగుళ్ల ప్రయోజనం ప్రభుత్వానికి చేకూరకపోవడం వంటివి జరగకుండా నివారించలేదు.

**లిఫ్ట్ ప్యాకేజీలు**

లిఫ్ట్ పనుల్లో, తొలి అంచనాలతో పోలిస్తే పనుల పరిమాణాలు భారీగా తగ్గాయి. అంతేకాకుండా, పైపులైన్లు, సొరంగం పనులు, పంపుహౌసులు/సర్జిపూల్ లలో మట్టి తవ్వకం పనులు వంటి కొన్ని అంశాలకు చెల్లిస్తున్న మొత్తాలు ఆ పనులకు చెల్లించాల్సిన మొత్తాలకన్నా చాలా అధికంగా ఉన్నాయి. ఫలితంగా, కింద వివరించిన విధంగా గుత్తేదార్లకు రూ272.47 కోట్ల అనుచిత లాభాలు కలిగాయి.

మట్టి తవ్వకం పనుల పరిమాణాలు తగ్గినప్పటికీ గుత్తేదార్లకు చేసే చెల్లింపులను మాత్రం తగ్గించలేదు - రూ75.39 కోట్లు

**సర్జిపూల్‌లు, పంపుహౌస్‌ల నిర్మాణంలో మట్టి తవ్వకం పనులు :** అన్ని లిఫ్ట్ ప్యాకేజీలలోనూ సర్జిపూల్‌లు, పంపుహౌస్‌ల నిర్మాణం పనులున్నాయి. వీటిలో మట్టి తవ్వకం పనులు కూడా ఒక అంతర్భాగం. ఈ మూడు ప్యాకేజీల్లోనూ, నిర్మించాల్సిన స్ట్రక్చర్ల కొలతలు, ఒక్కో రకమైన నేలలో తవ్వాల్సిన మట్టి పరిమాణాల ఆధారంగా అంచనాలను తయారుచేసారు. ఐతే, పనులు జరిగే సమయంలో ఈ స్ట్రక్చర్లకు సంబంధించిన పరిమాణాలు భారీగా తగ్గాయని ఆడిట్ గమనించింది. వివరాలు **పట్టిక-18** లో చూపడమైంది :

**పట్టిక-18**

| | పని | అంచనా ప్రకారం పరిమాణాలు (ఘనపు మీటర్లలో) | అంచనా విలువ (రూ కోట్లలో) | వాస్తవంగా చేసిన పరిమాణాలు (ఘనపు మీటర్లలో) | చెల్లించాల్సిన మొత్తం (రూ కోట్లలో) | చెల్లిస్తున్న మొత్తం (రూ కోట్లలో) | గుత్తేదారుకు చేకూరిన అనుచిత లబ్ధి (రూ కోట్లలో) |
|---|---|---|---|---|---|---|---|
| లిఫ్ట్-I | సర్జి పూల్, పంపుహౌసు | 6,89,210 | 27.75 | 4,56,040 | 17.58 | 53.89 | 36.31 |
| లిఫ్ట్-III | సర్జిపూల్ | 9,62,078 | 47.95 | 4,45,000 | 21.92 | 61.00 | 39.08 |
| **గుత్తేదార్లకు చేకూరిన మొత్తం అనుచిత లబ్ధి :** | | | | | | | **75.39** |

పైపులైను పనుల పరిమాణాలు తగ్గినప్పటికీ ఆ మేరకు గుత్తేదార్ల చెల్లింపులను తగ్గించలేదు - రూ74.76 కోట్లు

చెల్లింపులను నియంత్రించడానికి అవసరమైన నిబంధనలు ఒప్పందాలలో లేకపోవడంతో, చేయాల్సిన పనుల పరిమాణాలు తగ్గినా ఆ మేరకు గుత్తేదార్ల చెల్లింపులను తగ్గించకపోవడం వల్ల గుత్తేదార్లకు అనుచిత లాభాలు చేకూరాయి.

**డెలివరీ మెయిన్లు (పైపులైన్లు) :** అదే విధంగా, అంచనాలతో పోలిస్తే డెలివరీ మెయిన్ల పొడవులలో తగ్గుదలలున్నాయి. ఫలితంగా, **పట్టిక-19** లో చూపిన విధంగా ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి.

పట్టిక-19

| | అంచనాల ప్రకారం పైపులైను పొడవు | అంచనా వేసిన మొత్తం (రూ కోట్లలో) | వాస్తవంగా చేస్తున్న పనులు | | చెల్లించాల్సిన మొత్తం# (రూ కోట్లలో) | చెల్లిస్తున్న మొత్తం (రూ కోట్లలో) | అదనంగా చెల్లిస్తున్న మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| లిఫ్ట్-I | 700 మీ | 59.21 | పైపులైను | 233.66 మీ | 18.18 | 50.18 | 27.94 |
| | | | సొరంగం | 388.50 మీ | 4.06* | | |
| | | | మొత్తం | 622.16 మీ | 22.24 | | |
| లిఫ్ట్-II | 495 మీ | 33.36 | 320 మీ | | 21.37 | 25.66 | 4.29 |
| లిఫ్ట్-III | 538 మీ | 31.99 | 243.60 మీ | | 13.80 | 56.33 | 42.53 |
| గుత్తేదార్లకు చేకూరిన మొత్తం అనుచిత లబ్ధి | | | | | | | 74.76 |

# గుత్తేదార్లు కోట్ చేసిన టెండరు శాతంలను పరిగణనలోకి తీసుకొని దామాషా ప్రకారం లెక్కించినవి.

* లిఫ్ట్-III లోని సొరంగం రేట్లను తీసుకుని గుత్తేదారు (లిఫ్ట్-I) ఇచ్చిన టెండరు శాతాన్ని వర్తింపజేసి లెక్కించినది.

**గుత్తేదార్లకు చెల్లిస్తున్న మొత్తాలు, చెల్లించాల్సిన మొత్తాల కంటే చాలా అధికంగా ఉన్నాయి - రూ122.32 కోట్లు**

**సొరంగం పనులు :** లిఫ్ట్లు, II, III ప్యాకేజీలలోని సొరంగం పనులకు సంబంధించి గుత్తేదార్లకు చెల్లిస్తున్న మొత్తాలు, ఆ పనుల అంచనా విలువపై గుత్తేదార్ల టెండరు శాతాన్ని సర్దుబాటు చేయగా చెల్లించాల్సిన మొత్తాల కంటే చాలా అధికంగా ఉన్నాయని ఆడిట్ గమనించింది.

పట్టిక-20 (రూపాయలు కోట్లలో)

| | పని | అంచనా విలువ | చెల్లించాల్సిన మొత్తం | చెల్లిస్తున్న మొత్తం (శాతం) | అధికంగా చెల్లిస్తున్న మొత్తం |
|---|---|---|---|---|---|
| లిఫ్ట్ - II | సొరంగం, సర్జిపూల్, పంపుహౌసు, మరియు డ్రాఫ్ట్ ట్యూబు సొరంగం | 156.28 | 161.23 | 229.13 (142.11 %) | 67.90 |
| లిఫ్ట్ - III | సొరంగం | 74.59 | 73.70 | 128.12 (173.84%) | 54.42 |
| మొత్తం అనుచిత లబ్ధి | | | | | 122.32 |

అంచనా వేసిన పరిమాణాల కంటే గుత్తేదార్లు, 42.11 శాతం, 73.84 శాతం అధికంగా పనులు చేసినప్పుడే ఒప్పుకున్న ఈ మొత్తాలను చెల్లించే విధంగా ఒప్పందాలలో ఎలాంటి ఏర్పాటూ లేదని ఆడిటు గమనించింది.

**వాస్తవంగా పని జరిగిందని చెప్పడానికి ఆధారంగా పనుల కొలతలను నమోదు చేయకుండానే రూ54.43 కోట్లు చెల్లించారు**

**షాట్క్రీటింగ్[33] పనికి సంబంధించిన చెల్లింపులు :** లిఫ్ట్-II, లిఫ్ట్-III ప్యాకేజీల్లో షాట్క్రీటింగ్ పనులకు గుత్తేదార్లు వరుసగా రూ40.41 కోట్లు, రూ14.02 కోట్లను కోట్ చేసారు. వాస్తవంగా పనులు జరిగాయని చెప్పడానికి, ఆధారంగా ఆ పనుల్లో ఉపయోగించిన కాంక్రీటు పరిమాణాలను కొలతల పుస్తకాల్లో (మెజర్మెంట్ బుక్స్) నమోదు చేయకుండానే ఈ పనికి చెల్లింపులు చేసారు.

[33] సొరంగాన్ని తవ్వే క్రమంలో, కాంక్రీటును చిన్నమొత్తంలో ఒక గొట్టం ద్వారా పంపించి ఎయిర్ గన్నునుపయోగించి లోపలి ఉపరితలంపైకి చల్లే ప్రక్రియను షాట్క్రీటింగ్ అంటారు. ఇది సొరంగం తవ్వేటప్పుడు బలహీనంగా ఉండే చోట్లలో మట్టిపెళ్లలు విరిగి పడిపోకుండా చేసే తాత్కాలిక రక్షణ ఏర్పాటు

షాట్‌క్రీటింగ్ పని వివరాలను నమోదు చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఐతే, అంచనాలను తయారుచేసినప్పుడు, ఈ పనులకవసరమయ్యే వివిధ సామగ్రుల పరిమాణాలను మదింపు వేయగలిగారు కనుక ఈ సమాధానం సరికాదు.

అంచనా వేసిన దాని కన్నా తక్కువ పరిమాణంలో పనులు జరిగిన కారణంగా గుత్తేదార్లకు అనుచిత లాభాలు చేకూరాయన్న వాస్తవాన్ని ప్రభుత్వం తన సమాధానంలో ఖండించలేదు. ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన నిబంధనలను ఒప్పందాలలో చేర్చి ఉంటే గుత్తేదార్లకు అనుచిత లాభాలు చేకూరేవికావు.

## 2.2.7 ఒప్పందపు నిబంధనల అమలు

### 2.2.7.1 పన్నులు, సుంకాలకు సంబంధించిన నిబంధనలు

పనుల్లో భాగంగా చెల్లించాల్సిన పన్నులు, సుంకాలను కలుపుకొని గుత్తేదారు తన ధరను తెలపాలని టెండరు నోటీసులో నిర్దేశించారు. ఐతే, పన్నులను, సుంకాలను విడివిడిగా చూపాలని చెప్పకపోవడం ఈ నిబంధనలోని మౌలిక లోపం. పన్నులు, సుంకాలను విడివిడిగా చూపడం వల్ల ఈ కింది ప్రయోజనాలున్నాయి ః

(ఎ) బిడ్ మొత్తంలో పన్నులను తప్పుగా కలిపినట్లైతే, దాన్ని సరిదిద్దవచ్చు. పన్నులు, సుంకాల రేట్లలో ఏమైనా మార్పులు చోటు చేసుకుంటే, తదనుగుణంగా చెల్లింపులను నియంత్రించడానికి కూడా ఇది ఉపయోగ పడుతుంది.

(బి) పన్నుల వసూలు అధికారులు, గుత్తేదార్లనుండి పన్నులను, సుంకాలను సరిగ్గా రాబట్టుకోవడానికి ఇది దోహదపడుతుంది.

లిఫ్ట్-I ప్యాకేజీ అంచనాల్లో ఎక్సైజ్ సుంకాలు, పన్నులను చేర్చడం జరిగింది. పనులను గుత్తేదారుకు 2005 మార్చిలో అప్పగించారు. గుత్తేదారు తన ధరలో పన్నులు, సుంకాల నిమిత్తం రూ30.23 కోట్ల మొత్తాన్ని విడిగా చూపారు. కానీ పన్నుల వారీగా వివరాలను తెలపలేదు. పనులను అప్పగించేనాటికి దీనికి సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ (సి.ఇ.డి.) నుంచి మినహాయింపు ఉంది. 2005 ఏప్రిల్ నుండి విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అమలులోకి రావడంతో టర్నోవర్ పన్ను (టి.ఒ.టి.)[34] కూడా వర్తించదు. ఐతే, తదనుగుణంగా పన్నులకు సంబంధించి గుత్తేదార్లకు చేసిన చెల్లింపులను సర్దుబాటు చేయలేదు.

**అంచనాల పెంపు కారణంగా రూ65.87 కోట్ల అదనపు ఖర్చు**

గుత్తేదారు కోట్‌చేసిన ధర, అంచనా విలువకు 105 శాతాన్ని మించకుండా ఉంటేనే పనులను అప్పగించాలని ప్రభుత్వ ఆదేశాలు నిర్దేశిస్తున్నాయి. సాగునీటి పనులకు సెంట్రల్ ఎక్సైజ్ సుంకం నుండి మినహాయింపు ఉన్నా, టర్నోవర్ పన్ను వర్తించకపోయినా, టర్నోవర్ టాక్స్, ఎలక్ట్రోమెకానికల్ అంశంపై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ వంటి ఖర్చులను చేర్చడం వల్ల లిఫ్ట్-II, లిఫ్ట్-III ప్యాకేజీల అంచనాలు పెరిగిపోవడంతో ప్రభుత్వ ఆదేశాల వెనక ఉన్న ఉద్దేశ్యం నీరుగారిపోయింది. ఫలితంగా, **పట్టిక-21** లో చూపిన విధంగా, గుత్తేదార్ల ధరలు, అంచనాలపై 105 శాతం పరిమితిని మించి రూ65.87 కోట్లమేర అధికంగా ఉన్నప్పటికీ ఆ బిడ్లను ఆమోదించడం జరిగింది.

[34] టర్నోవరు రూ40 లక్షల కంటే తక్కువగా ఉంటేనే టర్నోవరు పన్ను వర్తిస్తుంది

పట్టిక-21 (రూపాయలు కోట్లలో)

| ప్యాకేజి | అంచనా విలువ | అంచనాలలో తప్పుగా తీసుకున్న సి.ఇ.డి, టి.ఒ.టి. మొత్తాలు | సి.ఇ.డి, టి.ఒ.టి. మొత్తాలు లేకుండా సరైన అంచనా విలువ | పనులను అప్పగించేందుకు గరిష్టపరిమితి (కాలమ్ 4 లో 105 %) | ఒప్పందం విలువ | ప్రభుత్వంపై అదనపు భారం |
|---|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7)=(6)-(5) |
| లిఫ్ట్-II | 560.29 | 54.92 | 505.37 | 530.64 | 578.04 | 47.40 |
| లిఫ్ట్-III | 639.55 | 55.25 | 584.30 | 613.52 | 631.99 | 18.47 |
| మొత్తం అదనపు ఖర్చు | | | | | | **65.87** |

గుత్తేదార్లు లిఫ్ట్-II, లిఫ్ట్-III ప్యాకేజీల పనులకు కోట్ చేసిన ధరలలో కలిసి ఉన్న పన్నుల వివరాలను విడిగా చూపలేదు. ఫలితంగా, పన్నులు, సుంకాలకు సంబంధించి చెల్లింపులను సరిగ్గా నియంత్రించారన్న భరోసా లేదు.

ఆర్థిక బిడ్లలో తప్పనిసరిగా పన్నులు, సుంకాలను విడివిడిగా చూపాలన్న నిబంధన ఉంటే, వాటికి సంబంధించిన చెల్లింపులను సక్రమంగా నియంత్రించే వీలుంటుందన్న విషయాన్ని ప్రభుత్వ కార్యదర్శి సమీక్షానంతర సమావేశంలో (2010 ఆగష్టు) అంగీకరించారు.

**2.2.7.2 బయానా (ఇ.ఎమ్.డి.) వసూలుకు సంబంధించిన నిబంధన**

**టెండరు నోటీసులో తప్పుగా నిర్దేశించడం మూలంగా బయానాను రూ5.80 కోట్ల మేర తక్కువగా వసూలు చేసారు**

ప్రస్తుతం అమలులో ఉన్న ఆదేశాల ప్రకారం, ఒప్పందం విలువ (రూ631.99 కోట్లు)లో 2.5 శాతం చొప్పున రూ15.80 కోట్ల మొత్తాన్ని బయానా రూపంలో వసూలు చేయాలి. ఐతే, లిఫ్ట్-III ప్యాకేజీకి సంబంధించిన టెండరు నోటీసులో, బయానా కింద రూ10 కోట్లను వసూలు చేస్తారని నిర్దేశించారు. దీనివల్ల, బయానాను రూ5.80 కోట్ల మేర తక్కువగా వసూలు చేసారు.

టెండరు నిబంధనల ప్రకారమే కాంట్రాక్టు సంస్థ బయానా మొత్తాన్ని చెల్లించిందనీ, ఒప్పందం విలువలో 2.5 శాతం మొత్తాన్ని చెల్లించాలని శాఖ ఒత్తిడి చేసినపుడు, అలా చేయరాదని హైకోర్టు ఆదేశించిందనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఐతే, టెండరు నోటీసులో సరైన బయానా మొత్తాన్ని ఎందుకు చూపలేదన్న విషయంపై ఈ సమాధానం మౌనంగా ఉంది.

**2.2.7.3 మొబిలైజేషన్ అడ్వాన్సుపై వడ్డీ రేటుకు సంబంధించిన నిబంధన**

**టెండరు ప్రక్రియ ముగిసిన తరవాత మొబిలైజేషన్ అడ్వాన్సుపై వడ్డీ రేటును తగ్గించారు - రూ2.76 కోట్లు**

మొబిలైజేషన్ అడ్వాన్సు రూపంలో గుత్తేదార్లకు రూ24.05 కోట్లను చెల్లించారు (2005 మార్చి). ఎన్.ఐ.టి., లిఫ్ట్-I ప్యాకేజీలో టెండరు నోటీసు/ఒప్పందం ప్రకారం, మొబిలైజేషన్ అడ్వాన్సు పై సంవత్సరానికి 12 శాతం వడ్డీని వసూలు చేయాలి. భవిష్యత్తులో వడ్డీ రేట్లలో ఏమైనా మార్పులుంటే అవి ఇదివరకే తీసుకున్న అడ్వాన్సులకు కూడా వర్తిస్తాయనే షరతులేవీ ఒప్పందంలో లేవు. అయినప్పటికీ, టెండరు నిబంధనలకు విరుద్ధంగా, అడ్వాన్సులపై వడ్డీ రేటును గడచిన కాలానికి కూడా వర్తించేలా 8/10 శాతానికి తగ్గించారు (2007 సెప్టెంబరు). గుత్తేదార్లకు లాభం చేకూరేలా తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వారి నించి రూ2.76 కోట్ల వడ్డీని తక్కువగా వసూలు చేయడమైంది.

ఒప్పందంలో అడ్వాన్సుపై వడ్డీ రేటు 12 శాతం ఉందని అంగీకరిస్తూనే, ఆ తర్వాత ఈ వడ్డీ రేటును అప్పుడు అమలులో ఉన్న వడ్డీ రేటుకి సమానంగా ఉండేలా సవరించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఒప్పందంలో కాలానుగుణంగా వడ్డీ రేటులో మార్పులుంటాయన్న నిబంధనేదీ లేదు. టెండరు ప్రక్రియ ముగిసిన తర్వాత, ఒప్పందంలోని నిబంధనలకు విరుద్ధంగా, వడ్డీరేటుని తగ్గించడం వల్ల ప్రభుత్వం రాబడిని కోల్పోగా ఆ మేరకు గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం చేకూరింది.

### 2.2.7.4 లిక్విడేటెడ్ డ్యామేజీల నిబంధన అమలు

**లిక్విడేటెడ్ డ్యామేజీలకు సంబంధించిన నిబంధన అమలు కావడం లేదు**

ఒప్పందంలోని షరతుల ప్రకారం, మొత్తం పని లేదా అందులోని అంశాలను నిర్దేశించిన గడువు తేదీల్లోగా గుత్తేదారు పూర్తిచేయలేకపోతే, ఆ జాప్యానికి గుత్తేదారే బాధ్యుడైతే, సంబంధిత అధికారి లిక్విడేటెడ్ డ్యామేజీ లను (ఆలస్యానికి పరిహారం) విధించవచ్చు. ఐతే, డిపార్టుమెంటు పరంగా పూర్తిచేయాల్సిన బాధ్యతలకు సంబంధించి మాత్రం ఒప్పందాలలో ఎలాంటి కాలపరిమితులను నిర్దేశించలేదు. పనుల్లో జాప్యాలున్నప్పటికీ, గుత్తేదార్ల నుండి లిక్విడేటెడ్ డ్యామేజీ (ఎల్.డి.) లను వసూలు చేయలేదు.

భూసేకరణలో జాప్యం, పంపులు/మోటార్ల ఎంపిక ఖరారు, చెల్లింపుల్లో జాప్యం మొదలైన కారణాల వల్ల కాంట్రాక్టు సంస్థలు గడువు తేదీల్లోగా పనులు పూర్తి చేయలేకపోయాయనీ, కనుక ఎల్.డి.లను విధించడం వీలు కాదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). డిపార్టుమెంట్ పూర్తి చేయాల్సిన వివిధ పనులకు సంబంధించి స్పష్టమైన గడువు తేదీలను ఒప్పందంలో నిర్దేశించలేదు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. ఒప్పందంలో కాలపరిమితులను చెప్పకుండా, జాప్యాలన్నిటికీ డిపార్టుమెంటు తమదే బాధ్యతనడం సరికాదు.

### 2.2.8 సారాంశం

సాగునీటి ప్రాజెక్టులు భారీ వ్యయంతో కూడుకున్నవి కాబట్టి, ఖర్చుకు తగిన ఫలితం పొందాలన్న ఉద్దేశ్యం నెరవేరాలంటే వీటిలో 'నిధుల నిర్వహణ', 'వ్యయ నియంత్రణ' లు అత్యంత కీలకం. సరైన ప్రణాళికా రచన లేకపోవడం, ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలు/పనులను సరైన క్రమంలో సమన్వయ రీతిలో చేపట్టకపోవడం వలన, అంతగా ప్రాథమ్యత లేని కార్యకలాపాలపై అవసరానికంటే ముందే నిధులను వినియోగించినట్టయింది. కీలకమైన భూసేకరణ ప్రక్రియలో అసాధారణ జాప్యం కారణంగా ప్రాజెక్టు నిర్మాణకాలం మరింత పెరిగింది. ఫలితంగా, లక్షిత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. నిర్దేశించిన గడువు ముగిసిపోయినా డిపార్టుమెంటు ఒక్క ఎకరానికి కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేకపోయింది. వ్యయ నియంత్రణలోని తీవ్ర లోపాలు అధిక ఖర్చుకు కారణమయ్యాయి. తదనుగుణంగా కలిగిన అదనపు ప్రయోజనం కూడా ఏమీ లేదు. పనుల పరిమాణాల్లో తగ్గుదలలున్నప్పటికీ, ఆ మేరకు ప్రాజెక్టు వ్యయం తగ్గలేదు. ఆ విధంగా అధ్వానమైన ప్రణాళికా రచన, ఒప్పందాలలోని లోపాల వలన గుత్తేదార్లు మాత్రమే లాభపడ్డారు.

### 2.2.9 సిఫార్సులు

- నిధుల నిర్వహణ ప్రభావవంతంగా ఉండాలంటే, ప్రాజెక్టుల అమలులో సరైన ప్రణాళికా రచన, ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలు/పనులను సరైన క్రమంలో సమన్వయ రీతిలో చేపట్టడాన్ని తప్పనిసరిగా అనుసరించాలి. దీనివల్ల విలువైన నిధులు అవసరానికి ముందే ఖర్చు కావడాన్ని, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో ఎలాంటి ప్రయోజనం లేకుండా సుదీర్ఘకాలం పాటు చిక్కుకుపోవడాన్ని నివారించవచ్చు.

- ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు, చేయాల్సిన పనుల పరిమాణాలు, చెయ్యాల్సిన ఖర్చు రెండింటి విషయంలోనూ అంచనాలను వీలైనంత వాస్తవికంగా రూపొందించేలా ఇ.పి.సి. కాంట్రాక్టు విధానంలో తగిన మార్పులను తీసుకువచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిగణించాలి.
- చేయాల్సిన పనుల పరిమాణాలను ఖచ్చితంగా నిర్ధారించలేనపుడు, ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడడానికి, వాస్తవంగా చేసిన పనుల పరిమాణాల ఆధారంగానే చెల్లింపులు చేయాలి తప్ప 'స్థిరమైన ధర' ప్రాతిపదికన పనులను అప్పగించకూడదు. ఇందుకు సంబంధించి ఇ.పి.సి. కాంట్రాక్టు విధానంలో తగిన మార్పులు చేయాలి.
- లిక్విడేటెడ్ డ్యామేజీ ల నిబంధనను ప్రభావవంతంగా అమలు చేయడానికి, గుత్తేదారు చేయాల్సిన పనులతో పాటు, డిపార్టుమెంట్ పూర్తి చేయాల్సిన బాధ్యతలకు సంబంధించి కూడా నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించి ఒప్పందాలలో నిర్దేశించాలి.

## మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

## 2.3 విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా) పనితీరు

### 2.3.1 ఉపోద్ఘాతం

విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా) ను ఎ.పి.పట్టణ ప్రాంతాల (అభివృద్ధి) చట్టం - 1975 క్రింద ఏర్పాటు చేయడం జరిగింది (1978 జూన్). విశాఖపట్నం నగరపాలక సంస్థ, అనకాపల్లి, భీముని పట్నం, గాజువాక, విజయనగరం అనే నాలుగు మునిసిపల్ పట్టణాలు, 178 గ్రామ పంచాయితీలలోని 287 గ్రామాలతో కలుపుకొని, సుమారు 1,721 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ఉడా పరిధిలో ఉంది.

ఉడా విధుల్లో ఈ కింది అంశాలు ప్రధానమైనవి :

- బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను తయారుచేసి, దాన్ని అమలు చేయడం
- గృహపథకాలను, శాటిలైట్ టౌన్ షిప్పులు, స్థలాలు మొదలైనవాటిని అభివృద్ధి చేయడం
- ప్రభుత్వ స్థలాల అమ్మకం/వేలం
- రోడ్లను వేయడం, వెడల్పు చేయడం
- దుకాణ సముదాయాలు/కార్యాలయ భవనాలు
- పట్టణ అటవీ కార్యకలాపాలు

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల (అభివృద్ధి) చట్టం - 1975 (చట్టం) కింద, రాష్ట్ర ప్రభుత్వం ఉడా నిర్వహణ కోసం నియత కాలికంగా ఛైర్మన్ నాయకత్వంలో ఒక బోర్డును నియమిస్తుంది. సివిల్ సర్వీసెస్‌కు చెందిన సీనియర్ అధికారిని ఉడా వైస్ ఛైర్మన్ (వి.సి.) గా నియమిస్తారు. వి.సి ఈ సంస్థకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా వ్యవహరిస్తారు. ప్రత్యేక రంగాలలోని వివిధ అధికారులు వి.సి.కి సహాయకులుగా ఉంటారు.

ఉడాలో 2005-06 నుండి 2009-10 మధ్యకాలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించగా ఈ కింది విషయాలు వెల్లడయ్యాయిః

**ఆడిట్ కనుగొన్న విషయాలు**

## 2.3.2 బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను తయారుచేయడం, అమలుచేయడం

### 2.3.2.1 మొదటి బృహత్ ప్రణాళిక

**మొదటి బృహత్ ప్రణాళిక లక్ష్యసాధనలో భారీ తగ్గుదలలు వున్నాయి**

నగరాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి చేయడమనేది పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్యమైన విధుల్లో ఒకటి. 1,721 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న నాలుగు పట్టణాలు, 287 గ్రామాలను రూ1,060 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో 1989 నుండి 2001 సంవత్సరాలకు ఉడా తన మొదటి బృహత్ ప్రణాళికను (ఎఫ్.ఎమ్.పి.) తయారుచేసింది.

మొదటి ఎఫ్.ఎమ్.పి. లో రోడ్లు వేయడం, రహదారి కూడళ్ల నిర్మాణం, ట్రక్కు టెర్మినల్స్, శాటిలైట్ టౌన్‌షిప్పులకు సంబంధించిన అంశాలను అమలు చేయడంలో **పట్టిక - 22** లో చూపిన విధంగా 64 నుండి 100 శాతం తగ్గుదలలు ఉన్నాయి.

పట్టిక - 22

| అంశం | లక్ష్యాలు | లక్ష్య సాధన | లోటు |
|---|---|---|---|
| **రోడ్లు** | 970.6 కి.మీ. | 225.1 కి.మీ. | 745.5 కి.మీ. (77%) |
| **రహదారి కూడళ్లు** | 16 | 4 | 12 (75%) |
| **ట్రక్కు టెర్మినల్‌లు** | 5 | 0 | 5 (100%) |
| **వినోద సంబంధిత** | 1400 ఎకరాలు | 500 ఎకరాలు | 900 ఎకరాలు (64%) |
| **విశాఖపట్నం మహానగర ప్రాంతంలో భూమి వినియోగం** | | | |
| నివాసాలు | 35843.49 ఎకరాలు | 16601 ఎకరాలు | 19242.49 ఎకరాలు (54%) |
| రవాణా సౌకర్యాలు | 20896.13 ఎకరాలు | 793 ఎకరాలు | 20103.13 ఎకరాలు (96%) |
| పారిశ్రామిక | 11431.49 ఎకరాలు | 7940 ఎకరాలు | 3491.49 ఎకరాలు (31%) |
| వినోద సంబంధిత | 2761.75 ఎకరాలు | 2533 ఎకరాలు | 228.75 ఎకరాలు (8%) |
| **శాటిలైట్ టౌన్‌షిప్పులు** | 15 | 0 | 15 (100%) |

పారిశ్రామికాభివృద్ధి ఏకీకృతం కాకపోవడం, విపత్తుల నిర్వహణపై శ్రద్ధ చూపుతూ పర్యావరణాన్ని నిర్వహించడంలో సరైన ప్రణాళిక లేకపోవడం, వాహనాలు నిలిపే స్థలాల విషయంలో ప్రణాళికా లోపం మొదలైనవి ఎఫ్.ఎమ్.పి. లో తగ్గుదలలకు కారణాలని ఉడా పేర్కొంది (2010 జూన్). ఉడాతో సహా వివిధ శాఖల మధ్య సమన్వయం లేదని కూడా ఆడిటు గమనించింది. బృహత్ ప్రణాళికను అమలు చేయడానికి అవసరమైన సంస్థాగత యంత్రాంగం కూడా ఉడాలో లేదు.

### 2.3.2.2 సవరించిన బృహత్ ప్రణాళిక

క్రిందటి బృహత్ ప్రణాళికలో లేని కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులకు కూడా చోటు కల్పిస్తూ ఉడా 2002 నుండి 2021 సంవత్సరాలకు ఒక 'సవరించిన బృహత్ ప్రణాళిక' (ఆర్.ఎమ్.పి.) ను ఉడా తయారుచేసింది. అందులో ఈ కింది లోపాలను ఆడిటు గమనించింది.

- నగరాన్ని సమతుల్యంగా అభివృద్ధి పరచే ఉద్దేశ్యంతో ప్రతి కార్యకలాపానికీ నిర్దిష్టమైన క్షేత్రాలతో ఒక చక్కని బృహత్ ప్రణాళికను రూపొందించేందుకు వీలుగా భూముల వినియోగంలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ఆర్.ఎమ్.పి. లో కొన్ని షరతులను నిర్దేశించింది. కొందరు వ్యక్తులు తమకు నేరుగా సమర్పించిన (2006 ఏప్రిల్ - జూన్) వినతి పత్రాల ఆధారంగా ప్రభుత్వం తనకు తానుగా భూముల వినియోగంలో కొన్ని మార్పులను ఆమోదించింది (2006 జూన్). ఉడా కూడా, ఆర్.ఎమ్.పి.ని ప్రచురించడానికి ముందే ప్రజల నుండి అందిన వినతి పత్రాల ఆధారంగా భూముల వినియోగంలో మార్పులను సిఫార్సు చేస్తూ ప్రతిపాదనలు పంపింది (2005 నవంబరు). ఐతే, వీటిని ఆర్.ఎమ్.పి. లో పొందుపరచలేదు. వివరాలు *అనుబంధం- 2.10* లో ఉన్నాయి.

**రెండో మాస్టర్ ప్లాన్ ను రూపొందించి, ఆమోదించే సమయంలో మొదటి మాస్టర్ ప్లాన్ లోని లోపాలపై దృష్టి పెట్టలేదు**

- ఆర్.ఎమ్.పి. లో వివిధ రంగాల వారీగా పెట్టుబడులను (మొదటి దశ - 2002-07: రూ4,540 కోట్లు; రెండవ దశ - 2007-12 : రూ5,266 కోట్లు) పొందుపరచినప్పటికీ (వివరాలు *అనుబంధం - 2.11* లో ఉన్నాయి), ఉడా అవి అమలయ్యేలా చూడలేదు. కనీసం వివిధ శాఖలు/సంస్థలు వాస్తవంగా పెట్టిన పెట్టుబడుల వివరాలు కూడా ఉడా వద్ద లేవు. ఆ విధంగా, మొదటి మాస్టర్ ప్లాన్‌లో గుర్తించిన లోపాలను రెండో మాస్టర్ ప్లాన్‌లో కూడా సరిచేసుకోలేదు.

  సమన్వయ సంఘం సమావేశాలు నిర్వహించి మాస్టర్ ప్లాన్‌లోని పురోగతిని సమీక్షిస్తామని ఉడా సమాధానమిచ్చింది (2010 జూన్).

**ఆర్.ఎమ్.పి.కి విరుద్ధంగా భూవినియోగ మార్పులను ఆమోదించడం వల్ల మాస్టర్ ప్లాన్ మాన్యతను నీరుగార్చారు**

- 2005-10 మధ్య ఐదేళ్ల కాలంలో, భూమి వినియోగంలో మార్పులకి సంబంధించిన 74 కేసులను ఉడా ఆమోదించింది. వీటిలో 30 కేసులను ఆడిట్ మచ్చుకు తనిఖీ చేయగా అందులో 10 కేసులను మాస్టర్‌ప్లాన్ మాన్యతనే నీరుగారుస్తూ ఆర్.ఎమ్.పి. నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించారని వెల్లడైంది. వివరాలు ***అనుబంధం - 2.12*** లో ఉన్నాయి.

  ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల (అభివృద్ధి) చట్టం - 1975 ప్రకారం, తాము మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులనైనా చేయవచ్చని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). మార్పులు చేసే అధికారం అంటే దాని అర్థం మాస్టర్‌ప్లాన్‌ను ఉల్లంఘిస్తూ ఒక్కో స్థలానికి సంబంధించీ విడివిడిగా నిబంధనలు మార్చడం కాదు కనుక ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు. విశాల ప్రజాశ్రేయస్సు దృష్ట్యా పెద్ద పెద్ద భూముల వర్గీకరణలో మార్పులు చేయవచ్చు. ఇందులో సంకుచిత వ్యక్తిగత ప్రయోజనాలు ముడిపడి ఉండకూడదు.

- 1975, ఏ.పి.పట్టణ ప్రాంత (అభివృద్ధి) చట్టం లోని నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి షరతులూ విధించకుండా, రెండు ప్రైవేటు సంస్థలకు[35] సంబంధించిన రూ4.39 కోట్ల మేర భూవినియోగ మార్పిడి చార్జీలను ప్రభుత్వం మాఫీ చేసింది. పరిశ్రమలు స్థాపించేలా వ్యవస్థాపకులను ప్రోత్సహించేందుకే భూవినియోగ మార్పిడి చార్జీలను మాఫీ చేసామని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు. భూవినియోగ మార్పిడి చార్జీల చెల్లింపునుండి ఏఏ వర్గాల పారిశ్రామికవేత్తలను మినహాయిస్తారో తెలియజేసే నోటిఫికేషన్ ఏదీ లేనందున, ప్రత్యేకించి ఈ సంస్థలకు మాత్రమే చార్జీలను మాఫీ చేయడం అభ్యంతరకరం.

### 2.3.3 గృహనిర్మాణ ప్రాజెక్టులు/శాటిలైట్ టౌన్‌షిప్పులు, స్థలాలు మొదలైనవాటిని అభివృద్ధి చేయడం

**కాంట్రాక్టు నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడం వల్ల రూ355.23 కోట్ల రాబడి నష్టం**

2005-10 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో ఉడా 17 ప్రాజెక్టులను[36] చేపట్టింది. అందులో రెండు ప్రాజెక్టులు[37] మాత్రమే పూర్తి కాగా మరో రెండు ప్రాజెక్టులు[38] పూర్తికావచ్చాయి. ఎనిమిది ప్రాజెక్టులు[39] ప్రారంభ దశలోనే ఉన్నాయి. మిగిలిన ఐదు ప్రాజెక్టులు[40] ఇంకా ఆరంభం కాలేదు.

ఈ 17 ప్రాజెక్టులలో 14 ఒప్పందాలను ఆడిట్ పరిశీలించగా, ఈ కింద విశదీకరించిన విధంగా వాటిలో వ్యవస్థాపరమైన బలహీనతలు/లోపాలు వెల్లడయ్యాయి.

- ప్రాజెక్టులను చేపట్టేముందు భూములపై వివాదరహిత హక్కులు ఉండేలా చూసుకోలేదు. ఫలితంగా, ఉడా న్యాయ వివాదాలలో కూరుకుపోయింది.
- ఉడా ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయాలు రెవెన్యూ నష్టాలకు దారితీసాయి.
- గృహనిర్మాణ ప్రాజెక్టు పనుల కోసం కనీసం భూములు కూడా సిద్ధంగా లేకుండా (భూములపై హక్కులు తేలకపోవడం, వగైరాలు) కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు చెల్లించేసారు.

---

[35] మెస్సర్స్ రాంకీ ఫార్మాసిటీ (రూ4.29 కోట్లు), అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (రూ10.12 లక్షలు)

[36] నిర్మాణం - నిర్వహణ - బదిలీ (బి.ఒ.టి.): 5; ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (పి.పి.పి.): 8; ఉడా : 4

[37] పి.పి.పి. - 1, ఉడా - 1

[38] పి.పి.పి. - 2

[39] బి.ఒ.టి. - 4, పి.పి.పి. - 3, ఉడా - 1

[40] బి.ఒ.టి. - 1 (కోర్టులో ఉంది), పి.పి.పి. - 2, ఉడా - 2

ఆడిట్ పరిశీలించిన కేసులలో కొన్నింటిని ఈ కింద వివరించడమైంది. కేవలం ఈ కేసుల్లోనే ఉడా మొత్తం మీద రూ355.23 కోట్ల రాబడిని కోల్పోయింది.

### 2.3.3.1 లోపభూయిష్టమైన కాంట్రాక్టు నిర్వహణ కారణంగా రెవెన్యూ నష్టం (రుషికొండ హౌసింగ్ ప్రాజెక్టు)

ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య (పి.పి.పి.) ప్రాజెక్టులో రెవెన్యూ పంచుకునే ఏర్పాటు ఒక కీలకమైన అంశం. బెంగుళూరుకు చెందిన ఒక వ్యాపార సంస్థతో రెవెన్యూ పంచుకునే ఏర్పాటులో లోపాల కారణంగా ఉడా భారీగా రాబడిని కోల్పోయిందని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

**లోపభూయిష్టమైన కాంట్రాక్టు నిర్వహణ కారణంగా కోల్పోయిన రూ348.23 కోట్ల రాబడి**

రుషికొండలో 80 ఎకరాలలో పి.పి.పి. ప్రాతిపదికన ఒక సమీకృత గృహనిర్మాణ పథకాన్ని అభివృద్ధి చేయడానికి, బెంగుళూరులోని మెస్సర్స్ ఎ.బి.ఎస్. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ కు చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ అయిన మెస్సర్స్ గ్లోబల్ ఎంట్రోపోలిస్ ఆసియా ప్రైవేటు లిమిటెడ్ తో, ఉడా ఒప్పందం కుదుర్చుకుంది (2007 మార్చి). రూ581.20 కోట్ల విలువ చేసే ఈ ప్రాజెక్టు నుండి రూ882.46 కోట్ల రాబడి వస్తుందని అంచనా. ప్రాజెక్టు ఖర్చును భరించడమే కాకుండా, రూ236.50 కోట్ల కనీస గ్యారంటీ మొత్తాన్ని గానీ లేదా మొత్తం రెవెన్యూలో 26.8 శాతం గానీ ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని 30 నెలల్లోగా ఆ వ్యాపార సంస్థ ఉడా కి చెల్లించాలి.

ఆ వ్యాపార సంస్థ, రూ1,800 కోట్ల వ్యయంతో, 86,33,274 చదరపు అడుగుల వైశాల్యం గల నిర్మాణం చేపట్టడానికి పర్యావరణ అనుమతి[41] కోరుతూ రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ (ఎస్.ఎల్.ఇ.ఐ.ఎ.ఎ.) కు దరఖాస్తు చేసుకుంది (2007 అక్టోబరు). ఒక కాపీని ఉడా కి కూడా పంపింది.

ఐతే, మళ్లీ ఇంతలోనే (2008 జనవరిలో) ఆ సంస్థ, ఒప్పందాన్ని మధ్యలోనే ముగించాలని[42] ఉడాని, ప్రభుత్వాన్ని కోరింది. అందుకు 51,49,790.31 చదరపు అడుగుల నిర్మిత వైశాల్యం వల్ల వచ్చే రూ1,121.34 కోట్ల అంచనా రాబడి ఆధారంగా చెల్లిస్తామని ప్రతిపాదించింది. ఇది పర్యావరణ అనుమతి కోరేటప్పుడు చూపిన నిర్మాణ వైశాల్యం (86,33,274 చదరపు అడుగులు) కంటె తక్కువ. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించింది. తదనుగుణంగా ఆ సంస్థ రూ1,121.34 కోట్ల అంచనా రాబడిపై రూ242.29[43] కోట్లు చెల్లించింది. ఎస్.ఎల్.ఇ.ఐ.ఎ.ఎ. నుండి పొందిన పర్యావరణ అనుమతి (2008 ఫిబ్రవరి) ప్రకారం 86,33,274 చదరపు అడుగులు నిర్మిస్తే దానివల్ల ఉడాకి రూ732.44 కోట్ల[44] రెవెన్యూ (మొత్తం రెవెన్యూలో 26.8 శాతం) వచ్చి వుండేది.

86,33,274 చదరపు అడుగుల నిర్మాణానికి అనుమతి కోరుతూ సంస్థ సమర్పించిన వినతి పత్రం ప్రతిని 2007 అక్టోబరులోనే అందుకున్నందున అంతకంటే తక్కువగా 51,49,790.31 చదరపు అడుగుల నిర్మాణంపై రూ242.29 కోట్ల చెల్లింపుతో ముందస్తు ముగింపుకి అంగీకరించకుండా ఉండాల్సింది. 86,33,274 చదరపు అడుగుల నిర్మాణానికి రూ590.52 కోట్లు[45] వచ్చేవి. దీని ఫలితంగా ఉడా రూ348.23 కోట్ల[46] మేర రెవెన్యూ నష్టపోయింది.

[41] 2008 ఫిబ్రవరిలో ఎస్.ఎల్.ఇ.ఐ.ఎ.ఎ. నుండి పర్యావరణ అనుమతి వచ్చింది

[42] ఉడా ప్రయోజనాలకు భంగం కలిగేలా ఈ ప్రైవేటు సంస్థ తన స్వలాభం కోసం ఉపయోగించుకున్న ఈ నిబంధన ఈ ఒప్పందంలో తప్ప ఉడా ఇంతకు ముందు చేపట్టిన ఎనిమిది పి.పి.పి. ప్రాజెక్టుల్లో ఎందులోనూ లేదు

[43] రూ300.52 కోట్ల నికర ప్రస్తుత విలువ (11 శాతం) అంచనా వేసిన మొత్తం రెవెన్యూలో 26.8 శాతం

[44] రూ581.20 కోట్ల ప్రాజెక్టు ఖర్చుకి, అంచనా వేసిన రెవెన్యూ రూ882.46 కోట్లు. ఈ లెక్కన రూ1,800 కోట్ల ప్రాజెక్టు ఖర్చుకి రెవెన్యూ రూ2,733 కోట్లు అవుతుంది. దీని ఆధారంగా రూ732.44 కోట్ల విలువను లెక్కించడం జరిగింది

[45] రూ732.44 కోట్ల నికర ప్రస్తుత విలువ (11 శాతం)

[46] రూ590.52 కోట్లు - రూ242.29 కోట్లు

అదనపు నిర్మాణ వైశాల్యానికి సంబంధించి తన వాటా సొమ్మును వసూలు చేసుకోవడానికి అమ్మకపు ఒప్పందంలో నిబంధన లేదని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). ఐతే, పెరిగిన నిర్మాణం ఆధారంగా రెవెన్యూలో తన వాటాను ఎందుకు అడగలేదన్న విషయాన్ని ఉడా వివరించలేదు. ఆ సమాధానం సరికాదు. ప్రభుత్వ ప్రయోజనం కాపాడలేదన్న ఆడిట్ వాదనను ఇది ఇంకా బలపరుస్తోంది.

### 2.3.3.2 మధురవాడలో మెగా హౌసింగ్ ప్రాజెక్టు

**పథకం ప్రారంభించడానికి ముందే వివాదరహిత భూసేకరణ చేయడంలో ఉడా వైఫల్యం వలన కాంట్రాక్టరుకి అనుచిత లబ్ధి**

మధురవాడ కొండ అటవీ ప్రాంతంలో 40 ఎకరాలలో 2002 గృహాలతో ఒక భారీ గృహనిర్మాణ పథకాన్ని డిజైన్ - బిల్డ్ కాంట్రాక్టు పద్ధతిలో ఉడా చేపట్టింది (2004 అక్టోబరు). బెంగుళూరులోని మెస్సర్స్ జురంగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్‌కు ఈ ప్రాజెక్టును అప్పగించింది (2004 డిశంబరు). చదరపు అడుగుకి రూ635.54 చొప్పున 21,81,000 చదరపు అడుగుల నిర్మిత వైశాల్యంగల ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా విలువ రూ138.61 కోట్లు.

ఉడా, ఈ ప్రాజెక్టు నిర్మించదలచిన భూమిపై హక్కుల (టైటిల్) ను సరిచూసుకోవడంగానీ, ఆ భూమి వినియోగం, గృహనిర్మాణ పథకానికి అనుమతించదగ్గదేనా అని తెలుసుకునేందుకు సర్వే నిర్వహించడంగానీ చేయలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ప్రాజెక్టు నిర్మాణానికి వీలుగా, ఆభూమిని 'కొండ అటవీ ప్రాంతం' నుండి 'నివాస' భూమిగా భూవినియోగ మార్పిడి (కన్వర్షన్) కోసం ప్రభుత్వ ఆమోదాన్ని కూడా పొందలేదు. ఇవన్నీ చేయకుండానే, సంవత్సరానికి 8.35 శాతం వడ్డీ రేటుతో రూ3 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సును కాంట్రాక్టు సంస్థకి చెల్లించేసారు (2004 డిశంబరు). ఈలోగా, ఈ మెగా ప్రాజెక్టు, చారిత్రాత్మక బౌద్ధ కట్టడం ఉన్న రక్షిత ప్రాంతంలో ఉందంటూ, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ విశాఖపట్నం జిల్లా విభాగం ప్రాజెక్టును సవాలు చేస్తూ కోర్టులో దావా వేసింది (2005 ఫిబ్రవరి). పర్యవసానంగా పనులు ముందుకు సాగలేదు. నిజానికి అది రక్షితప్రాంతం కాదు. అది 1981 సంవత్సరంలో తొలుత జారీచేసిన నోటిఫికేషన్ దొర్లిన పొరపాటు[47] మాత్రమే. ఈ లోపాన్ని వెనువెంటనే సరిదిద్ది ఉండవచ్చు. అలా చేసి ఉంటే, నిర్మాణం సజావుగా జరిగి, మొబిలైజేషన్ అడ్వాన్సు త్వరగా వసూలయ్యుండేది. ఐతే, ఈ లోపాన్ని సరిదిద్దడానికి రెండేళ్లు (2004 నుండి 2006 వరకు), సవరించిన ప్రాజెక్టు విలువను లెక్కించడానికి మరో మూడేళ్లు (2006 నుండి 2009 వరకు) పట్టింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి ముందే మరో రూ3.93 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సు చెల్లించారు (2005 మార్చి).

మొబిలైజేషన్ అడ్వాన్సు త్వరగా తిరిగి వసూలవడమనేది పనులు సజావుగా సాగడంపై ఆధారపడి ఉంటుంది. భూములపై స్పష్టమైన హక్కులు లేకుండా, పనులు సజావుగా సాగే అవకాశం లేకపోయినా మొబిలైజేషన్ అడ్వాన్సు చెల్లించడం వల్ల ఈ కింది దుష్పరిణామాలుంటాయిః

(i) కాంట్రాక్టరు వద్ద చాలా కాలంపాటు నిధులు చిక్కుకుపోతాయి.

(ii) అడ్వాన్సుపై సాధారణ వడ్డీ మాత్రమే వసూలు చేస్తారు కనుక వాస్తవానికి ప్రభావవంతంగా వసూలయ్యే వడ్డీ రేటు అంతకన్నా తక్కువే అవుతుంది.

దీంతో, మొబిలైజేషన్ అడ్వాన్సు నాలుగు నుండి ఐదేళ్ల సుదీర్ఘ కాలం పాటు (2004 డిసెంబరు నుండి 2009 నవంబరు వరకు) కాంట్రాక్టరు వద్ద ఉండిపోవడమే కాకుండా ప్రభావపరంగా చూస్తే వాస్తవంగా చెల్లించే వడ్డీ రేటు చెల్లించాల్సిన సాధారణ వడ్డీ రేటు కంటే చాలా తక్కువగా ఉంటుంది కనుక తద్వారా కాంట్రాక్టరు ప్రయోజనం పొందుతున్నారు. మొదట్లో నిర్ణయించిన ధర ఏఏ అంశాలు/ఖర్చుల ఆధారంగా లెక్కించారన్న

[47] బౌద్ధ కట్టడం ఉన్న రక్షిత ప్రాంతం క్రిందకు రాకపోయినా, రక్షిత ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉందని చెప్పారు

వివరాలు ఉడా వద్ద లేవు. ఆ తరువాత, ఒక్కో చదరపు అడుగుకి రూ1,054 చొప్పున (మొదట్లో అంగీకరించిన రూ635.54 ధరకి బదులు) చెల్లించడానికి అంగీకరిస్తూ 9,43,168 చదరపు అడుగుల నిర్మిత వైశాల్యానికి ఒక అనుబంధ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు (2009 నవంబరు). ఐతే, మొదట్లో నిర్ణయించిన ధరలో ఉన్న అంశాల ఆధారంగా లెక్కించి దానిపై ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ కొత్త ధరను నిర్ణయించలేదు. ఎట్టకేలకు పనులు 2009 డిసెంబరులో ఆరంభమయ్యాయి.

ఆ విధంగా, భూములపై హక్కుల విషయంలో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయకపోవడం, వగైరాల కారణంగా ఉడా న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఫలితంగా, ప్రాజెక్టు అమలులో ఐదేళ్ల జాప్యమయ్యింది. అంతే కాకుండా, కొనుగోలు దార్లపై అనవసరంగా రూ39.47 కోట్ల[48] మేర అదనపు భారం కూడా పడింది.

పై లోపాలను అంగీకరిస్తూ, ఈ సమస్యలను ముందుగా ఊహించలేకపోయామని ఉడా తెలిపింది (2010 అక్టోబరు).

### 2.3.3.3 ఉడా వాటాను తప్పుగా నిర్ణయించడం వల్ల కోల్పోయిన రెవెన్యూ

రుషికొండ గ్రామంలోని 50 ఎకరాల భూమిలో ఒక గృహనిర్మాణ పథకాన్ని హైదరాబాద్ లోని మెస్సర్స్ ఏంబియన్స్ ప్రోపర్టీస్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్[49] కి ఉడా అప్పగించింది (2003 డిసెంబరు).

తమ చార్టర్ ఎకౌంటెంట్ (సి.ఎ.) సలహా మేరకు ఉడా తమ వాటాగా రూ15 - రూ17 కోట్ల కనీస గ్యారంటీ మొత్తాన్ని గానీ, లేదా స్థూలరాబడిలో 15 శాతాన్ని గానీ ఇవ్వాలని ఆ సంస్థను కోరింది (2003 నవంబరు). అయితే ఆ తర్వాత, దీనికంటే తక్కువగా, రూ7 కోట్లు కనీస గ్యారంటీ లేదా మొత్తం రెవెన్యూలో 7.5 శాతం, ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని ఉడా తన వాటాగా అంగీకరించింది. ఈలోగా, రియల్ ఎస్టేటు ధరలు విపరీతంగా పెరగడంతో ప్రభుత్వ సలహా (2004 నవంబరు) మేరకు ఆ టెండరును రద్దు చేసి మళ్లీ తాజాగా టెండర్లు పిలిచింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆర్బిట్రేషన్ క్లాజు కింద ఆ సంస్థ ఒక రిట్ పిటీషన్‌ను దాఖలు చేసింది (2004 డిశంబరు). అయితే ఉడా తిరిగి టెండర్లు పిలవడానికి కోర్టు అనుమతించింది. ఐతే, న్యాయనిర్ణయం వెలువడే వరకు టెండర్లను ఖరారు చేయ్యరాదని ఆదేశించింది.

రెండవ టెండరు ప్రక్రియలో (2004 డిశంబరు), అత్యధిక టెండరుదారు ఉడా వాటాగా రూ20 కోట్లు ఇవ్వజూపారు. కోర్టులో కేసు పరిష్కారం కాకముందే, ప్రభుత్వ ప్రమేయంతో సంబంధిత సంస్థ కేసును వెనక్కు తీసుకుంది. ఆ సంస్థతో మరో ఒప్పందాన్ని చేసుకోవాలని, ప్రభుత్వం ఉడాను ఆదేశించింది (2005 జూలై). తదనుగుణంగా, ఉడా తన వాటాగా కనీసమొత్తం రూ13 కోట్లు లేదా మొత్తం రెవెన్యూలో 7.5 శాతం ఏది ఎక్కువైతే అది వచ్చే విధంగా ఒప్పందం చేసుకుంది (2005 జూలై). రెండవ టెండరు ప్రక్రియలో అత్యధిక మొత్తాన్ని ఇవ్వజూపిన టెండరును విస్మరించడం జరిగింది. ఈ విధంగా కోర్టుకు వెలుపల చేసుకున్న పరిష్కారం వల్ల, ఉడాకి రూ7 కోట్ల నష్టం వచ్చింది.

మొత్తం రెవెన్యూలో 7.5 శాతం లెక్కన తమకు రూ20 కోట్ల రాబడి (కనీస హామీ రూ13 కోట్లు) వస్తుందని ఉడా సమాధాన మిచ్చింది (2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యంకాదు. రియల్ ఎస్టేటు ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్న కారణంతో టెండరు ప్రక్రియను రద్దుచేసినప్పటికీ, కోర్టుకి వెలుపల పరిష్కారం చేసుకుందామని ఆ సంస్థ అడిగినప్పుడు, కనీసం సి.ఎ. సలహా ఇచ్చిన విధంగా రూ15 - రూ17 కోట్ల కనీస గ్యారంటీ మొత్తం లేదా స్థూల రాబడిలో 15 శాతం వాటానైనా పొందడంలో ఉడా విఫలమైంది.

[48] (రూ1,054 - రూ635.54) x 9,43,168 చ.అ.

[49] నిపుణులకమిటీ ఎంపికచేసిన నాలుగు సంస్థలలో రాబడిలో అత్యధిక వాటాను ఇవ్వజూపిన సంస్థ

మరోవైపు, రెండవ టెండరు ప్రక్రియలో వచ్చిన అత్యధిక బిడ్డు నుండి కూడా ప్రయోజనాన్ని పొందలేక పోయింది.

ఆ విధంగా, ఉడాలో కాంట్రాక్టు నిర్వహణ లోపభూయిష్టంగావుంది.

### 2.3.4 ప్రభుత్వ భూముల అమ్మకం/వేలం

**ప్రభుత్వ భూముల అమ్మకం/వేలంలో ఉడా తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల ఉడాకు/ప్రభుత్వానికి, రూ15.71 కోట్ల నష్టం వాటిల్లింది**

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌కు మద్దతుగా సంస్థ పరిధిలో వున్న ప్రభుత్వ భూములను విక్రయించే/వేలంవేసే బాధ్యతను ప్రభుత్వం ఉడాకు అప్పగించింది. ఆడిట్ పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయిః

#### 2.3.4.1 వివాద రహిత భూములను వివాదాస్పద భూములతో కలపడం

రాష్ట్ర బడ్జెటుకు సాయపడడం కోసం, మధురవాడలోవున్న 28 ఎకరాల స్థలాన్ని[50] అమ్మడానికి ఉడా నిర్ణయించింది. ఆ తర్వాత దానిని 23.30 ఎకరాలకు కుదించారు. ఈ 23.30 ఎకరాలలో, 9.40 ఎకరాలు వివాదంలో ఉన్నందున వేలం నుండి దానిని వేరుచేసి (2008 జనవరి 5 న కలెక్టరు జారీ చేసిన ఆదేశాల ప్రకారం), వివాదరహితమైన మిగిలిన 13.90 ఎకరాలను వేలం వేయాలి. 2008 జనవరి 6 న ఈ 13.90 ఎకరాలకు వేలం నిర్వహించారు. ఎకరానికి రూ4 కోట్ల కనీస ధరతో వేలం జరిగింది. వేలంలో పాల్గొన్న ఇద్దరు బిడ్డర్లలో ఎకరానికి రూ7.06 కోట్లు చొప్పున అధికధరకి పాడిన ముంబాయికి చెందిన మెస్సర్స్ డివోనా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కి భూమిని కేటాయించారు.

వేలం జరుగుతుండగా, 90 రోజుల్లోగా హైకోర్టు ఉడాకి అనుకూలంగా తీర్పు ఇస్తే మిగిలిన 9.40 ఎకరాల భూమిని కూడా అదే ధరకు కేటాయిస్తామని ఉడా వైస్ ఛైర్మన్ ప్రతిపాదించారు. తదనుగుణంగా, వేలం జరిగిన రోజునే, నిర్దిష్ట కారణాలేవీ తెలుపకుండా, కలెక్టరు ఆదేశాలను విస్మరిస్తూ, వివాదరహితభూములను (13.90 ఎకరాలు) వివాదస్పద భూములతో (9.40 ఎకరాలు) కలుపుతూ ఉడా ఒక తీర్మానాన్ని ఆమోదించింది (2008 జనవరి 6). ఆ తీర్మానంలో, ఈ ప్రతిపాదన నుండి బిడ్డరు మధ్యలో విరమించుకునేందుకు వీలు కల్పిస్తూ ఒక నిబంధనను కూడా చేర్చారు. ఐతే, ఈ నిబంధనను 9.40 ఎకరాలకు మాత్రమే పరిమితం చెయ్యలేదు.

వేలంలో నెగ్గిన సంస్థ, రూ13.27 కోట్ల[51] అపరాధ రుసుమును చెల్లించాల్సిన అవసరం లేకుండానే, 13.90 ఎకరాల కొనుగోలు కోసం తాను గతంలో పాడిన వేలం పాట నుండి వెనక్కు తగ్గేందుకు, నిబంధనలోని ఈ లోపాన్ని ఉపయోగించుకుంది. వేలం నుండి నిష్క్రమించాలని నిర్ణయించుకొని, తాము ఇదివరకు చెల్లించిన రూ98.13 కోట్ల[52] పూర్తి మొత్తాన్ని వాపసు ఇమ్మని ఆ సంస్థ కోరగా (2008 జూన్), అందుకు ప్రభుత్వం అంగీకరించింది (2009 జనవరి).

వివాదాస్పద భూమిని వివాదరహిత భూమితో ఏనాడూ కలుపలేదని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). భూములను కలుపుతారన్న విషయం ఇతర బిడ్డర్లకు ముందుగా తెలియదు కనుక వేలం సమయంలో భూములను కలపడం సబబు కాదు. ఈ విషయం ముందుగా తెలియనందున వేలంలో పాల్గొనే అవకాశమున్న చాలామంది బిడ్డర్లు అందులో పాల్గొని ఉండకపోవచ్చు.

---

[50] నెం. 15

[51] ఇ.ఎమ్.డి. రూ1 కోటి + రూ12.27 కోట్లు (రూ24.53 కోట్ల డిపాజిట్‌లో 50 శాతం)

[52] 2008 జనవరి - ఫిబ్రవరి మధ్య, ఎకరానికి రూ 7.06 కోట్లు చొప్పున 13.90 ఎకరాలకు చెల్లించిన మొత్తం

### 2.3.4.2 కనీస వేలం ధరను తగ్గించడం వల్ల రెవెన్యూ నష్టం

మధురవాడలో 10 స్థలాలను[53] 'టెండర్ మరియు వేలం' ద్వారా అమ్మడానికి ఉడా నిర్ణయించింది (2007 నవంబరు). అన్ని స్థలాలకూ, ఎకరానికి కనీస (అప్ సెట్) ధరను రూ4 కోట్లుగా నిర్ణయించింది. 2008 జనవరి 6 వ తేదీన వేసిన వేలంలో ఒక్క నెం.17 స్థలం మినహా మిగిలిన అన్ని స్థలాలకూ ఎకరానికి రూ4.02 కోట్ల నుండి రూ7.06 కోట్ల మధ్య ధర పలికింది. అంతేకాకుండా, ప్లాట్ నెం. 17 కి గల లక్షణాలే ఉన్న[54] ప్లాట్ నెం. 9 కూడా ఎకరం రూ4.42 కోట్ల ధరకు అమ్ముడుపోయింది. ఆ విధంగా వేలానికి మంచి స్పందనే వచ్చింది.

వేలం జరిగిన అదే రోజు (2008 జనవరి 6) ప్లాట్ నెం. 17 (3.13 ఎకరాల విస్తీర్ణం) కనీస ధరను రూ4 కోట్ల నుండి రూ3 కోట్లకు తగ్గించి ఎకరం రూ3.22 కోట్ల[55] ధరకు విక్రయించారు. దీనివల్ల ప్రభుత్వానికి సుమారు రూ2.44 కోట్ల[56] నష్టం వచ్చింది

స్థలాల విలువలో మాంద్యం కారణంగా, ధరను తగ్గించామని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). ఈ సమాధానం సరైందికాదు, అదే రోజున వేలం వేసిన ఆరు స్థలాలకు కనీసధర కంటె అధికంగా రూ4.02 కోట్ల నుండి రూ7.06 కోట్ల మధ్య ధర పలికింది. ప్రత్యేకించి ఈ ఒక్క స్థలానికే కనీస ధరను తగ్గించడం వలన దానిపై రాబడి తగ్గింది.

పై రెండు కేసుల్లో ఉడా/ప్రభుత్వం మొత్తం మీద రూ15.71 కోట్ల రెవెన్యూ నష్టపోయింది.

## 2.3.5 రోడ్లు వేయడం, వెడల్పు చేయడం

లే-అవుట్లలో వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల పనులు, డిపాజిట్ పనులను ఉడా నిర్వహిస్తుంది.

**విశాఖపట్నం - భీమిలి బీచ్ రోడ్డు పని నిర్వహణలో కాంట్రాక్టరుకి అనుచిత లబ్ధి**

విశాఖపట్నం - భీమిలి బీచ్ రోడ్డును వెడల్పు చేసి, అభివృద్ధి చేయడానికి, సంబంధించిన రెండు రోడ్డు పనులను ఉడా 2006 ఆగస్టు (ఫేజ్ - II), 2007 జనవరిలో (ఫేజ్ - III), రూ9.77 కోట్లకు ఒక ఏజన్సీకి[57], అప్పగించింది. 2007 ఫిబ్రవరి, 2007 అక్టోబరులోగా ఈ పనులు పూర్తవ్వాలి. ఐతే, ఒప్పందం గడువులోగా ఆ కాంట్రాక్టు సంస్థ ఫేజ్-II లో 23 శాతం, ఫేజ్-III లో 9 శాతం పనులు మాత్రమే పూర్తిచేసింది. చివరకు 2008 జనవరిలో, వరుసగా 50 శాతం, 17 శాతం పనులు జరిగిన తర్వాత, ఒప్పందంలోని 33వ షరతుకు విరుద్ధంగా, అధిక ధరలను కోరుతూ కాంట్రాక్టరు పనులు నిలిపివేసారు. ఎ.పి.డి.ఎస్.ఎస్.[58] లో ఉన్న ప్రాథమిక నిబంధనల్లోని క్లాజు 60 (ఎ) ప్రకారం కాంట్రాక్టులను రద్దు చేసి, తమ వద్ద ఉన్న కోటి రూపాయిల మొత్తాన్ని (బయానా సొమ్ము, కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన ఇతర మొత్తాలు) జప్తుచేయడానికి బదులు, ఎటువంటి అపరాధ రుసుమూ విధించకుండా, ఉడా ఆ సంస్థ కోరికను అంగీకరించి, ధరల పెరుగుదల నిమిత్తం రూ1.33 కోట్లు చెల్లించింది. పనులు 2008 అక్టోబరులో పూర్తయ్యాయి. కాంట్రాక్టరు అడిగిన విధంగా రేట్లు చెల్లించడంవల్ల, కాంట్రాక్టరుకు రూ1.33 కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరింది.

[53] ప్లాట్ నెం 9 నుండి 18 వరకు

[54] ఉడా విడుదల చేసిన కరపత్రం ప్రకారం

[55] మెస్సర్స్ డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైదరాబాద్ కి

[56] (రూ 4.00 కోట్లు - రూ3.22 కోట్లు) x 3.13 ఎకరాలు

[57] మెస్సర్స్ జి.వి.ఆర్. కన్‌స్ట్రక్షన్స్, ఖమ్మం

[58] ఆంధ్రప్రదేశ్ డీటైల్డ్ స్టాండర్డ్ స్పెసిఫికేషన్స్

సంస్థ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, ప్రజల డిమాండు నెరవేర్చడం కోసం దీనిని ప్రత్యేక కేసుగా పరిగణించి కాంట్రాక్టరుకు ప్రైస్ ఎస్కలేషన్ చెల్లించామని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). ఐతే, దీన్ని ప్రత్యేక కేసుగా పరిగణించడం ద్వారా కాంట్రాక్టరుకు అనుచిత ప్రయోజనం చేకూర్చారన్నది మాత్రం వాస్తవం. దీనివల్ల అసలు ఆ కాంట్రక్టరుకు చెల్లించిన ధరలు అత్యల్ప టెండరు ధరేనా అన్న సందేహం కూడా తలెత్తుతోంది.

### 2.3.6 దుకాణ సముదాయాలు

ఉడా వద్ద 27 దుకాణ/కార్యాలయ సముదాయాలలో 374 దుకాణాలు/కార్యాలయాలు ఉన్నాయి. వాటిని ప్రైవేటు వ్యక్తులకు, ప్రభుత్వ సంస్థలకు అద్దెకు ఇస్తున్నారు. ఐతే, ఈ అద్దెలను సకాలంలో వసూలు చేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని ఉడా రూపొందించుకోలేదని, ఫలితంగా, భారీగా అద్దె బకాయిలు పేరుకుపోయాయని ఆడిట్ గమనించింది.

- 2010 జూన్ నాటికి, ప్రభుత్వశాఖల నుండి రావలసిన అద్దె బకాయిలు రూ2.04 కోట్లు.
- ప్రైవేటు పార్టీలనుండి రావాల్సిన రూ80 లక్షల అద్దె బకాయిల్లో మూడు[59] సంస్థల నుండి రావలసినవే రూ55 లక్షలు ఉన్నాయి. ఈ మూడు సంస్థలతో లీజు ఒప్పందాలు కుదుర్చుకోనే లేదు.

ఆడిట్ ఎత్తిచూపిన లోపాలను ఉడా ఒప్పుకుంది (2010 అక్టోబరు). సంబంధిత పార్టీలనుండి బకాయిలను వసూలు చేయడానికి అంగీకరించింది.

### 2.3.7 పట్టణ ప్రాంతాల అటవీకరణ

పార్కులను, పచ్చదనాన్ని, వినోద సదుపాయాలను అభివృద్ధి చేసి వాటిని నిర్వహించడం ఉడా లోని పట్టణ అటవీకరణ విభాగం విధులు.

**లోపభూయిష్టంగా ఉన్న రెవెన్యూ వసూలు ఏర్పాట్లు**

కైలాసగిరి కొండపై ఉడా ఒక పార్కును అభివృద్ధి చేసింది. కైలాసగిరి కొండ వద్ద రెండేళ్లపాటు టికెట్లను విక్రయించడానికి నెలకి రూ4.32 లక్షల లీజు అద్దెతో ఒక కాంట్రాక్టరుతో ఒప్పందం కుదుర్చుకుంది (2006 జూలై).

ఆ కాంట్రాక్టరు నెలవారీ అద్దెలు సక్రమంగా చెల్లించలేదు, దీంతో కాలక్రమేణా రూ8.02 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి (2008 సెప్టెంబరు). బకాయిలు పేరుకుపోయినా ఉడా మాత్రం 2008 జూలై నుంచీ లైసెన్సు ఫీజును నెలకు రూ5.01 లక్షలకి పెంచుతూ లైసెన్సును పొడిగించింది (2008 సెప్టెంబరు). కాంట్రాక్టరు నుండి మూడు నెలల లీజు అద్దెకు సమానమైన రూ15.03 లక్షలకు బ్యాంకు గ్యారంటీని తీసుకుంది. కాంట్రాక్టరు ఈసారి కూడా సక్రమంగా అద్దె చెల్లించలేదు. కాంట్రాక్టరు నుండి రావలసిన మొత్తం బకాయిలు బ్యాంకు గ్యారంటీకి సమానంగా ఉన్నప్పుడే  ఒప్పందాన్ని రద్దు చేయడానికి బదులు, బ్యాంకు గ్యారంటీ కన్నా చాలా అధికంగా రూ63.77 లక్షల బకాయిలు పేరుకుపోయాక చాలా ఆలస్యంగా 2009 జూలై లో మాత్రమే ఉడా ఈ ఒప్పందాన్ని రద్దు చేసింది.  దీనివల్ల ఉడాకు రూ48.74 లక్షల[60] నష్టం వాటిల్లింది.

[59] ఫ్యూజన్ ఫుడ్స్ : రూ21.91 లక్షలు, పైడా కాలేజి : రూ29.85 లక్షలు, ఆదర్శ్ స్కూలు : రూ3.65 లక్షలు

[60] రూ63.77 లక్షలు - రూ15.03 లక్షలు

ఈ మొత్తాన్ని రాబట్టుకోడానికి కేసు వేసామనీ, బకాయిలు వసూలుచేయడానికి చర్యలు తీసుకుంటామనీ ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). కాంట్రాక్టరు బకాయిలు నిరంతరం పేరుకుపోతున్నా, కార్యకలాపాలను అలాగే కొనసాగడానికి కారణమైన వ్యక్తులను గుర్తించి దీనికి బాధ్యులను చేస్తామని కూడా ఉడా హామీ ఇచ్చింది.

### 2.3.8 ఆర్థిక నిర్వహణ

ఉడా నిధుల్లో, దాని స్వంత రాబడి - అనగా, అభివృద్ధి చార్జీలు, అభివృద్ధి చేసిన ఇళ్ల స్థలాలు, కట్టిన ఇళ్ల అమ్మకం ద్వారా వచ్చిన రాబడి, లీజు అద్దెలు మొదలైన రాబడులు ఉంటాయి. 2005 - 10 మధ్య ఐదు సంవత్సరాలలో ఉడా రాబడులు, ఖర్చులు **పట్టిక - 23** లో చూపిన విధంగా ఉన్నాయిః

**పట్టిక - 23** (రూపాయలు కోట్లలో)

| సంవత్సరం | రాబడులు* | ఖర్చు |
|---|---|---|
| 2005-06 | 92.57 | 56.73 |
| 2006-07 | 92.42 | 50.98 |
| 2007-08 | 1172.87 | 1074.37 |
| 2008-09 | 150.28 | 229.72 |
| 2009-10 | 76.03 | 54.78 |

(ఆధారం ః ఉడా సమర్పించిన సమాచారం)

**సూచన:** 2007-08 నుండి 2009-10 సంవత్సరాలకు వార్షిక పద్దులను ఇంకా తయారు చేయలేదు (2010 ఆగష్టు). కనుక ఆ సంవత్సరాలకు సంబంధించిన అంకెలు ప్రాథమికమైనవి.

* 2007-08 సంవత్సరంలోని రూ1,172.87 కోట్ల రాబడిలో రూ1,007.93 కోట్లు, 2008-09 లోని రూ150.28 కోట్ల రాబడిలో రూ51.13 కోట్లు ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా వచ్చినవి. ఈ మొత్తాలను ప్రభుత్వ ఖాతాలో జమ చేసారు.

ఉడాలో ఆర్థిక నిర్వహణ ఈ క్రింద వివరించినట్లుగా లోపభూయిష్టంగా ఉంది ః

#### 2.3.8.1 వార్షిక పద్దులను తయారుచేయడం

**వార్షిక పద్దులను తయారు చేయడంలో విపరీతమైన ఆలస్యం జరిగింది**

చట్టంలోని అధ్యాయం - VI లోని పేరా 24(4) ప్రకారం, ఈ సంస్థ, తన వార్షిక పద్దులను తయారు చేయాలి. ఆ పద్దులను, ప్రత్యేకంగా దీని కోసం నియమించిన ఆడిటర్ చేత ధృవీకరింపచేసి, వాటిని ప్రభుత్వానికి సమర్పించాలి. వాటి ప్రతిని ప్రభుత్వం రాష్ట్ర చట్ట సభలు రెండింటిలోనూ ప్రవేశపెట్టాలి. 2010 జూన్ నాటికి, 2007-08 నుండి 2009-10 వరకూ వార్షిక లెక్కలను తయారుచేయలేదని ఆడిట్ గమనించింది. ప్రతి ఏటా బోర్డు మీటింగులు జరగకపోవడంతో, ముందు సంవత్సరాల లావాదేవీలకు సంబంధించిన కొన్ని ఖాతాలను ముగించక పోవడమే ఈ జాప్యానికి కారణమని ఉడా పేర్కొంది. 2007 ఆగష్టు నుండి 2010 జూలై మధ్య మూడేళ్లలో బోర్డు మీటింగులు జరగనేలేదు. ఉడా విషయంలో ఇది చాలా తీవ్రమైన లోపం. వార్షిక పద్దులను తయారుచేయకపోవడం వల్ల ఆ సంస్థ ఆర్థిక స్థితి గురించి ఖచ్చితమైన భరోసా ఇవ్వలేము. అవకతవకలు, మోసాలు మొదలైనవి వెలుగు చూడకుండా వుండిపోయే అవకాశం లేకపోలేదు.

2007-08 నుండి 2008-09 సంవత్సరాలకు వార్షిక పద్దుల సంకలనం జరుగుతోందని ఉడా తెలిపింది (2010 అక్టోబరు).

క్యాష్-బుక్కు నిర్వహణ లోపభూయిష్టంగా వుంది. నగదు పుస్తకంలోని అంకెలను బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిపోల్చి చూడడంలేదు

### 2.3.8.2 నగదు పుస్తకం నిర్వహణ సక్రమంగా లేకపోవడం

ఉడాకి నాలుగు జాతీయ బ్యాంకులలో 21 బ్యాంకు ఖాతాలున్నాయి. ఈ ఖాతాలకు సంబంధించిన నగదు పుస్తకాల (క్యాష్ - బుక్కుల) నిర్వహణ ఈ క్రింది విధంగా లోపభూయిష్టంగా వుంది :

**క్యాష్-బుక్కులో ప్రారంభ/ముగింపు నిల్వలను నమోదు చేయకపోవడం**

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ కోడ్‌లోని నియమం-10 లోని ఉప నియమం-3, నియమం-11 లోని ఉప నియమం-2 ప్రకారం, ప్రతిరోజూ, ఇంకా ప్రతినెలాఖర్లోనూ క్యాష్-బుక్కును ఎప్పటికప్పుడు క్లోజింగు చెయ్యాలి. అంతే కాకుండా, ముగింపు నిల్వలను ముందుకి తీసుకువెళ్లాలి. 2005 - 10 మధ్య ఐదేళ్లలో ఉడా నిర్వహించిన క్యాష్-బుక్కులలో నెలవారీ ప్రారంభ/ముగింపు నిల్వలను చూపించలేదు. కేవలం సంవత్సరం వారీ వసూళ్లు, చెల్లింపులను మాత్రమే ఉడా నిర్వహిస్తోంది.

బ్యాంకుతో లెక్కలను సరిచూడడం (బ్యాంకు రీకన్సిలియేషన్) సరిగా జరగనందున (తరువాతి పేరా కూడా చూడండి) ముగింపు నిల్వలను ముందుకు తీసుకెళ్లలేదని ఉడా పేర్కొంది (2010 అక్టోబరు).

**లెక్కలు సరిచూడడం (రీకన్సిలియేషన్)**

ఆంధ్రప్రదేశ్ బడ్జెటు మాన్యువల్ లోని పేరా 19.6 ప్రకారం, ప్రతినెలా, ఇంకా ప్రతి సంవత్సరాంతంలోనూ, క్యాష్-బుక్కు అంకెలను బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిచూడాలి. 2005-10 మధ్య ఐదేళ్ల కాలంలో ఉడా లోని లెక్కల విభాగం క్యాష్-బుక్కు అంకెలను బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిచూడలేదని ఆడిట్ గమనించింది. ఆ విధంగా సరిచూడకపోవడం వల్ల, మొత్తాలన్నీ బ్యాంకుల్లో సక్రమంగా జమ ఔతున్నాయా లేదా అన్న నిర్ధారణ జరగడం లేదు. దీనివల్ల నిధుల దుర్వినియోగం/ ధనాపహరణలు జరిగే ప్రమాదం ఉంది.

ఇంతకు ముందు జరిగిన ఆడిట్లలో, పై లోపాలను/పొరపాట్లను పదేపదే ఎత్తి చూపినప్పటికీ, ఉడా ఎటువంటి దిద్దుబాటు చర్యలూ తీసుకోలేదు. ఫలితంగా, ఈ లోటుపాట్లు ఇంకా కొనసాగుతున్నాయి.

ప్రాధాన్యత ప్రాతిపదికపై రీకన్సిలియేషన్ పనిని చేపట్టామని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు).

### 2.3.8.3 అభివృద్ధి కార్యకలాపాలకు నిధులను వినియోగించకపోవడం

అభివృద్ధి కార్యకలాపాలపై నిధుల (అభివృద్ధి చార్జీలుగా వసూలు చేసిన) వినియోగం స్వల్పంగా 39 శాతం మాత్రమే ఉంది

చట్టంలోని సెక్షన్ 27, ప్రభుత్వ ఆదేశాల (1996 ఫిబ్రవరి) ప్రకారం పట్టణాభివృద్ధి సంస్థలు తమ ఆదాయంలో 85 శాతాన్ని మాస్టర్ ప్లాన్ లోని వివిధ అంశాలపై, అంటే ట్రాఫిక్‌ను మెరుగుపరచడం, వంతెనల నిర్మాణం, పచ్చదనం, పార్కుల అభివృద్ధి మొదలైన అభివృద్ధి కార్యకలాపాల కోసం వినియోగించాలి. మిగతా 15 శాతాన్ని పరిపాలన, ఇతర నిర్వహణలకి వినియోగించవచ్చు.

2005-06 నుండి 2009-10 మధ్య సంవత్సరాలలో, లేఔటు/భవన నిర్మాణ ఆమోదాలకు రూ46.03 కోట్ల అభివృద్ధి చార్జీలను ఉడా వసూలు చేసింది. ఇందులో అభివృద్ధి కార్యకలాపాల కోసం వినియోగించాల్సిన రూ39.13 కోట్ల (85 శాతం) లో రూ17.95 కోట్లు (39 శాతం) మాత్రమే అభివృద్ధికి వినియోగించారు. మిగిలిన రూ21.18 కోట్లు ఖర్చు చేయకుండా వుండి పోయింది. మాస్టర్‌ప్లాన్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో తగ్గుదలకి ఇది కూడా ఒక ముఖ్యమైన కారణం కావచ్చు.

2010-11 సంవత్సరంలో ప్రతిపాదించే అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగిస్తామని ఉడా సమాధానమిచ్చింది (2010 అక్టోబరు).

### 2.3.9 ప్రజా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం

**ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి సరైన నియంత్రణ యంత్రాంగం లేదు**

ఉడా ప్రజలతో వ్యవహరించాల్సిన సంస్థ. ప్రజల ఫిర్యాదులను ప్రభావవంతంగా పరిష్కరించాలంటే ఫిర్యాదులు రిజిస్ట్రీ చేసుకోడానికి, వాటిని అనుసరించడానికి, పర్యవేక్షణకి, ఫిర్యాదులను తీసుకోడానికి, వాటికి రసీదు ఇవ్వడానికి, ఫిర్యాదులను రికార్డు చేయడానికి, ఫిర్యాదులను వరుసక్రమంలో (మొదట అందినవి మొదటగా) వరుసగా పరిష్కరించడానికి, ఫిర్యాదుల రిజిస్టరులో తీసుకున్న చర్యలను వ్రాయడానికి, అవసరమైన చోట పై అధికారి ద్వారా ఫిర్యాదులను పరిష్కరించే పద్ధతిని నియతకాలికంగా పర్యవేక్షించడానికి ఒక కట్టుదిట్టమైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఉండాలి. ఐతే, అటువంటి వ్యవస్థ లోపించింది.

లేఔట్లను ఆమోదించడం, దుకాణాల/కార్యాలయ సముదాయాలను కేటాయించడం మొదలైన వివిధ పనులను సత్వరమే పరిష్కరించడానికి ఒక సిటిజెన్ చార్టర్ ఉంది కాని, ప్రత్యేకంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార విభాగం ఉడా లో లేదు.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ (2010 అక్టోబరు), ప్రస్తుతం శాఖాధిపతులందరూ నేరుగా ప్రజల ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారనీ, త్వరలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని నెలకొల్పుతామనీ ఉడా హామీ ఇచ్చింది. ఫిర్యాదుల నమోదు వాటి పరిష్కారానికి సంబంధించి ఎటువంటి రికార్డు లేదు కనుక ప్రజా ఫిర్యాదుల పరిష్కారం విషయంలో నాణ్యమైన సేవలను అందిస్తున్నారన్న భరోసా లేదు.

### 2.3.10 అంతర్గత తనిఖీ

**ఉడా లో అంతర్గత తనిఖీ లేదు**

అంతర్గత తనిఖీ అనేది, శాఖాపరమైన నియమాలను, పద్ధతులను ఏమేరకు పాటిస్తున్నారన్న విషయాన్ని పరిశీలించి, ప్రస్తుతం వున్న అంతర్గత నియంత్రణల సముచితత్వంపై నిర్వాహకులకు తగిన భరోసానిస్తుంది. సంస్థ పద్దులు ఖచ్చితంగా ఉండేలా, సంస్థ ఆర్థిక లావాదేవీలను సక్రమంగా ప్రతిబింబించేలా చూడడమే అంతర్గత తనిఖీ ప్రాథమిక విధి.

అయితే, ఉడాలో వివిధ విభాగాల్లో అంతర్గత తనిఖీ నిర్వహించడానికి అంతర్గత తనిఖీ విభాగాన్ని నెలకొల్ప లేదని ఆడిట్ గమనించింది (2010 అక్టోబరు). అంతర్గత తనిఖీ లేకపోవడం వల్ల, సంస్థలోని వివిధ విభాగాలు నియమాలను, పద్ధతులను పాటిస్తున్నాయన్న భరోసా లేదు.

అంతర్గత తనిఖీ లేకపోవడానికి సిబ్బంది కొరతే కారణమని చెబుతూ, ప్రభుత్వం అదనంగా సిబ్బందిని మంజూరు చేసిన తరువాత అంతర్గత తనిఖీ నెలకొల్పుతామని, దానికి ఇంతకుముందే ప్రతిపాదనలు పంపామని ఉడా సమాధానమిచ్చింది.

### 2.3.11 సారాంశం

నగరాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరచి, నగరవాసుల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం స్థాపించిన ఈ పట్టణాభివృద్ధి సంస్థ తన లక్ష్యాలను సాధించడంలో చాలావరకు విఫలమయ్యింది. మొదటి మాస్టర్ ప్లాన్‌లో లక్ష్యసాధన చాలా తక్కువగా (64 నుండి 100 శాతం) ఉందని ఆడిటు గమనించింది. మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయడంలో సంబంధిత శాఖలు/సంస్థలతో సమన్వయం లోపించింది. మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా, ఒక్కో కేసులో ఒక్కో విధంగా భూవినియోగంలో మార్పుకి ఆమోదాలు ఇవ్వడం ద్వారా భూమి యజమానులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. ఆ విధంగా మాస్టర్ ప్లాన్ మాన్యతను నీరుగార్చారు. కాంట్రాక్టు నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. వార్షిక పద్దులను తయారుచేయడంలో బకాయిలు ఉన్నాయి. నగదు పుస్తకం నిర్వహణలో లోపాలున్నాయి. నగదు పుస్తకం నిల్వలను బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిపోల్చి చూడడం లేదు. సంస్థలో అంతర్గత తనిఖీ లేదు. ఉడాలోని వివిధ విభాగాలు నియమాలను, పద్ధతులను పాటిస్తున్నాయన్న భరోసా లేదు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థ ఏదీ లేకపోవడమనేది, తన బాధ్యతలను నిర్వర్తించడంలో సంస్థకు గాంభీర్యత లేకపోవడాన్ని సూచిస్తోంది.

### 2.3.12 సిఫార్సులు

- మాస్టర్‌ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించడానికి, సంబంధిత శాఖలు/సంస్థలన్నింటితో ప్రభావవంతమైన సమన్వయం ఉండాలి. మాస్టర్‌ప్లాన్‌లోని నిబంధనలను పాటించేలా చూడాలి.
- మౌలిక వసతులు/ప్రాజెక్టులు భారీ రాబడులతో కూడుకున్న వ్యవహారాలు కనుక, వాటిలో హౌసింగు రాబడులను కాపాడేందుకు, కాంట్రాక్టు నిర్వహణను క్రమబద్ధం చేయాలి.
- వార్షిక పద్దులను సకాలంలో తయారుచేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి.

పైన తెలిపిన ఆడిటు పరిశీలనలపై ఉడా ఇచ్చిన సమాధానాలనే ప్రభుత్వం పంపింది (2010 అక్టోబరు). కానీ, వాటిపై తమ అభిప్రాయాలను తెలుపలేదు.

## యువజనాభివృద్ధి, పర్యాటకం, సాంస్కృతిక (యువజన సేవల) శాఖ

## 2.4 రాజీవ్ యువశక్తి

### 2.4.1 ఉపోద్ఘాతం

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2004 నవంబరులో రాజీవ్ యువశక్తి (ఆర్.వై.ఎస్.) కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని శిక్షణ, ఉపాధి అభివృద్ధి సంఘం (ఎస్.టి.ఇ.పీ.) జిల్లాస్థాయిలో నిర్వహిస్తుండగా, యువజనసేవల శాఖ కమిషనరు (సి.వై.ఎస్.)[61] దీనిని పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో మూడు[62] భాగాలున్నాయి. మొత్తమ్మీద, 93,309 యూనిట్లు పనిచేస్తున్నాయి. వీటికి 2006-10[63] మధ్య కాలంలో రూ106.25 కోట్లు సబ్సిడీ ఇచ్చారు.

ఒక్కో అంశం కింద ఇవ్వవలసిన ఆర్థికసాయం మొత్తాన్ని మార్గదర్శకాలలోనే నిర్దేశించారు. ఈ సాయం రూ50,000 నుంచి రూ 5 లక్షల వరకూ ఉంటుంది. యూనిట్ వ్యయంలో 20 శాతం మొత్తాన్ని సబ్సిడీగా సి.వై.ఎస్. ముందే విడుదల చేస్తారు. యూనిట్ వ్యయంలో 70 శాతం బ్యాంకులు ఋణంగా ఇస్తాయి. మిగతా 10 శాతాన్ని లబ్ధిదారులు భరించాలి.

2006-07 నుంచి 2009-10[63] మధ్య కాలంలో ఈ కార్యక్రమం అమలుకు సంబంధించి, నాలుగు[64] జిల్లాల్లోని ఎస్.టి.ఇ.పి. ల రికార్డులను పరిశీలించటం జరిగింది. లక్ష్యంగా నిర్ణయించిన 29,663 యూనిట్లకుగాను 18,975 యూనిట్లు (64 శాతం) మంజూరు కాగా సబ్సిడీ మొత్తం రూ25.11 కోట్లు ఉంది. రికార్డుల పరిశీలనలో ఈ దిగువ విషయాలు తెలిశాయి.

**ఆడిట్ పరిశీలనలు**

### 2.4.2 లబ్ధిదారుల ఎంపిక

#### 2.4.2.1 అర్హత ప్రమాణాలపై తగినంత ప్రచారం

**అర్హత ప్రమాణాలు, చేపట్టతగిన కార్యకలాపాలపై తగు ప్రచారమివ్వలేదు**

పథకంలోని ప్రతి ఉప అంశానికీ విడివిడిగా అర్హత ప్రమాణాలను మార్గదర్శకాలలో పొందు పర్చారు. సాధారణ ప్రమాణం ప్రకారం, దరఖాస్తుదారుల వయస్సు 18 - 35 సంవత్సరాల మధ్య ఉండాలి. కుటుంబ సంవత్సరాదాయం రూ50,000 లకు మించరాదు. వ్యక్తిగతంగా దరఖాస్తుదారులు పదవ తరగతి (పాసైన లేదా తప్పిన)/వృత్తి సంబంధకోర్సులు వంటివి చేసిన వారై ఉండాలి. సామూహికంగా అయితే వారిలో కనీసం ఒక సభ్యుడైనా 10వ తరగతి పాసై ఉండాలి. మిగతావారు 7వ తరగతి పాసై ఉండాలి. వ్యక్తిగత చిరువ్యాపారుల వర్గంలో ప్రయోజనం పొందగోరే వ్యక్తి అక్షరాస్యుడు (7వ తరగతి పాసు లేదా ఫెయిల్) అయి ఉంటే చాలు.

పథకం గురించి, అర్హత ప్రమాణాలు, ఆర్థిక సాయం పరిమాణం వంటి వివరాలు దరఖాస్తుదారులకు తెలియాలంటే ప్రచార ప్రకటనలు అవసరం. ఐతే, అర్హత ప్రమాణాలు, ఈ పథకం కింద చేపట్టతగిన కార్యకలాపాలు, ప్రాజెక్టు రిపోర్టు రూపొందించేందుకు మార్గదర్శకాలు, భాగస్వామ్య బ్యాంకుల పరిధి, దరఖాస్తులు సమర్పించే విధానం, ఇంటర్వ్యూల తేదీలు, ఫలితాలు ప్రకటించే చోటు మొదలైన వివరాలను తెలిపే ప్రకటనలేవీ ఇవ్వలేదు.

---

[61] ఏ.పి.ఎస్.టి.ఈ.పీ. సంస్థకు సి.వై.ఎస్ పదవి రీత్యా మేనేజింగ్ డైరెక్టరు. ఇది ఎస్.టి.ఇ.పి. అనుబంధ సంస్థ

[62] వ్యక్తిగత (చిరువ్యాపారాల) ప్రాజెక్టు వ్యయం రూ0.50 లక్షలు; వ్యక్తిగత ప్రాజెక్టు వ్యయం రూ1 లక్ష; సామూహిక ప్రాజెక్టు వ్యయం రూ3 లక్షల నుంచి రూ5 లక్షల వరకు

[63] బడ్జెటులో నిధులు కేటాయించినా, 2009-10 లో అసలు విడుదల చేయలేదు. ఈ సంవత్సరం కార్యక్రమం అమలు జరగలేదని సి.వై.ఎస్. తెలిపారు

[64] చిత్తూరు, తూర్పుగోదావరి, మెదక్, విశాఖపట్నం

పైన పేర్కొన్న వివరాలేవీ లేకుండా కేవలం వార్తాంశాల మాదిరి నోటిఫికేషన్లు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా మినహా మిగతా జిల్లాలలో కార్యకలాపాల వారీగా ప్రతి సబ్ స్కీం కింద ఆర్థిక సహాయం పొందడానికి మార్గదర్శకాలను తెలిపే పుస్తకాలు, బ్రోచర్లు దరఖాస్తుదారులకు అందించలేదు.

లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించే ప్రక్రియలో పారదర్శకత తీసుకురావటానికి రశీదులు ఇవ్వటం, ఫలితాలు ప్రకటించటం వంటి విధానాలేవీ ఎస్.టి.ఇ.పి. లు అనుసరించలేదు.

### 2.4.2.2 అర్హతప్రమాణాల పరిశీలన, ప్రతిపాదిత ప్రాజెక్టు, కార్యకలాపాల సామర్థ్యం మదింపు

**లబ్ధిదారుల ఎంపిక లోపభూయిష్టంగా ఉంది**

ప్రాజెక్టు రిపోర్టులను మదింపు చేయడం, ఆదాయం, విద్యార్హత, కులం పరంగా దరఖాస్తులను పరిశీలించి అర్హతను నిర్ణయించే బాధ్యత మార్గనిర్దేశకాలరీత్యా మండల పరిషత్ అభివృద్ధి అధికారులది (ఎం.పి.డి.ఓ.). ఆడిట్ పరిశీలనల్లో ఈ దిగువ విషయాలు తెలిశాయి :

- పథకం మార్గదర్శకాల ప్రకారం ప్రతి లబ్ధిదారుడూ తనుచేయబోయే వ్యాపారానికి సబంధించి, వ్యక్తిగత/ సామూహిక వర్గం కింద ప్రాజెక్టు రిపోర్టు సమర్పించాలి. ఆ వ్యాపారం సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు గానూ ఒక డిజిగ్నేటెడ్ కమిటీ[65] ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించాల్సి ఉంది . ఈ పథకం అమలు చేయటంలో అలాంటి కీలకమైన కసరత్తు కొరవడింది;
- నాలుగు జిల్లాల్లో మంజూరైన మొత్తం 18,975 దరఖాస్తులకుగానూ 1,813 దరఖాస్తులను ఆడిటు మచ్చుకు పరిశీలించగా, 68 మంది దరఖాస్తుదారులు మాత్రమే ప్రాజెక్టు రిపోర్టులు సమర్పించారు. మిగతా 1,745 మందికి, ప్రాజెక్టు రిపోర్టులు లేకుండానే సబ్సిడీ ఇచ్చారు. వీరి విషయంలో యూనిట్ వ్యయాన్ని అడ్‌హాక్ ప్రాతిపాదికన నిర్ణయించారు. చిత్తూరు, తూర్పుగోదావరి, మెదక్ జిల్లాల ఎస్.టి.ఇ.పీ.లు ప్రాజెక్టు రిపోర్టులు అడగనేలేదు. విశాఖపట్నం జిల్లాలో లబ్ధిదారులు 2005-06 లో తమ ప్రాజెక్టు రిపోర్టులు పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమం (ఇ.డీ.పీ.) కి హాజరైనప్పుడు సమర్పించినా గానీ డిజిగ్నేటెడ్ కమిటీ వాటిని పరిశీలించనే లేదు.
- యాజమాన్య నైపుణ్యం కలిగి ఉండటం అత్యంత ప్రధాన ఆవశ్యకత కాగా, చెక్ స్లిప్‌లో దీనికి చోటు కల్పించకపోవటంతో పథకంలో ముఖ్యాంశమైన ఇ.డీ.పీ. శిక్షణ ప్రాధాన్యతను తగ్గించినట్లైంది. మరొక ప్రామాణికంలో కూడా మొత్తమ్మీద కేవలం పదిమార్కులే పొందిన దరఖాస్తుదారులను ఎంపిక చేశారు;
- లబ్ధిదారుల గ్రూపులను రిజిస్టరు చేయాల్సి ఉన్నా, చిత్తూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లా యువజన సంక్షేమ అధికారులు వీటిని రిజిస్టరు చేయలేదు.
- ప్రతి లబ్ధిదారుడు తన యూనిట్ ఏర్పరచుకోగానే దాని డిజిటల్ ఫోటోగ్రాఫ్ సమర్పించాల్సి ఉన్నా, చిత్తూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లా ఎస్.టి.ఇ.పి.లు వీటిని తీసుకోలేదు.
- తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలలో లబ్ధిదారుల వ్యక్తిగత, ఆస్తుల భీమా వివరాలను ఎస్.టి.ఇ.పి.లు తీసుకోలేదు.

ఆ విధంగా, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొత్తం లోపభూయిష్టంగానూ, నిర్హేతుకంగానూ ఉంది.

ఎస్.టి.ఇ.పి.లు ఆడిట్ అభ్యంతరాలను అంగీకరిస్తూ (2009 నవంబరు-డిశంబరు) తగు చర్యలు తీసుకొంటామని హామీనిచ్చాయి.

[65] మండల పరిషత్, ఎస్.టి.ఇ.పి., బ్యాంకు ప్రతినిధులు కమిటీ సభ్యులుగా ఉంటారు

తాసీల్దారులు[66] ఇచ్చిన వివిధ ధృవపత్రాలను పరిశీలించే యంత్రాంగాన్ని కూడా ఆడిట్ లో మదింపు చేయటం జరిగింది. ఆ పరిశీలన యంత్రాంగం కూడా లోపభూయిష్టంగానే ఉన్నది. ఆ వివరాలు ఇలా ఉన్నాయిః

- లబ్ధిదారుని కుటుంబ సంవత్సర ఆదాయం తెలిపే నమూనా ధృవపత్రం రూపొందించారు. ఐతే, తాసీల్దారులు కుటుంబ ఆదాయం బదులు లబ్ధిదారుని ఆదాయాన్ని ధృవపరుస్తున్నారు;
- ఆదాయ ధృవపత్రం ఇవ్వడానికి ముందు నిర్వహించిన తనిఖీ వివరాలు తాసీల్దారుల వద్ద లేవు. ఆ రికార్డులు లేవు కనుక తాసీల్దారులు ధృవపత్రాలు ఇచ్చేముందు వివరాలు పరిశీలించారని అనుకోలేము;
- తాసీల్దారులిచ్చిన ఆదాయ ధృవపత్రం, ఇంకా కులం, ప్రాంతీయత, చిరునామా మొదలైన ధృవపత్రాలను ఎస్.టి.ఇ.పి. లు సైతం సరిచూసుకోవటం లేదు;
- ఇంకే ఇతర పథకం కిందా సబ్సిడీ పొందని దరఖాస్తుదారులకే ఈ పథకంలో ఆర్థికసాయం ఇవ్వాలని మార్గనిర్దేశకాలలో సూచించారు. కానీ వివిధ పథకాల కింద అలా అందించిన ఆర్థికసాయం వివరాలతో ఏ స్థాయిలోనూ అధికారిక డేటాబేస్ లేదని ఆడిటు గమనించింది. ఈ అంశానికి సంబంధించి దరఖాస్తుదారులు ఇచ్చిన సొంత ధృవపత్రం మీదే ఆధారపడుతున్నారు.

తాసీల్దారులు ఆడిట్ అభ్యంతరాలను అంగీకరిస్తూ (2010 మార్చి-ఏప్రిల్) పరిశీలన యంత్రాంగానికి సంబంధించి తగువిధానాలు అనుసరిస్తామని, రిజిస్టర్లు నిర్వహిస్తామనీ చెప్పారు.

## 2.4.3 సబ్సిడీ చెల్లింపు

### 2.4.3.1 సబ్సిడీ చెల్లింపులో కొరత, ఆలస్యం

**సబ్సిడీ చెల్లింపులో కొరత 51 శాతం ఉంది**

మొత్తం 29,663 యూనిట్లకోసం వచ్చిన రూ39.50 కోట్లకు గాను ముఖ్యకార్యనిర్వహణాధికారులు (సి.ఈ.ఓ.) 18,975 యూనిట్లకు రూ25.11 కోట్లు మాత్రమే చెల్లించారు. ఎస్.టి.ఇ.పీ.ల నిర్వహణ లోపం వలన 10,688 యూనిట్లకు (36 శాతం) ప్రయోజనం చేకూరలేదు. ఈ లోపం విశాఖపట్నంలో అత్యధికంగా 51 శాతం ఉండగా, తదుపరి తూర్పుగోదావరి జిల్లాలో 39 శాతం ఉంది.

**బ్యాంకులు ఋణాలు ఇవ్వడంలో విపరీతమైన జాప్యం జరుగుతోంది**

మార్గనిర్దేశకాల ప్రకారం ఎస్.టి.ఇ.పీ.లు మంజూరుచేసిన 10 రోజులలోగా బ్యాంకులు సబ్సిడీ విడుదల చేయాలి. బ్యాంకులు ఋణాలివ్వటంలో జాప్యం జరుగుతున్నట్లు నాలుగు జిల్లాల్లోనూ ఆడిటు గమనించింది. ఫలితంగా 2005-06 కు కేటాయించిన నిధులు 2006-07 లోనూ, 2006-07 నిధులు 2007-08 లోనూ, అలా వినియోగించటం జరుగుతోంది. సబ్సిడీకి సంబంధించిన రూ11.60 కోట్ల[67] మొత్తం (2004-09 లో) నిరుపయోగంగా ఉండిపోయి, 8,050 మంది[68] లబ్ధిదారులకు ఉపయోగపడలేదు. ఆ వివరాలు **పట్టిక - 24** లో ఉన్నాయి.

[66] ఒకప్పటి మండల రెవెన్యూ అధికారులు

[67] చిత్తూరు : రూ2.43 కోట్లు; తూర్పుగోదావరి : రూ5.43 కోట్లు; మెదక్ : రూ1.02 కోట్లు; విశాఖపట్నం : రూ2.72 కోట్లు

[68] చిత్తూరు 1,716; తూర్పుగోదావరి 4,035; మెదక్ 751; విశాఖపట్నం 1,548

పట్టిక - 24 (రూపాయలు కోట్లలో)

| సంవత్సరం | లక్షిత యూనిట్లు | వచ్చిన సబ్సిడీ | మంజూరైన యూనిట్లు | మంజూరైన సబ్సిడీ | పెట్టిన యూనిట్లు | వినియోగించిన సబ్సిడీ | ఏర్పరచని యూనిట్లు | వాడుకోని సబ్సిడీ |
|---|---|---|---|---|---|---|---|---|
| 2004-05 | 5959 | 9.77 | 5286 | 8.06 | 4527 | 6.68 | 759 | 1.38 |
| 2005-06 | 11918 | 21.66 | 8684 | 12.62 | 7094 | 10.25 | 1590 | 2.37 |
| 2006-07 | 16337 | 22.84 | 10707 | 14.28 | 8213 | 10.94 | 2494 | 3.34 |
| 2007-08 | 6156 | 8.27 | 7269 | 10.07 | 5781 | 7.72 | 1488 | 2.35 |
| 2008-09 | 7170 | 8.39 | 6700 | 8.62 | 4981 | 6.46 | 1719 | 2.16 |
| **మొత్తం** | **47540** | **70.93** | **38646** | **53.65** | **30596** | **42.05** | **8050** | **11.60** |

ఎస్.టి.ఇ.పి.లు సమాధానమిస్తూ (2009 నవంబరు - డిశంబరు) కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం, సి.వై.ఎస్. గడువు తేదీలు పొడిగించటం, లబ్ధిదారులు ప్రధాన నగరాలకు వలసపోవటం, ఇంకా అదనపు సెక్యూరిటీ సమర్పించక పోవటం ఈ జాప్యానికి కారణాలుగా చెప్పారు. దీనికి తోడు, బ్యాంకులు కూడా అదనపు సెక్యూరిటీ కోసం పట్టుబట్టాయి. ఇది పథకం మార్గదర్శకాలకు విరుద్ధం.

### 2.4.3.2 గ్రూపు యూనిట్లకు సబ్సిడీ మంజూరు

నాలుగు జిల్లాల్లోనూ కలిపి 2006-09 సంవత్సరాలలో 1,589 కొత్త యూనిట్లు[69] (ప్రాజెక్టు వ్యయం రూ66.23 కోట్లు; సబ్సిడీ రూ9.28 కోట్లు) స్థాపించి, సామూహిక పథకం కింద 7,945 మందికి ప్రయోజనం కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఐతే, 381 యూనిట్లు/గ్రూపులు[70] మంజూరు కాగా1,080 మంది లబ్ధిదారులతో 217 యూనిట్లు/గ్రూపులు[71] మాత్రమే నెలకొల్పారు. సబ్సిడీ రూ1.79 కోట్లు (19 శాతం) (ప్రాజెక్టు వ్యయం; రూ8.94 కోట్లు అంటే 13 శాతం) మాత్రమే వినియోగమయింది. నిర్వహణ లోటు 81 శాతం ఉంది. దీని ఫలితంగా కొత్త యూనిట్లలో కొరత 1,372 ఉండి 6,865 మంది లబ్ధిదారులకు ప్రయోజనం అందలేదు. లబ్ధిదారులు వ్యక్తిగత యూనిట్ల వైపు మొగ్గుచూపడం, సభ్యుల మధ్య అంతర్గత వివాదాలు, లబ్ధిదారులు అదనపు సెక్యూరిటీని సమర్పించలేకపోవడం, పారిశ్రామిక సంస్థలు నెలకొల్పేందుకు ఇ.డీ.పీ. తగు మాత్రం లేకపోవడం వంటివి వైఫల్యానికి కారణాలుగా ఎస్.టి.ఇ.పీ.లు పేర్కొన్నాయి (2009 నవంబరు).

### 2.4.3.3 ప్రాజెక్టు వ్యయం కుదింపు

దరఖాస్తుదారుల నుంచి ప్రాజెక్టు రిపోర్టులు/ బ్యాంకుల నుంచి అసెస్‌మెంట్ రిపోర్టులు తీసుకోకుండానే ఎస్.టి.ఇ.పీ. లు ప్రాజెక్టు వ్యయం లెక్క కట్టాయి

చిత్తూరు జిల్లా (రు 25.90 లక్షలు), తూర్పుగోదావరి (రూ21.50 లక్షలు), విశాఖపట్నం (రూ61.20 లక్షలు) జిల్లాల్లో 76 మంది దరఖాస్తుదారులు మొత్తం రూ1.09 కోట్ల ఆర్థికసాయం అర్థించారు. వీరి ప్రాజెక్టు వ్యయం 25 నుంచి 75 శాతం దాకా కుదించి, ఎస్.టి.ఇ.పీ.లు రూ65.70 లక్షలు (చిత్తూరు రూ15.15 లక్షలు; తూర్పుగోదావరి రూ10.65 లక్షలు; విశాఖపట్నం రూ39.90 లక్షలు) మాత్రమే మంజూరు చేశాయి. మరోవైపు చిత్తూరు ఎస్.టి.ఇ.పీ. అడిగిన దానికన్నా ఎక్కువగా యూనిట్ వ్యయం మంజూరుచేసింది. ఇది పరస్పర విరుద్ధ ధోరణిని సూచిస్తోంది. ప్రతిపాదించిన యూనిట్ గురించి దరఖాస్తు దారులకు ఎరుక లేకపోవడం,

[69] చిత్తూరు(388), తూర్పుగోదావరి(540), మెదక్(267), విశాఖపట్నం (394)

[70] చిత్తూరు(61), తూర్పుగోదావరి(124), మెదక్(32), విశాఖపట్నం (164)

[71] చిత్తూరు(32), తూర్పుగోదావరి(73), మెదక్(17), విశాఖపట్నం (95)

అలాగే యూనిట్ తరహా, ప్రాంతం, దరఖాస్తుదారుని అవగాహన దృష్ట్యా సెలక్షన్ కమిటీ మదింపు - ఈ కారణాల వలన ప్రాజెక్టు వ్యయంలో హెచ్చుతగ్గులు వచ్చినట్టు ఎస్.టి.ఇ.పీ.లు పేర్కొన్నాయి (2010 ఏప్రిల్). ఐతే, దరఖాస్తు దారుల నుంచి ప్రాజెక్టు రిపోర్టులు, బ్యాంకులనుంచి అసెస్మెంట్ రిపోర్టు అడిగితీసుకోకుండా నే ఎస్.టి.ఇ.పీ.లు ప్రాజెక్టు వ్యయం కుదించటం వలన ప్రాజెక్టులకు చాలినన్ని నిధులు అందకపోవడమేకాక, అంతిమంగా యూనిట్లు మూతపడేందుకు సైతం దారితీస్తాయి.

**2.4.3.4 యూనిట్ల మంజూరులో అవకతవకలు**

| విషయం | ఆడిటు పరిశీలన |
|---|---|
| **సంపద ఆధారం కాని వ్యాపార కార్యకలాపాలు** | కిరాణా, జనరల్ స్టోర్ వంటి సంపద దన్ను లేని వ్యాపారాలను కాకుండా ఆయా ప్రాంతాలకు అనువుగా ఉండి, సంపదల ఆధారంగా సాగే వ్యాపారాలకు తగు ప్రచారం కల్పించి ప్రోత్సహించాలని సి.వై.ఎస్. 2007 జూన్ లో జిల్లా కలెక్టర్లకు సూచించారు. రికార్డులు పరిశీలించగా బట్టలు/ చీరల వ్యాపారాలు, మహిళా ఎంపోరియం, కిరాణా-జనరల్ స్టోర్ వంటి సంపద ఆధారం కాని వ్యాపారాలకే ఎస్.టి.ఇ.పీ.లు మంజూరు చేస్తున్నట్లు తేలింది. ఈ విధమైన కార్యకలాపాలకు 2007-09 లో ఇచ్చిన మొత్తం సబ్సిడీ రూ3.63 కోట్లు[72]. జిల్లా వారీ వివరాలు ***అనుబంధం - 2.13*** లో ఉన్నాయి. |
| **ఇప్పటికే ఉన్న యూనిట్ల కు మంజూరు** | ఇదివరకే కొనసాగుతున్న 29 యూనిట్లకు రూ27.99 లక్షల[73] ఆర్థిక సాయం (ప్రాజెక్టు వ్యయం 31.10 లక్షలు) నియమాలకు విరుద్ధంగా ఇచ్చారు. కొత్త వ్యాపారం ప్రారంభించనున్న ప్రాంగణం వివరాలు తెలుసుకోవటం, ఆ యూనిట్లను ముందుగా పరిశీలించటం లాంటివి అధికారులు చేసినట్లు లేదు. ఇది వారి అజాగ్రత్తను సూచిస్తోంది. |
| **అర్హతలేని వారికి మందులషాపులు** | మందుల దుకాణం నెలకొల్పుకునేందుకు సబ్సిడీ పొందాలంటే ఫార్మసీలో డిప్లొమా కలవారై ఉండాలి. తూర్పుగోదావరి, మెదక్, విశాఖపట్నం జిల్లాలలో ఎస్.టి.ఇ.పి.[74] మంజూరు చేసిన 34 మందుల దుకాణాలలో 32 దుకాణాలను మెట్రిక్యులేట్ (ఎస్.ఎస్.సి) అభ్యర్థులకు ఇచ్చారు. ఇది తీవ్రమైన తప్పిదం. |
| **ఆవులు/గేదెలకు బీమా** | ఎస్.టి.ఇ.పి.లు పశుసంవర్ధక రంగంలో 2,633 పాడిపరిశ్రమ యూనిట్లను[75] మంజూరు చేశాయి. వీటికి రూ2.63 కోట్ల[76] సబ్సిడీ విడుదల చేశాయి. ఆవులు/గేదెలను బీమా చేయాల్సిన అవసరమున్నా, అలా బీమా చేసిన పశువుల వివరాలు ఎస్.టి.ఇ.పి.ల వద్ద లేవు. |

[72] 2007-08 రూ2.11 కోట్లు, 2008-09 రూ1.52 కోట్లు

[73] చిత్తూరు 10 యూనిట్లు రూ1.42 లక్షలు (రూ7.10 లక్షలు); తూర్పుగోదావరి 9 యూనిట్లు రూ2.30 లక్షలు (రూ11.50 లక్షలు); మెదక్ 3 యూనిట్లు రూ0.40 లక్షలు (రూ2 లక్షలు); విశాఖపట్నం 7 యూనిట్లు రూ2.10 లక్షలు (రూ10.50 లక్షలు); లబ్ధిదారులు సమకూర్చుకున్న 10 శాతం కాక

[74] చిత్తూరు జిల్లాకి సంబంధించిన సమాచారం లేదు

[75] చిత్తూరు -1,804, తూర్పుగోదావరి - 241, మెదక్ - 334, విశాఖపట్నం - 254 యూనిట్లు

[76] చిరువ్యాపారులకు ఇచ్చే సబ్సిడీ రూ10,000 వంతున లెక్కించింది

#### 2.4.3.5 అవసరానికన్నా ముందుగా డబ్బు డ్రా చేయడం, మళ్లించటం

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ లోని ఆర్టికల్ 3 కి భిన్నంగా సి.ఇ.ఒ.లు సొమ్మును వివిధ బ్యాంకులలో మల్టిపుల్ సేవింగ్స్ ఖాతాల్లోనూ, కొన్ని సందర్భాలలో బ్యాంకులలోని టర్మ్ డిపాజిట్లలోనూ (2006-09 లో రూ39.50 కోట్లు) ఉంచుతున్నారు. టర్మ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీని పథకంతో సంబంధంలేని కార్యకలాపాలకు వినియోగించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- తూర్పుగోదావరి జిల్లా ఎస్.టి.ఇ.పి. రూ30.54 లక్షలను వెచ్చించి, భవన నిర్మాణం (రూ10 లక్షలు), భవనానికి మార్పులు, మరమ్మత్తులు (రూ4.75 లక్షలు), సిమెంటు కాంక్రీటు నిర్మాణం (రూ1.30 లక్షలు), యువజన సంఘాలకు వ్యాయామ పరికరాల కొనుగోలు (రూ2.16 లక్షలు), ప్రముఖుల పర్యటన ఖర్చులు (రూ9.60 లక్షలు), ప్రకటనలు (రూ2.73 లక్షలు) చేపట్టారు;
- విశాఖపట్నం ఎస్.టి.ఇ.పి. టర్మ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీ నుండి నియమాలకు విరుద్ధంగా[77] రూ31 లక్షలను అర్హత లేని కొత్త కార్యకలాపాలపై ఖర్చు చేసింది. ఇందులో విశాఖపట్టణం నగర పాలక సంస్థకు రూ30 లక్షలను విడుదల చేయడం, బ్రహ్మకుమారీలు నిర్వహించిన యువ యాత్రకు ఒక లక్ష రూపాయలను ఖర్చు చేయడం జరిగింది.

జిల్లా కలెక్టర్ల ఆమోదం మేరకు ఈ నిధులు వినియోగించినట్లు ఎస్.టి.ఇ.పి.లు తెలిపాయి (2009 నవంబరు - డిశంబరు). పథకం తాలూకు నిధులు ఇతర అవసరాలకు వినియోగించారు కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు.

### 2.4.4 చెల్లింపు అనంతర చర్యలు

#### 2.4.4.1 వినియోగ ధృవపత్రాలు

**బ్యాంకులిచ్చిన వినియోగ ధృవపత్రాలలో లోపాలున్నాయి**

చెల్లింపు ధృవపత్రాలనే ప్రస్తుతం బ్యాంకులు వినియోగ ధృవపత్రాలుగా ఇస్తున్నాయి. వాటిలో ఈ దిగువ లోపాలున్నాయి.

- సబ్సిడీ, ఋణం పొందినవారి పేర్లను వినియోగ ధృవపత్రాలలో పేర్కొనలేదు.
- చెల్లించిన తేదీ కూడా పేర్కొనలేదు.
- లబ్ధిదారుల వ్యక్తిగత బీమా, ఆస్తుల బీమా వివరాలు సైతం తెలియచేయలేదు.

సొమ్మును సక్రమంగా వినియోగించినట్లు లబ్ధిదారుల నుంచి ఓచర్లు తీసుకుని వాటిలో కొన్నింటిని మచ్చుకు తనిఖీ చేసే విధానమేదీ లేనందున నిధులను నిర్దేశిత అవసరాలకే వినియోగించారన్న నమ్మకంలేదు. ఇటువంటి సమాచారం సేకరించేందుకుగాను, ప్రొఫార్మాలో మరికొన్ని వరుసలు చేర్చాల్సి ఉంటుందని ఎస్.టి.ఇ.పి.లు పేర్కొన్నాయి (2009 నవంబరు - డిశంబరు)

బ్యాంకుల నుండి వినియోగ ధృవపత్రాలు వచ్చాక ఎస్.టి.ఇ.పి.లు వ్యయాన్ని నమోదు చేయాలి. చిత్తూరు జిల్లాలో రూ19.37 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాలో రూ46.01 లక్షలు, విశాఖపట్నం జిల్లాలో రూ15.93 లక్షలు కలిపి మొత్తం రూ81.31 లక్షల వ్యయం నమోదు చేయగా వీటికి ఆలంబనగా వినియోగ ధృవపత్రాలు లేవని పరిశీలనలో తేలింది. వినియోగ ధృవపత్రాలు రాకుండానే వ్యయాన్ని నమోదు చేయటం వలన ఖర్చును ఎక్కువ చేసి చూపినట్లయింది. లబ్ధిదారులకు సబ్సిడీ చెల్లింపులు వాస్తవంగా జరిగాయా అనే అనుమానాలకు ఇది దారితీస్తుంది.

[77] జనరల్ ఫైనాన్షియల్ రూల్స్ లోని నియమం - 22, ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ (సంపుటి - I) లోని అధికరణం - 3

ఆడిటు గమనించిన విషయాలను ఎస్.టి.ఇ.పి.లు అంగీకరించాయి. బ్యాంకుల నుంచి వినియోగ ధృవ పత్రాలను సంపాదిస్తామని చెప్పాయి.

#### 2.4.4.2 వసూళ్ల యంత్రాంగం

పెద్ద మొత్తం లో (65 శాతం) ఉన్న బకాయిలు పథకం వైఫల్యాన్ని సూచిస్తున్నాయి

బ్యాంకుల ద్వారా ఇచ్చిన ఋణాలను వడ్డీతో కలిపి నెలసరి వాయిదాల్లో విరామం (మారటోరియం) లేకుండా తిరిగి చెల్లించాలి. వసూళ్లను పర్యవేక్షించాల్సిన బాధ్యత మండల స్థాయిలో ఏర్పాటు చేసే రికవరీ సెల్స్‌ది. అడిట్ ఈ దిగువ విషయాలను గమనించింది :

- రికవరీ సెల్స్ ఏర్పాటు కాలేదు
- లబ్ధిదారులు వ్యాపారం నిర్వహిస్తున్న ప్రాంతం వివరాలు ఎస్.టి.ఇ.పి.లు నాలుగు జిల్లలలోనూ ఎక్కడా రాసి ఉంచలేదు. పలువురు లబ్ధిదారుల చిరునామాలు కనుక్కోవటంలో సర్వే ఏజన్సీలు[78] సైతం ఇబ్బందులు పడుతున్నాయి.
- లబ్ధిదారుల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లు, ఆస్తుల వివరాలు, గ్రూపులోని సహసభ్యులతో సమావేశాలకు సంబంధించిన మినిట్స్ మొదలైనవి తీసుకోవాల్సి ఉన్నా, ఎస్.టి.ఇ.పి.లు ఈ సమాచారం తీసుకొనలేదు.
- బ్యాంకులు లబ్ధిదారులనుంచి చేసిన వసూళ్ల సమాచారం ఎస్.టి.ఇ.పి.ల దగ్గరగానీ, సి.వై.ఎస్. దగ్గరగానీ లేదు. సకాలంలో చేసిన చెల్లింపు సంస్థ విజయవంతంగా నడవటాన్ని సూచించేది. బకాయిలను గుర్తించినా రెవెన్యూ రికవరీ చట్టం కింద వాటిని వసూలు చేయలేదు. చెల్లింపులు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టిన వారిమీద చర్య తీసుకునే వెసులుబాటు అగ్రిమెంట్లలో లేదు. ఋణబకాయిల/ఎగవేతదారుల వివరాలు బ్యాంకులకు తెలిసినా, ఆ సమాచారాన్ని అవి సి.వై.ఎస్. కు అందచేయలేదు.

ఆర్థికసాయం అందించబోయే వ్యాపారం సామర్థ్యాన్ని అంచనా వేయటం, కొత్త సంస్థకార్యకలాపాలు సాగించబోయే చిరునామాని పరిశీలించుకోకపోవటం వంటి నిర్వాహక లోపాలవలన లబ్ధిదారుల చెల్లింపుల్లో పెద్ద ఎత్తున ఎగవేతలు ఏర్పడ్డాయి.

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నుంచి ఆడిటు వాకబు చేయగా (2010 ఫిబ్రవరి) రాష్ట్రంలో మంజూరైన మొత్తం ఋణం రూ446.22 కోట్లకుగాను భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్.బి.ఐ.) రూ268.44 కోట్లు, ఆంధ్రా బ్యాంకు (ఎ.బి.) రూ177.78 కోట్ల ఋణాలు మొత్తం 62,022 యూనిట్లకు (ఎస్.బి.ఐ. : 36,235; ఎ.బి. : 25,787 యూనిట్లకు) ఇచ్చాయి. వసూలు కావలసిన మొత్తం 2009 మార్చి నాటికి రూ151.91 కోట్లు ఉండగా రూ52.73 కోట్లు మాత్రమే వసూలైంది. బకాయిలు భారీగా రూ99.18 కోట్లు (65 శాతం) ఉన్నాయి. మొత్తం రూ131 కోట్లను (ఎస్.బి.ఐ. : రూ129.48 కోట్లు; ఎ.బి. : రూ1.49 కోట్లు) ఈ రెండు బ్యాంకులు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించాయి.

### 2.4.5 పర్యవేక్షణ, అంచనా

మార్గదర్శకాలు నిర్దేశించిన (2006 ఏప్రిల్) విధంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు రెండు వారాలకోసారి యూనిట్లను పర్యవేక్షించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. యువజన సేవల శాఖలో సిబ్బంది కొరత ఉన్నందున జిల్లా కలెక్టర్లు తమ స్థాయిలో తగు యంత్రాంగాన్ని ఏర్పరుచుకోవాలని సి.వై.ఎస్. కోరారు (2007 ఫిబ్రవరి). పథకం అమలును పర్యవేక్షించే బాధ్యత నుంచి ఎస్.టి.ఇ.పి.లు ఆ విధంగా తప్పించుకున్నాయి. పథకం అమలుకు దిగువస్థాయిలో డిపార్టుమెంటు పర్యవేక్షణ లేకుండా పోయింది.

[78] మంజూరైన యూనిట్లపై సర్వే చేసే బాధ్యతను ఎ.పి.ఇండస్ట్రియల్ అండ్ టెక్నికల్ కన్సల్టెన్సీ లిమిటెడ్ కు అప్పగించారు

ఆర్.వై.ఎస్. యూనిట్ల పనితీరునీ, పరిస్థితినీ బేరీజు వేసేందుకు ప్రభుత్వాదేశాలపై 2007 మే నుంచి 2008 జూన్ వరకు మదింపు సర్వే నిర్వహించమని రెండు సెమీ గవర్నమెంట్ సంస్థలను[79] నియోగించింది. ఈ సర్వే 2,642 సంస్థలను ఆక్షేపించింది (మనుగడలో లేనివి - 1,424; పనిచేయనివి - 1,218). మూడు[80] జిల్లాలలో నిరర్థక యూనిట్లకు ఇచ్చిన సబ్సిడీ మొత్తం రూ2.59 కోట్లు[81]. ఆ వివరాలు ***అనుబంధం - 2.14*** లో ఉన్నాయి. ఈ యూనిట్ల నుంచి సబ్సిడీ సొమ్మును రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయటానికి ఎస్.టి.ఇ.పి.లు సంబంధిత కలెక్టర్లకు ఇంతవరకూ ప్రతిపాదనలు పంపలేదు. దీనికి తోడు, విజిలెన్సు - ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ చిత్తూరు జిల్లాలో తాము పరీక్షించిన 101 యూనిట్లలో 71 శాతం యూనిట్లు మనుగడలో లేకపోవడటమో, అసలు స్థాపించకపోవటమో జరిగిందనీ, ఇదివరకే నడుస్తున్న 16 యూనిట్లకు నియమాలకు విరుద్ధంగా సబ్సిడీలిచ్చారనీ తప్పుపట్టింది. ఐతే, ఈ రిపోర్టుపై ఎస్.టి.ఇ.పి 2009 అక్టోబరు వరకూ ఎలాంటి చర్యా తీసుకొనలేదు. ఆడిట్ లో పేర్కొన్న రెండు ప్రధాన లోపాలనూ ఈ నివేదిక ధృవీకరిస్తోంది.

### 2.4.6 సారాంశం

మొత్తం రూ106 కోట్లు ఖర్చుచేసిన రాజీవ్ యువశక్తి పథకాన్ని అమలు చేయడంలో వృత్తినైపుణ్యం కొరవడింది. అర్హత ప్రమాణాలు, ఈ ప్రాజెక్టు కింద చేపట్టతగిన కార్యకలాపాల గురించి ప్రచారం ఇవ్వలేదు. లబ్ధిదారుల ఎంపిక విధానం మొత్తం లోపభూయిష్టంగా ఉంది. ఇతర పథకాలు/కార్యక్రమాల కింద లబ్ధిదారులకు ఇచ్చిన ఆర్థిక సాయం గురించి కేంద్రీకృత, అధికారిక డేటాబేస్ లేదు. ప్రాజెక్టు వ్యయం నిర్ణయించేముందు దరఖాస్తుదారులనుంచి ప్రాజెక్టు రిపోర్టులు, బ్యాంకుల నుంచి అసెస్‌మెంట్ రిపోర్టులు అడిగి తీసుకోకపోవటం, సంపద అధారంకాని వ్యాపార కార్యకలాపాలకు, ఇప్పటికే మనుగడలో ఉన్న యూనిట్లకూ, అర్హత లేని వారికీ మంజూరు చేయటం, బ్యాంకులు అప్పులివ్వటంలో తీవ్రజాప్యం, బ్యాంకులిచ్చిన వినియోగ ధృవపత్రాలలో లోపాలు మొదలైనవి ఆడిటు గమనించింది. ఆర్థిక సాయం ఇవ్వబోయే వ్యాపార కార్యకలాపాల సామర్థ్యం మదింపు చేయకపోవటం, కొత్త యూనిట్లు వ్యాపారం సాగించబోయే చిరునామాని పరిశీలించుకోక పోవటం వంటి నిర్వాహక లోపాల వలన లబ్ధిదారుల చెల్లింపుల్లో పెద్ద ఎత్తున ఎగవేతలు (65 శాతం) ఏర్పడ్డాయి. భారీ ఎగవేతలు పథకం అంతగా విజయవంతం కాకపోవటాన్ని సూచిస్తున్నాయి. ఇవి ప్రభుత్వరంగ బ్యాంకుల నష్టాలకు దారితీసాయి.

### 2.4.7 సిఫార్సులు

- వివిధ ప్రభుత్వ పథకాలు/కార్యక్రమాల కింద లబ్ధిదారులకు ఇచ్చిన ఆర్థికసాయంపై ఒక కేంద్రీకృత డేటాబేస్ అన్ని స్థాయిల్లో రూపొందించాలి.
- దరఖాస్తు నమూనా, అర్హత ప్రమాణాలను డిపార్టుమెంట్ వెబ్‌సైట్‌లో ఉంచి, దరఖాస్తులను ఆహ్వానించే నోటిఫికేషన్లలో ఈ వెబ్‌సైట్ వివరాలనివ్వాలి.
- లబ్ధిదారులు ఋణాలను తీర్చేలాగున, నిధులను నిర్మాణాత్మక అవసరాలకు వినియోగించటాన్ని ధృవీకరించుకునే యంత్రాంగం ఉండాలి. చెల్లింపుల తదుపరి పర్యవేక్షణని బలోపేతం చేయాలి.

పైన పేర్కొన్న విషయాలను ప్రభుత్వానికి 2010 మార్చిలో తెలియచేసి, 2010 మేలో మరోసారి గుర్తు చేయటం జరిగింది; ఇంతవరకూ సమాధానం రాలేదు (2010 నవంబరు).

[79] ఏ.పి.ప్రొడక్టివిటీ కౌన్సిల్, ఏ.పి.ఇండస్ట్రియల్ అండ్ టెక్నికల్ కన్సల్టెన్సీ లిమిటెడ్

[80] చిత్తూరు, తూర్పుగోదావరి, మెదక్ జిల్లాలు

[81] విశాఖపట్నంలో సబ్సిడీ మొత్తం తెలియచేయలేదు